ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక



ఎఱ్ఱకోట

18-8-48 ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY వెల 4 అణాల


దేశంలో బీద స్త్రీ శిశువుల పోషణాలయాలు

అశోకవిహార్ (మద్రాసు)



నర్సులు, పసిపాపల శుభ్రతవిషయం జాగ్రత్త తీసుకొంటూ, ఆరోగ్యకరమైన ఆహారంతో వాళ్ళని నిత్యం పోషిస్తున్నారు.

మద్రాసుకార్పొరేషను సీపిల్సు పార్కులోని, "అశోకవిహార్" అను బీద శిశువుల పోషణకై కట్టిన ఆరోగ్యమందిరాన్ని పండిట్ నెహ్రూ మద్రాసు వచ్చినప్పుడు చూచి, చాలా ప్రశంసించి, ఇట్టి మందిరాలను భారతదేశమంతటా నెలకొల్పాలని సంకల్పంతో ఢిల్లీ వెళ్ళాడు. ఈ ఆరోగ్యమందిరంలో శిశురక్షణకు, ఆరోగ్యానికీ, తీసికొంటూన్న శ్రద్ధను ఈ చిత్రాలు వివరిస్తాయి.



పిల్లలకు నిత్యం పుష్టికరమైన ఆహార మిస్తున్నారు.




ఆడుకొనే ఈడుగపిల్లలందరికీ ఆరుబైట ఆరోగ్యకరంగా ఆడుకొనేందుకు, అవకాశాలున్నాయి.




"అశోకవిహార్"లో ప్రతిరోజూ పిల్లలచేత ఆరోగ్యకరమైన కసరత్తులు చేయిస్తారు

ఢిల్లీలో స్వయంసమృద్ధ స్త్రీ శిశుపోషణాలయం

ఢిల్లీ కింగ్స్వేలోని బీదల సత్రాన్ని Poor house స్వయం సమృద్ధ స్త్రీ, శిశుపోషణాలయంగా తయారుచేసే క్రొత్త పద్ధతి నవలంబించారు. 175 మంది శిశువులు, 70 మంది స్త్రీలూ మహాత్ముని వార్ధా విద్యా విధానంలో శిక్షణ నందుకొంటున్నారు. శిక్షణానంతరం, పల్లెటూళ్ళకు బయలుదేరుతారు.






వార్ధావిద్యావిధాన ప్రకారము, యువతులు అధికోత్పత్తి విధానాలలో, మందిర ఆవరణలోనే, కూరగాయల పాదులు పెట్టూ తోటపని నేర్చుకొంటున్నారు.



స్వయంసమృద్ధవిధానంలో స్త్రీశిశుపోషణాలయాలను నడపటానికి ఈ ఆశ్రమంలో శిక్షణనందుతున్న స్త్రీలు



ఆంధ్రపత్రిక

1948-వ సం॥ ఆగస్టునెల 18-వ తేది బుధవారము

మాతృభాషలో ప్రాథమిక విద్య

విద్యాభ్యసన ప్రాథమికావస్థలో బాలురకు విద్యాబోధ మాతృభాషల లోనే జరిగితీరవలెనన్న ప్రాథమిక సూత్రము నుద్ఘాటించుచు, తద్విభిన్నముగ ఏ మాత్రము వ్యవహరించినను బాలురకును, తద్ద్వారా యావత్సంఘమునకును అపారమైన హాని కలుగగలదను విద్యావేత్తల అభిప్రాయముల పురస్కరించుకొని, భారతప్రభుత్వము సర్వభారతదేశ విషయికముగా అవలంబించు ప్రాథమిక విద్యావిధానసూత్రమును ఆగస్టు 14న ఇండియాగెజట్‌లో విశదీకరించి, ప్రస్తుత రాష్ట్రప్రభుత్వములలో కొన్నిటి సంకుచితవిద్యావిధాన భావములకు స్వస్తివాచకము పలికి భవిష్యద్భారతసమైక్యమునకు సమగ్రమైన మేలు చేకూర్చినది.

“అనేక రాష్ట్రములలోనూ, సంస్థానములలోనూ సారస్వతమును, లిపియు లేకుండ బహుళసంఖ్యాకులకు మాతృభాషలుగా నున్న భాషలలో విద్యాభ్యసన మెట్లు గరపవలయును? ఒకవేళ గరపినను గల్గు ప్రయోజన మెంత”యను విషయము ప్రభుత్వ భాషావేత్తల నలజడిపెట్టినది.

నాగరకస్థితిలో నున్న జాతులలో ‘లిపి’లేకుండ నుండిన ‘తులు’ మొదలైన భాషలకు ఇప్పటికైన ‘లిపి’ కల్పించుటత్యావశ్యకమని వేరె చెప్పపక్కరలేదు. ఇక లిపి లేని భాషలు చాలమటుకు అనాగరక స్థితిలో నున్న కోయలు, సవరలు మొదలగు జాతుల భాషలు. ఆ జాతుల నాగరకస్థితికి తెచ్చి, తక్కిన దేశీయులతోపాటు పురోగమించునట్లు చేయవలసిన బాధ్యత స్వతంత్రభారత ప్రభుత్వ విద్యావేత్తల పైననే ఉన్నది. లిపి లేకున్నను తరతరములుగ జీవించుచు వచ్చిన వన, ఆ భాషలలో సహజసిద్ధముగు జీవశక్తి అనంతముగ నున్నదని రూఢి యగుచున్నది. ఆ భాషలకు లిపిసంస్కరణమును, శబ్దసంస్కరణమును చేయుటకు ఆయా రాష్ట్రప్రభుత్వములు నిష్పాక్షికులు, బహుభాషా శబ్దవేత్తలునైన పండితులను నియమించి, ఆ జాతులలో విద్యాసక్తి కల్పించి ఆ జాతుల సహజసారస్వతమును నిర్మించి, ప్రాంతీయ భాషల సహకార సౌలభ్యముతో పెంపొందించి సహజజీవశక్తితో ఆ జాతులు సక్రమముగా శీఘ్రముగ పురోగమించునట్లు చేయగల అత్యావసర కృషి చేయవలసియున్నది. పారతంత్ర్యస్థితిలో ప్రభుత్వభాషావేత్తలు ఈ విషయమున చాల అలక్ష్యము వహించుటచే ఆ జాతులవారు, ఈ నాటికీ, భారతదేశ ప్రజగ తమను భావించుకోలేక, ప్రభుత్వ దృష్టిలో దొంగలుగ, ఆటవికులుగ, అల్లరిమూకగ పరిగణనకు వచ్చి, స్వదేశభావము, స్వదేశభక్తి లేనివారుగనే నిలిచిపోయిరి. ఈ సంఖ్యాబహుళములగు జాతులను, నాగరకస్థితిలోకి నడిపించి, “భారతీయ ప్రజల”మని వారి కాత్మాభిమానము గల్పించినగాని భారతదేశ స్వాతంత్ర్యము సుస్థిరము కాదు. కాన లిపి లేకుండుటను, లిఖితసారస్వతము లేకుండుటను అభ్యంతరముగా తలపోయక ఆయా భాషలకు లిపులను కల్పించి, భావిభారతపౌరులగు ఆ జాతుల బాలకు లందరికిని ఇప్పుడే వారి భాషలలో విద్యాభ్యసనమారంభించిన శీఘ్రగమనముతో ఆ జాతులవారును తక్కిన దేశముతో కలిసి పురోగమించి, దేశక్షేమమున కండ కాగలరు. ఈ మహత్కార్య మొనరింపగల అవకాశమును భారతప్రభుత్వము దేశ నూత్నవిద్యావిధానముల నిర్ధారించుకొను ఈ సమయముననే వినియోగించుకొనుట అత్యవసరము.

ఇక రెండవ యడ్డంకు, ఇప్పటి స్థితిలో, రాష్ట్రములలో చాలమటుకు ప్రతిదియు, బహుభాషావాచ్య ప్రదేశములుగ నుండుట. “ప్రస్తుత పరిస్థితిలో ఏ ఒక్క సంస్థానములోగాని, రాష్ట్రములోగాని ఒకే భాషను, ప్రాథమికవిద్యాబోధనకైన భాషగా నియమ మొనర్చుట అసంభవము. అనేకభాషలు మాట్లాడువా రందరిపైనను ఒకే భాషను బలవంతముగ రుద్దుటచే, అసంతృప్తి, విద్వేషము, ప్రతీకారవాంఛాపూరితములయిన సంకుచితజాత్యభిమానములు ప్రబలి భారతజాతీయతకే ముప్పు దెచ్చు రాష్ట్రాభిమానములుగ ప్రబలగలవు.”

ఇచటి అడ్డంకుల పరిస్థితిని గమనించుటలో ప్రభుత్వము సునిశితబుద్ధినే ప్రకటించినది. కాని తన్నివారణము, భాషారాష్ట్రవిభజనమువల్లగాని సంపూర్ణముగా సాధ్యము కాదనియు, ఈ పరిస్థితుల దోషమే ఇన్నాళ్లనుండియు దేశభక్తులను భాషారాష్ట్ర విభజనోద్యమములకు ప్రోత్సహించుచున్నది గాని, సంకుచితస్వార్థపూరిత రాష్ట్రాభిమానములు కావనియు, కేంద్ర ప్రభుత్వము సమగ్రదృష్టితో అవగాహన చేసికొనుట అత్యవసరము. భాషారాష్ట్రవిభజనము మత విషయ విభజనమువలె కాక దేశసమైక్యమునకే ప్రోద్బలకమనియు, ఈ పరిస్థితులలో రాష్ట్రముల నిట్లే యుంచిన భాషారాష్ట్ర విభజనతో ఏ సంకుచితాభిమానవిద్వేషములు ప్రబలునని కేంద్రప్రభుత్వవర్గీయులు భయపడుచున్నారో, ఆ చీలికలే, భాషారాష్ట్ర నిర్మాణము ఆలస్యము చేసినచో సంభవించి, రాష్ట్రముల పరస్పర సహకారమునకును, దేశసమైక్యమునకును భంగమువాటిల్లునని గుర్తింపక తప్పదు. అట్టి స్థూలావరోధమును కేంద్రప్రభుత్వముముందు తొలగించి భాషారాష్ట్రములను సత్వరము నిర్మించినచో, పరిస్థితి దోషమువలన ఇట్టిచోట్ల గలిగిన, ‘మాతృభాషా’సమస్యకు చాలవరకు పరిష్కారము దొరకగలదు. స్థూలముగా ఈ సదవకాశమును ముందు కల్పించుకొనగల్గిన, ఆపైనకూడ రాష్ట్రములలో మిగిలెడు అల్పసంఖ్యాకవర్గముల విషయములలో కేంద్రప్రభుత్వము రాష్ట్రప్రభుత్వములకు సూచించిన విధానము, శ్రేష్ఠముగ నుపకరింపగలదు. అప్పుడు, ‘ప్రాంతీయ భాష’, ‘మాతృభాషల’ నిర్వచన ద్వంద్వావకాశములతో, రాష్ట్రప్రభుత్వములు సంకుచితవిధానము లవలంబించు అవకాశములుకూడ సన్నగిలగలవు. మద్రాసు, బొంబాయి, కలకత్తా మొదలగు బహుభాషా ప్రదేశముల విషయములో కేంద్రప్రభుత్వము సూచించిన విద్యాబోధన విధానము భేదాభిప్రాయములకు తావు లేకుండ శ్రేష్ఠముగ నున్నది. కాని ‘మాతృభాష’లోవిద్యాభ్యసన మొనర్చు బాలర ‘కనిష్ఠ’ సంఖ్యను దురవకాశముగా తీసికొని, విద్యాధికారులు అల్పసంఖ్యాకవర్గములకు హాని కల్గించకుండ రాష్ట్రప్రభుత్వములు సత్యనిష్ఠతో వ్యవహరించిన తప్ప కేంద్రప్రభుత్వ ఆశయములు సంపూర్ణముగా సఫలత నొందవు.

మద్రాసు గవర్నరు


సర్ ఆర్చిబాల్డునైగారి తర్వాత మద్రాసు గవర్నరు పదవికి భావనగరు మహారాజా నియమింపబడుట, ఈ రాష్ట్రమునందే గాక, భారతదేశమంతట ఆశ్చర్యము కలుగచేసినదనుట నిస్సందేహము. ఇదివరలో అనేక ఊహాగానములు జరిగినవి. కాని ఎవరును కూడ రాష్ట్రగవర్నరు పదవికి ఒక సంస్థానాధీశుడు నియమింపబడునని అనుకొని యుండలేదు.

భావనగరు మహారాజాను నియమించుటలో భారతప్రభుత్వము, అంగీకరించుటలో మహారాజాకూడ మంచి పని చేసిరని అనవచ్చును. సంస్థానములు యూనియన్లలో చేరుట మూలమున భారతప్రభుత్వమునకు లోబడినట్లు గాదని, సాక్షాత్తు భాగస్వాములు అగుదురని ప్రధాని పండిత నెహ్రూ, ఉపప్రధాని సర్దార్ పటేలు అనేక పర్యాయములు ఉద్ఘాటించిరి. యూనియన్లలో చేరకపోయిన పక్షముననే సార్వభౌమత్వ మనునది రాగలదనిరి. వారి ఉద్ఘాటనలు కేవలము ఇట్టి లాంఛనాయుతమైన మాటలు కావని, ఇపుడు ఒక సంస్థానాధీశుని రాష్ట్ర గవర్నరుగా నియమించుటవల్ల వ్యక్తమైనది. భారతయూనియన్ అవిభాజ్యమని, రాష్ట్రములకు సంస్థానములకు భేదము చూపదలచలేదని వెల్లడియయినది.

భావనగరు మహారాజాకూడ ఈ గవర్నరు ఉద్యోగమునకు అంగీకరించుటలో నవీన దృక్పథమును ప్రదర్శించెనని చెప్పవచ్చును. ఒక సంస్థానమునకు అధిపతిగ నుండి, జీతము పుచ్చుకొను రాష్ట్రగవర్నరు ఉద్యోగమును అంగీకరించుట ఆశ్చర్యమైన సంగతి. బాధ్యతాయుత ప్రభుత్వము ఏర్పడినపిమ్మట సంస్థానాధీశుల ప్రతిపత్తి ఇంచుమించు రాష్ట్ర గవర్నరులతో సరిసమానమైన దనవచ్చును. అయినప్పటికీ కూడ పూర్వప్రభవములన్నీ వదలిపెట్టి ఉద్యోగమును స్వీకరించుట అభినందింపనలసిన విషయము. డిప్లమాటిక్ సర్వీసునందు అనేకమంది సంస్థానాధీశులను, వారి కుమారులను, తీసికొన భారతప్రభుత్వము ఆలోచించుచున్నట్లు ఆ మధ్య వార్తవచ్చినది. వారిలో అనేకమంది ప్రతిభావంతులు విద్యావంతులూ ఉన్నారు. భావనగరు మహారాజు, ప్రధాని పండిత నెహ్రూవలె హారోపాఠశాలయందు విద్య నభ్యసించెను. బాధ్యతాయుత ప్రభుత్వస్థాపనతో, వీరందరికి పరిపాలనావ్యాసంగ మనునది లేకుండ పోయినది. వారందరికి పని కలిగించుట వారికే కాక దేశమునకు కూడ ఉపయోగకరము.

మద్రాసు రాష్ట్రగవర్నరు పదవిని రాష్ట్రప్రముఖుని కిచ్చుట ఉచితమని కొందరి అభిప్రాయము. కాని, ప్రస్తుతము, ముఖ్యముగా బహుభాషా ప్రాంతరాష్ట్రములందు స్థానికాభిమానము లేనివారినే గవర్నరుగ నియమించుట అవసరము. ఇపుడు గవర్నరుకు సాక్షాత్తు పరిపాలనాధికారము ఏమి లేకపోయినప్పటికీ కూడ ఉత్తమమైన సలహాలద్వారా ప్రభుత్వవిధాన గతిని మార్చగలస్థితిలో నుండును.

స్వాతంత్ర్య వార్షికోత్సవ సందర్భంలో భారత నాయకుల సందేశాలు



మన కిక శుభదినములే ముం దున్నవి— సర్దార్ పటేల్.

మన ఈ ప్రథమ స్వాతంత్ర్య వార్షికోత్సవం, మనదేశ అభ్యుదయపథగమనంలో సునిశ్చిత పురోగమనము సూచించే ఘట్టంగా నిలుస్తుంది.

గత సంవత్సరంలో మన హృదయాలకు తగిలిన గాయాలతో మన హృదయాలింకా వేదన ననుభవిస్తూనే ఉన్నాయన్న విషయం బాధాకరంగానే నా స్మరణలోనూ ఉన్నది. కోట్ల కొలది కాందిశీకులు, తమకు "ఈపృథ్విలో నిలవ నీడ చూపించమని" న్యాయ సమ్మతంగా అడుగుతున్నారు. వారి భారమంతా మన చేతులమీద ఉంది. జమ్మూ, కాశ్మీరు సుక్షేత్రాలను ఇంకా, పరాయి దుండగీళ్ళ మూకలు కలుషితంచేస్తూ నిలిచి ఉన్నాయి. 'దేశవిభజన' "దెబ్బ" కల్గ కలిగిన అదటునుంచి ఇంకా ఇప్పటికీ మనం తేరుకోలేదు. ఈ సంవత్సరంలో జరిగిన మహాఘోరకృత్యము 'మన జాతిపిత' హత్య — ఇంకా మనగుండెలను పిండేస్తూనే ఉంది. జీబు చీకటులై అలముకొన్న అనేక దుస్సహ విషాద సమయాల్లో, మనకు వెలుగు చూపించి దారిని నడిపించిన, ఆ 'కృపాజ్యోతి' ఈనాడు లేదని దురపిల్లుతున్నాము.

ఆర్థికరంగంలో, యజమానులలోనూ, కార్మికులలోనూ, నిస్పృహ ప్రబలి, ఒకరితో నొకరు సహకారమూ సయోధ్యా లేక పారిశ్రామికంగా శాంతి లేనందువల్ల కలిగిన దుష్ఫలితాల నిప్పటికీ అనుభవిస్తూనే ఉన్నాము.

యజమానులూ కార్మికులూకూడా, పరస్పర సహకారంతో కృషిచేయటం ఈ సమయంలో అత్యావశ్యకము. దేశభక్తిప్రేరితులయి ప్రజలపట్ల తమ బాధ్యతల నవశ్యము గుర్తెరిగి, యజమానులూ కార్మికులూ పరస్పరము సహకరించి కృషిచేయవలసిన అత్యవసర సమయ మిది.


ఏ అంతశ్శక్తివల్ల మన స్వాతంత్ర్యాన్ని జయించుకొని చేబట్టుకోగలిగామో, ప్రథమ స్వపరిపాలనవాసంవత్సరంలో మన నెదుర్కొని నిర్మూలించచూచిన అఘాతాల నన్నిటినీ ఎదిర్చి జయించగలిగామో, ఆ శక్తి ఆధారంతోనే, అచంచల ధైర్యంతో, దృఢనిశ్చయంతో సుశిక్షితవర్తనులమై, బాధ్యతాజ్ఞానయుతులమై పురోగమించినట్లయితే, మనకు శుభదినములే ముందున్నవని విశ్వసించగల ఆస్కారమే అధికంగా ఉందని, నేను ధైర్యంగా చెప్పగలను.

మన ఆర్థికసమస్యలను, సాహసంతో, నిశ్చిత హృదయంతో, సర్వతోముఖ సహకార సౌహార్ద్రాలతో, పరిష్కరించుకోవలసి ఉంది. మన విదేశవ్యవహారాలలో, అనేకదేశాలతో మనం ఏర్పరచుకొన్న స్నేహబంధాలను ఇతోధికంగా ధృఢపరచుకోవలసి ఉన్నది.

మన స్వదేశ వ్యవహారాల్లో, మన మనకొన్న సర్వసమత్వప్రజారాజ్యాదర్శాలకు అంటి పెట్టుకొని, సుహృద్భావంతో, సహనంతో సంచరించగలిగి ఉండాలి. మనలో ప్రతివారును మన పొరుగువారి పట్లా, మన రాజ్యాంగముపట్లా మనకుగల బాధ్యతలను గుర్తించి, సంచరించాలి. భారతదేశంలో ద్వంద్వ దేశభక్తికి ద్వంద్వ అనుసరణాలకూ తావు లేదు.

భారతదేశము, అంతరంగికంగానూ, వైదేశికంగానూ, అత్యవసరంగా పరిష్కరించుకోవలసి ఉన్న బహుళ సమస్యా పరిష్కారాలకై, ప్రతిదేశీయుడూ, సంపూర్ణ సహకారాన్ని చూపి తగినంతగా కృషిచేసి తీరవలెనని భారతదేశము తన ప్రజలలో ప్రతివానినీ ఆదేశిస్తూంది. అల్లా ఆదేశించటానికి భారతదేశానికి పూర్తిగా హక్కు ఉంది.

కాబట్టి, ఈ ద్వితీయ స్వాతంత్ర్య సంవత్సరంలో, మనలో ప్రతి ఒక్కరమూ, మన మాతృదేశ పుత్రులముగా, మన కున్న విధ్యుక్త ధర్మాలను సంపూర్ణంగా నెరవేర్చ గలిగేందుకు మన జీవితాలను అంకితం చేసుకొందాం. మన దేశ ప్రతిష్ఠను పెంపొందింపజేసి, మన దేశ గౌరవాన్ని, దేశక్షేమాన్ని కాపాడేందుకు మనలో ప్రతివారమూ మనమన ధర్మాలు నిర్వర్తించుకొందాం. ఇంతకన్న మనస్సు నుత్తేజిత మొనర్చగల ఉత్తమ ఆశయము లేదు. మన శక్తుల నుపయోగించేందుకు ఇంతకన్న ఉత్తమమైన కృషి లేదు.



దేశమునకై ప్రతివ్యక్తీ తను చేయగలిగినంతా చేయాలి— రాజగోపాలాచారి.

స్వతంత్ర భారతదేశ చరిత్రలో ద్వితీయ సంవత్సరం ఆరంభమయింది.


మనము స్వాతంత్ర్యము సంపాదించుకొన్న విధానమువల్లనూ, స్వాతంత్ర్యానంతరం మన కేర్పడిన అనేక సమస్యలను మనం ఎదుర్కొన్న విధానములను గూడా మన పూర్వప్రభువులు చాలా ప్రశంసించారు. సార్వభౌమాధికారం రద్దగుటతో దేశంలో ఏర్పడ్డ ఛిన్నాభిన్నస్థితిని తొలగించి క్రమత్వ మేర్పరిచాము. కాని మనం సాధించినవాటికై మనని మనం పొగడుకుంటూ కూర్చుంటే ప్రయోజనం లేదు మన ప్రజల సుఖజీవనానికి అడ్డుగా నున్న అవరోధాలను తొలగించాలి. ప్రజలు తమ పౌర బాధ్యతలు ఎక్కువ బాగా గ్రహించి కృషి చేయాలి. ఉత్పత్తి హెచ్చించాలి. శీలసంపత్తి సర్వత్రా అభివృద్ధికావాలి. అందరూ న్యాయశీలురుగా ఉంటూ, అధిక కృషికి పూనుకోటమే దేశాభ్యుదయానికి మార్గము.

మనకు సంభవించిన విపత్తులన్నిటిలోకీ మహాఘోరమైన విపత్తు మహాత్ముని హత్య. దేశశత్రువులు చేసిన నష్టం కంటె, ఈ హంతకులు మనకు చేసిన నష్టం చాలా అధికము.

మనకు మహాత్మునిపట్ల నిజమైన భక్తి ఉంటే, కేవలము ఆయన శిలావిగ్రహాలు, ఛాయాచిత్రాలూ, నిర్మించి తృప్తిపడితే చాలదు. ఇప్పుడు మహాత్ముడే బ్రతికి ఉంటే ఆయన ఎల్లా వ్యవహరించేవాడో, ప్రతివారూ అల్లా వ్యవహరించాలి. ఏదైన సందేహమూ, క్లిష్టసమస్యా ఏర్పడితే, ప్రతి వ్యక్తీ కూడా, "ఇప్పుడు మహాత్ముడు బ్రతికిఉండి, మన మాయనదగ్గరకు సలహాకు వెళ్ళిఉంటే, ఏమి సలహా ఇచ్చిఉండేవాడు?" అని తమను తాము ప్రశ్నించుకొంటే, ఆయన ఏమి సలహా ఇచ్చిఉండేవాడో ఊహించుకోటం కష్టం కాదు. ప్రతివారు ఆ సలహాను, త్రికరణశుద్ధిగాను, భక్తిభావంతోను అనుసరించాలి.

ప్రతిపౌరుడూ మన జాతీయప్రభుత్వానికి తగినంతగా సహాయం చేయాలి. మన మింక నిర్మాణాత్మకవిధానాలలో ఆలోచించటం మొదలుపెట్టాలి. విదేశీయ పాలనలో అలవాటుపడ్డ ప్రతిఘటనావిధానానికి, అసహనభావానికి ఇప్పుడు స్థానము లేదు. ప్రభుత్వాధికారంపట్లా, ప్రభుత్వ ప్రతినిధులయెడలా, గౌరవాన్ని ప్రేమపూర్వకంగా చూపాలి.

ప్రతివారూ కృత్రిమము లేకుండా, సోమరితనం పొలుగాకుండా తమతమ శాయశక్తులా దేశానికై కృషి చేయాలి. 'వ్యక్తుల స్వంత వ్యవహారాల' సంకలన సమిష్టి స్వరూపమే 'దేశ వ్యవహారము.' ప్రతిపౌరుడూ దేశానికై తానెంత ఎక్కువగా పాటుపడేందుకు శక్తి ఉందో అంత ఎక్కువగానూ కృషి చేయాలి. పరస్పర విశ్వాసం పెంపొందించుకోవాలి. న్యాయశీలురుగా సంచరించాలి. ఇదే నేడు భారతపౌరుల నుండి, మాతృదేశం వాంఛిస్తూంది.



ఆదర్శములను మరచినచో దేశమునకు ద్రోహముచేసిన వార మగుదుము— పండిత జవహర్లాల్ నెహ్రూ.

నేడు మరొక ఆగస్టు 15 వ తేదీ వచ్చింది. గతకాల మేవిధముగ గడచినప్పటికీ యిది మనకు పవిత్ర దినము. గత సంవత్సరములో మనము సాధించిన సద్విషయము లనేకము కలవు. మన దీర్ఘ యాత్రలో మనము కొంతవరకు ముందంజ వేయగల్గితిమి. కాని, యీ సంవత్సర కాలము లోనే భారతజాతికి ముక్తిదాయకమైన సత్తేజమునకే వంచన కల్పించిన తలవంపులును, అమంగళములును మనకు సంభవించినవి. భారతజాతి జనకుని హత్యయూలముగా గడచిన ఈ సంవత్సరములో అధర్మము తన విజయ ధ్వజ మెత్తినది. ఇంతకుమించినఅవమానముగాని, దుర్భరదుఃఖము గాని మరొకటి మనకు సంభవింపగలదా!

ఈ పవిత్ర దినమును మనము దీక్షగా జరుపవలసినరీతిని జరుపవలసియున్నాము. కాని, ప్రగల్భములతోగాని, శ్రీరంగ నీతులతోగాని కాలక్షేపములు చేయతగదు. ఆత్మపరిశీలన చేసికొని మన యుద్యమమునకు మరొకమారు నూత్న సంకల్పదీక్ష వహించవలసిన పర్వదిన మిది.

మనము ఇంతవరకును చేసిన ఘనకార్యమును గూర్చి తలపోయుట విరమించి, మన మింకను పూర్తిచేయువలసిన అసంపూర్ణ కార్యమును గూర్చియు, మనము తప్పుత్రోవల ద్రొక్కి చేసిన పనులనుగూర్చియు నేడు జిజ్ఞాస చేసెదముగాక! తమకు గల సర్వస్వమును గోల్పోయి నిలువ నీడలేక ద్రిమ్మరుచున్న లక్షలకొలది కాందిశీకుల విషయమై తల పోసెదము గాక. కష్టము లనుభవించుచున్న కోట్లకొలది భారత ప్రజానీకము తమ దుర్దశ తొలగి, తమకు సద్గతి లభించునను ఆశతో, ఓర్పుతో నిరీక్షించుచు మనవైపు గంపెడాశతో కన్నెత్తి చూచుచున్నది. ఈ అభాగ్య భారత ప్రజానీకమును గూర్చి నేడు తల పోసెదముగాక!

భారతదేశ సహజశక్తి సంపదలను దేశసమిష్టి శ్రేయమునకై సక్రమముగా నిగ్రహించి వినియోగించినతో భారతదేశ స్వరూపమే నూతనాకృతిని దాల్చి, యీ దేశము సుభిక్షమై మహోచ్ఛదశ నందగలదు. అట్టి మన మాతృదేశ సహజశక్తి సంపదలగూర్చి మననము చేసెదముగాక! ఇట్టి మహోత్కృష్ట కార్యములకు మనకు గల సంపూర్ణశక్తి సామర్థ్యములతో దృఢసంకల్పుల మయ్యెదముగాక! అన్నిటికన్న ముఖ్యమైన దింకొకటి కలదు. గాంధిమహాత్ముడు మన కుపదేశించిన ధర్మములను, మనకు చూపిన మహోన్నతాదర్శములను మనము స్మరించెదముగాక! ఆ ధర్మములను, ఆదర్శమును మనము విస్మరించినచో, మన ఉద్యమమునకు మన దేశమునకు ద్రోహముచేసినవార మగుదుము.

కనుక, యీ స్వాతంత్ర్య వార్షికోత్సవ దినమున, మన స్వతంత్ర భారతభూమికినీ, స్వతంత్ర భారత జాతికినీ సేవ చేయుటకై మనము పునస్సంకల్పదీక్షా దక్షులమై ఆత్మార్పణ మొనర్చెదముగాక!

మన కట్టి యోగ్యత ప్రాప్తించు గాక! జై హింద్!

గాంధీ రవీంద్రులు

'అమరేంద్ర'

ఒకసందర్భంలో నెహ్రూపండితుడు గాంధీ రవీంద్రులను గురించి ఇల్లా అన్నారు: "వీరిద్దరూ సమకాలికులై జన్మించటం మన మహాభాగ్యం. ఈయుగంలోని మహాపురుషులిద్దరూ ఆధునికభారతదేశంలోనే అవతరించటం మన అదృష్టం. ప్రాచీనమైన మన సంస్కృతికి గాంధీరవీంద్రులు విభిన్నమైన మూర్తిభావాలు. కాని వీరిద్దరి దృక్పథాలకీ ఎంతో వ్యత్యాసం వుంది"

గురుదేవుని విశాలమైన అంతర్జాతీయ దృక్పథానికీ, బాపూజీ విశుద్ధరాజకీయాలకీ వారసుడైన నెహ్రూపండితుడు ఈమహనీయులిద్దరి మధ్యావున్న సామ్యాన్ని గమనించకపోలేదు. వాళ్లిద్దరి దృక్పథాలలోవున్న భేదాన్ని కూడా గుర్తించారు.


గురుదేవులకీ బాపుజీకి ఏర్పడిన మైత్రి చాలా గాఢమైనది. బాపుజీ రవీంద్రుణ్ని ఎప్పుడూ గురుదేవ్ అని సంబోధించేవారు. రవీంద్రులు కూడా బాపూజీని ఎప్పుడూ మహాత్మాజీని అని పిలిచేవారు. గాంధీజీని పూర్ణపురుషుడనీ త్యాగమూర్తి అనీ, మహానాయకుడనీ, తపస్వి అనీ ఎంతో గౌరవించేవారు. భారతదేశమంతటిలోనూ గాంధీజీకి మొట్టమొదటగా హృదయపూర్వకమైన ఆతిథ్యం ఇచ్చింది గురుదేవులే. దేశం గాంధీజీ గొప్పతనాన్ని గుర్తించకముందే గురుదేవులు ఆయన విశిష్టతను కనుక్కొగలిగారు. అందుకే గురుదేవులమీద బాపుజీకి భక్తి విశ్వాసాలు. గురుదేవులకుకూడా బాపూజీమీద అపారమైన ఆదరగౌరవాలు. అందుకే అవసానదశలో తనకి అత్యంతప్రియమైన శాంతినికేతనాన్ని బాపూజీకి అప్పగించి నిశ్చింతగా గురుదేవులు తరలిపోయారు.

కాని వీరి మైత్రి ఎంత గాఢమైనదో వీరి అభిప్రాయభేదాలుకూడా అంత. తీవ్రమైనవి. అసలు వీరిద్దరికీ అభిప్రాయభేదాలు రావలసిన అవసరం ఏముంది? ఒకరు దేశనాయకులు, మరొకరు మహాకవి. ఇద్దరికీ సంబంధం ఏముంది? అని ప్రశ్నించవచ్చును. దీనికి సమాధానం రవీంద్రుడు అందరుకవులవంటి స్వప్నలోకవిహారి కాకపోవటమే. తనమాతృదేశదాస్యాన్నీ, తన సోదరుల దుస్థితినీ, దారిద్ర్యాన్నీ రవీంద్రుడు కవి అయినప్పటికీ క్షణంకూడా విస్మరించలేదు. స్వేచ్ఛకోసం, రాజకీయస్వాతంత్ర్యం కోసం, ఆర్థిక సమానత్వంకోసం ఆయన హృదయం అనుక్షణమూ ఆరాటపడేది. గురుదేవులు మహాకవి మాత్రమే కాక ఉజ్జ్వలదేశభక్తుడు. ఈ దేశాభిమానమే గాంధీరవీంద్రులని ఆప్తమిత్రులుగా చేసింది. ఈ జాతీయతే ఇద్దరి మధ్యా అప్పుడప్పుడూ తీవ్రమైన అభిప్రాయభేదాలని కల్పించింది. ఇద్దరూ మాతృదేశాన్ని ఆరాధించారు. ఇద్దరి లక్ష్యమూ దేశస్వాతంత్ర్యమే. గమ్యం ఒకటే కాని ఇద్దరూ తొక్కిన దారులు వేరు.

రవీంద్రుడు సాహిత్యంలోనే కాదు, నిత్యజీవితంలోకూడా అనుక్షణమూ కవిగానే జీవించాడు. బాపుజీకి కవిహృదయం వుంది.

కాని దేశాన్ని నడిపించేభారం వహించిన నాయకుడు కోటానుకల గురుదేవులకంటె బాపూజీయే వాస్తవాలకి చేరువగావుండేవాడు. గురుదేవులు వాస్తవాలనిగురించి ప్రస్తావించినా స్వప్నలోకపరిమళం ఆయన మాటలని విడిచేది కాదు. ఇది ఈ మహనీయులిద్దరి మధ్యా కనిపించే స్వభావసిద్ధమైన భేదం. స్వభావాలలో కనిపించే వ్యత్యాసమే అభిప్రాయాలలో మరింత స్ఫుటంగా కనిపించేది.

ముఖ్యంగా చర్ఖానిగురించి గాంధీ గురుదేవులు ఏకీభవించలేకపోయారు. తీవ్రమైన వివాదం చెలరేగింది. గాంధీజీతో ఏకీభవించనందుకు గురుదేవుని చాలామంది ఏవగించుకున్నారు. చులకన చేశారు. ఆయన వాటిని లెక్కచెయ్యలేదు. తన అభిప్రాయాన్ని వెల్లడించటానికి ఎన్నటికీ జంకలేదు. "చర్ఖాస్వరాజ్యానికీ, స్వాతంత్ర్యానికీ చిహ్నమని నేను అంగీకరించను. రాట్నం తిప్పితే స్వరాజ్యరథచక్రాలు కదులుతాయి అనటంలో అర్థంలేదు. చర్ఖాకి అనవసరమైన ప్రాముఖ్యాన్ని ఇవ్వటం మన జాతిమూఢవిశ్వాసాన్ని పెంపొందించటమే. దేశస్వాతంత్ర్యం చర్ఖా తిప్పినంతలో లభించేటంత సులువైనది కాదు. కేవలం నూలు వడికినంతమాత్రాన మన దారిద్ర్యం తీరదు. రాట్నం ఒక్కటే మన ఆర్థిక సమస్యని పరిష్కరించలేదు. సమగ్రమైన సహకారోద్యమంవల్లనే మన చిక్కు సమస్యలని పరిష్కరించగలము. రాట్నమే స్వరాజ్య చిహ్నం అనటమూ, చర్ఖాయే అన్ని సమస్యలకీ తారకమంత్రం అనటమూ నేను సహించలేను" అని 1925 లో గురుదేవులు తన నిశ్చితాభిప్రాయాన్ని నిర్భయంగా వెల్లడించారు. జాతిఅంతా చర్ఖామంత్రాన్ని పారాయణ చేసినప్పటికీ గురుదేవులు తనకి చర్ఖాలో విశ్వాసం లేదని వెల్లడించటానికి వెనక్కి తగ్గలేదు. విదేశీగుడ్డలని, విదేశీవస్తువులని పోగులుపోసి తగలపెట్టమని గాంధీజీ ఇచ్చిన ఆదేశాన్ని రవీంద్రులు తీవ్రంగా ఖండించారు. "ఈ ఆజ్ఞని నేను శిరసావహించను. ఇది మంచిదా, చెడ్డదా అని విచారించకుండా ఏ ఆజ్ఞనీ నేను గుడ్డిగా శిరసావహించను. ఎవరిమటుకు వారికి ఆలోచించుకునే అధికారం వుంది. ఈ అధికారాన్ని కోల్పోయినవారు స్వాతంత్ర్యసమరంలో పాల్గొనటానికి అనర్హులు. అదీకాక, ఈ తగలబెట్టవలసిన గుడ్డలు నావి కావు. వొంటినిండా గుడ్డలేక నలుగురిలోకీ రావటానికి సిగ్గుపడే వేలమంది అభాగ్యస్త్రీల అనుమతి లేనిదే ఇది తగలబెట్టే అధికారం నాకు లేదు. మనదేశమాత గుడ్డలేక నగ్నంగా సిగ్గిలిపోతుంటే గుడ్డలు పోగుపోసి తగలబెట్టటం అర్థంలేని కార్యక్రమం. ఇతర దేశాల్లో తయారైన గుడ్డ కట్టుకోటం పాపం అని ప్రబోధించటం మన సంకుచితప్రవృత్తిని బలపరచటమే అవుతుంది. మానసిక స్వేచ్ఛని అరికట్టి భావదాస్యాన్ని బలపరిచే ఇటువంటి అర్థంలేని కార్యక్రమాలలో నాకు విశ్వాసం లేదు", గురుదేవుల దృష్టిలో రాజకీయ స్వాతంత్ర్యంకంటె మానసిక స్వాతంత్ర్యమే ముఖ్యం. గాంధీజీలాంటి మహానాయకుడి ఆదేశాలనికూడా గుడ్డిగా అనుసరించటం ఆయన సహించలేకపోయాడు.



రవీంద్రనాద్ ఠాకూర్

గురుదేవుల అభిప్రాయాలని గాంధీ ఎప్పుడూ గౌరవించేవారు. "శాంతినికేతనంనుంచి గురుదేవులు భావదాస్యం పనికిరాదని చేసిన హెచ్చరికతో నేను ఏకీభవిస్తున్నాను. ఇది చాలా అవసరమైన, సముచితమైన హెచ్చరిక. కాని దేశమంతా నన్ను గుడ్డిగా అనుసరిస్తోందని నేను అనుకోను. కడుపునిండా తిండి లేక, ఏడాదికి ఆరు నెలలు పనిలేక అలమటించే ప్రజలకి ఆహారం రూపంలోనూ, పనిరూపంలోనూ భగవంతుడు సాక్షాత్కరిస్తాడు. ఆకలిబాధే అందరిచేతా చర్ఖా తిప్పిస్తోంది. నా ఆదేశంకాదు" అని బాపుజీ సమాధానం ఇచ్చారు. కాని గురుదేవులు అభిప్రాయాన్ని మార్చుకోలేదు.

బాపూజీ కార్యక్రమాలన్నిటిలోనూ హరిజనోద్యమం గురుదేవులని ఎక్కువ ఆకర్షించింది. గాంధీజీప్రాయోపవేశం చేసినప్పుడు "ఓ తపస్వీ! నీ మహాతపస్సు తప్పక ఫలిస్తుంది" అని గురుదేవులు ఆశీర్వదించారు. ఏక్షణాన గాంధీజీకి ఆపద వస్తుందో అని ఎంతో ఆవేగపడ్డారు. ఉపవాసం ముగిసేరోజున గురుదేవులు గాంధీజీ దగ్గరే వున్నారు. గాంధీజీ గురుదేవులని ఒక ప్రార్థన గీతం పాడమని కోరారు. "ఈ హృదయం ఎండి బీటలు వారింది. ప్రభూ! నీ కృపావృష్టిని అనుగ్రహించు" అనే గేయాన్ని ఆలపించారు గురుదేవులు.

కాని బీహారులో భూకంపం వచ్చింది. దానికి అస్పృశ్యత కారణమనీ, అదిదైవక విధించిన ప్రాయశ్చిత్తమనీ గాంధీజీ అన్నారు. ఈ అభిప్రాయాన్ని గురుదేవులు తీవ్రంగా ఖండించారు: "ఈ అభిప్రాయం విని ఎంతో బాధపడ్డాను. ఇటువంటి అశాస్త్రీయమైన అభిప్రాయాన్ని మనలో చాలమంది అంగీకరించటం నాకు మరీ బాధగా వుంది. సృష్టిలో సంభవించే ఉపద్రవాలకీ, నైతికసిద్ధాంతాలకీ ముడిపెట్టటం శోచనీయమైన విషయం. ఇటువంటి సంఘటనలద్వారా సృష్టికర్త లోకానికి పాఠాలు నేర్పుతాడనటం నమ్మరాని మాట. అటువంటి వుద్దేశమేవుంటే మొన్నటి భూకంపంలో వీరు వారనే భేదాలేకుండా అగ్రవర్ణాలవాళ్ళతోపాటు అస్పృశ్యులూ, ఏ పాపమూ ఎరగని పసిపాపలూ ఎందుకు నాశనమైపోయారు? ఇంత వివక్షణ లేని గుడ్డి దమననీతిని భగవంతుడికి ఆపాదించటం కూడని పని. ఇటువంటి వాదానికి మహాత్మాజీకి వ్యతిరేకులు పూనుకుని ఈ భూకంపానికి మహాత్మాజీ సిద్ధాంతాలూ, ఆయన అనుచరులూ కారణం అంటే నాకు ఆశ్చర్యం కలిగేది కాదు. మన పాపాలు ఎంత ఘోరమైనప్పటికీ సృష్టిక్రమాన్ని తారుమారు చేసే శక్తి వాటికి లేదు.

"మనకి మార్గదర్శకుడై మన హృదయాల్లోని పిరికితనాన్ని, భయాన్ని పోగొట్టిన మహాత్మాజీయే ఇటువంటి అశాస్త్రీయమైన అభిప్రాయాలని వెల్లడించటం శోచనీయం. ఇటువంటి అశాస్త్రీయ దృక్పథమే కానిప్రవృత్తికీ, భావదాస్యానికీ దారి తీస్తుంది". దీన్నిబట్టి గురుదేవుల స్వేచ్ఛాప్రయత్నమూ, మూఢవిశ్వాసాల మీద ఆయనకున్న ఏవగింపూ తేటతెల్లమవుతాయి. రవీంద్రులకి శాస్త్రమంటే ఆదరం. ఆయన భక్తుడు. కాని వివేచనాశక్తి మీదా, శాస్త్రీయ దృష్టిమీదా ఆయనకి చాలా గౌరవం.

ఇటువంటి అభిప్రాయభేదాలెన్ని వొచ్చినా బాపూజీ గురుదేవుల పరస్పర భక్తి గౌరవాలు పిసరంతైనా తరగలేదు. వారి పవిత్ర స్నేహం వయసుతోపాటుగా పెరిగింది. వారు ఎప్పుడు కలుసుకున్నా ఆజన్మమిత్రుల సౌహార్దంతో ఒకరినొకరు గౌరవించుకొనేవారు. వారు ఎప్పుడు కలుసుకున్నా ఒకరినిమించిన చమత్కారంతో ఒకరు చిరునవ్వులతో కనులపండుగగా వినులవిందుగా వుండేది. ఒకసారి ఇద్దరూ కలుసుకున్నప్పుడు గురుదేవులు మాటలధోరణిలో "మహాత్మాజీ, నేను డెబ్బయ్యోపడిలో పడ్డాను. మీకంటే చాలా ముసలివాణ్ని అయిపోయాను, తెలుసునా?" అన్నారు.

గాంధీజీ వెంటనే అందుకుని చిరునవ్వుతో "తెలియకేం, తెలుసు. ఈ అరవయ్యేళ్ళ ముసలాడికి ఏమీ చేతకాదు. డెబ్బయ్యేళ్ళ యువకవిమాత్రం ఇప్పటికీ చక్కగా నాట్యంచేస్తాడు!" అని చమత్కరించారు.


ఈ మహనీయుల ఆదర్శ మైత్రి చిరస్మరణీయమైన మధుర గాథ. ఆధునిక భారత చరిత్రలో ఈ మహనీయులు అద్భుత తేజస్సుతో కలకాలమూ కళ్ళు మిరుమిట్లుగొలిపే అమరజ్యోతులు. నిజంగా వీరిద్దరూ సమకాలికులై జన్మించటం మన సౌభాగ్యం.



కాశ్మీర్ కమీషన్ అధ్యక్షుడు ఎం. ఎగ్బర్ట్ గ్రెఫీ మిగతాసభ్యులతో కలసి, ఢిల్లీలో రాజఘాట్‌లోని మహాత్మాగాంధిసమాధిపై భక్తి పురస్సరముగా పూవులుంచుచున్న దృశ్యం.

బెర్నార్డ్ షా నాటకాలు

శ్రీ వనమాలి



షేక్స్పియర్ తర్వాత మూడువందల ఏళ్ళ వరకూ ఆంగ్ల నాటకరంగం నిద్రావస్థలోనే ఉంటుందని చెప్పాల్సిఉంటుంది. అప్పుడప్పుడు గోల్డ్‌స్మిత్తూ, షెరిడనూ, ఆస్కార్ వైల్డ్‌లాంటి ప్రతిభాన్వితులు ఒకటి రెండు ఉత్తమరచనల్ని, తమ కళలద్వారా విడిలించి నప్పటికీ, 17 వ శతాబ్దారంభంనుంచీ 19 వ శతాబ్దాంతం వరకూ ఈ జడత పోలేదు. విఖ్యాతులైన నాటక పాత్రధారులు చాలామంది జన్మించారు కాని, నాటకకర్తలు పుట్టలేదు.

పతనానికి కారణం

దీనికి కారణాలు రెండు: గమనించిచూస్తే స్ఫురించే విషయం—ఒక దేశంలో అత్యంత ప్రతిభాన్వితుడు ఒకసారి జన్మిస్తే, మళ్ళీ అల్లాంటి ఘటన జరగటానికి కొన్ని శతాబ్దాలు పడుతుంది. ఇదే వంశాన్ని దృష్టిలో పెట్టుకొని చూస్తే ఆ వంశం ఆ తర్వాత విలోపాన్ని పొందటమో లేక బ్రతికిఉంటే నిస్సారంగానో తయారవుతుంది. మనకు పండితపుత్రుడు—కుంఠ—ఉండనే ఉన్నాడు. ఈ దృష్టితో పరికిస్తే షేక్స్పియర్ తర్వాత ఆవిర్భవించిన ఆంగ్లనాటక కర్తలందరూ ఉపనస్సారుల్ని ముందటనక్షత్రాల్లా తోస్తారు. రెండో కారణం ఆ మధ్యకాలంలో ఇంగ్లండులో ప్రబలిన ప్యూరిటానిజం అనబడే మతవాదం. ఇదికూడా సాహిత్యరచయితల స్వేచ్ఛను అణచిపెట్టింది. ఈ సమయంలో కథాకాలులకంటె, సామాన్య నాటకకారులగుంపే ఎక్కువగా పోగయింది.

ఫ్రెంచి అనుకరణ

వీళ్ళందరూ విషయవస్తువును ఫ్రెంచి నాటకాలనుండి సంగ్రహించుకొన్నవాళ్లే ఈ నాటకాల్ని 'సంస్కారయుగ నాటకాలు' అన్నారు. ఏమైతే ఈ గాలి విక్టోరియాయుగాంతంవరకు మారలేదు. షా వచ్చే ఫ్రెంచినాటకాల చౌకబారు అనుకరణాన్నుంచి ఆంగ్లనాటకాల్ని రక్షించాడు.

నాటకరంగం అవుతే ఒకరీతిగా జీవించేఉంది కాని, సంస్కృతి క్షీణించింది. ఈ నాటకాల లక్ష్యం యౌవనోనా దాన్ని రేకెత్తించి సభ్యుల్ని సంతోషపెట్టడం. కనుక, నాటకాల విషయవస్తువు స్వైరస్వభావచిత్రణగానే నిల్చింది. 1895 నుండి 98 వరకూ షా ఈ నాటకాల్ని—అప్పటికి చాలా ఫ్యాషన్‌లో ఉన్న వాటిని—తీవ్రంగా విమర్శించాడు. అప్పటి నాటకరంగం షా నాటకశిల్పాన్నిగాని, వాదాన్నిగాని అర్థంచేసుకోలేకపోయింది, స్వీకరించటం మాట అట్లా ఉండగా. కనక వీటిని మెయ్యపట్టటం షాకు తప్పని సరి అయింది. ఇల్లా చేస్తేనేగాని తన ప్రభావం వాళ్ళకు గోచరమయ్యేట్టు లేదాయె! నాటకరంగంవాళ్లు షేక్స్పియర్ని కవచంగా ధరించి వాగ్యుద్ధం చేయటానికి తయారవుతే, షా ఇబ్సెన్ చాటుగా నిల్చాడు. ఆ నాటకరంగం షేక్స్పియర్ నాటకాల్ని తమ ఇష్టంవచ్చినట్టుగా మార్చి, ఆడేదనే విషయాన్ని ఇక్కడ గుర్తుంచుకోవాలి.

షా ఖండన

షా సమాలోచించినవి మూడు విషయాలు. ఒకటి: వర్తమానయుగంలో షేక్స్పియర్ నాటకశిల్పంయొక్క అనుపయోగిత్వం. రెండు: షేక్స్పియర్ నాటకాల్ని ఇష్టవచ్చినట్టు మార్చి ప్రదర్శించటంవల్ల షేక్స్పియర్‌కి చేసిన అపచారం. మూడు: షేక్స్పియర్ని తొలగించి ఆ స్థానే ఇబ్సెన్‌ను నిలబెట్టాలి అనే విషయం. (ఇబ్సన్ని అంటే తన్నే!)

షేక్స్పియర్‌కు విరుద్ధంగా షా చెప్పిన వాదం: ఆ భాష సంగీతమయం. భావప్రదర్శనకు అనర్హం. మానవప్రకృతిని చిత్రించటంలోనే షేక్స్పియర్ తృప్తిపడతాడు. కనుక, మనకు ఇప్పుడు ఈ భావతోగాని, చరిత్ర చిత్రణతోగాని పనిలేదు.

చివరకు షా నెగ్గాడు. 20 వ శతాబ్దారంభం షేవియన్ థియేటర్‌కు నాందీవాక్యాన్ని పల్కింది. ఆరంభంలో ప్రదర్శనరంగాధికారులు షా నాటకాల్ని ఎక్కువగా సమాదరించలేకపోయారు. కారణం: ఇప్పుడు వాళ్లు ఆడుతున్న నాటకాలకీ షా నాటకాలకీ హస్తిమశకాంతరభేదం ఉండటమే. వాళ్లాడే నాటకాలు సమకాలిక రుచిని అనుసరించి కామభావప్రేరేపకాలుగానూ, నిందాగర్భాలుగానూ ఒకేవిధమైన స్వరాన్ని ప్రదర్శిస్తూనూ ఉండేవి. షా నాటకాల్లో సమాజవ్యవస్థలో ఉన్న లోటుపాట్లు, ఎవరికీ అర్థంకాని తత్త్వమూ, రసవత్తరమైన సంభాషణలూ ఉండేవి. క్షురధారానిశితమైన సభలో కుతూహలే షా నాటకాలకి జీరం. ఇంత భేదం ఉండుటవల్ల త్వరగా ఇవి రంగస్థలాన్ని ఎక్కలేకపోయాయి.

షా అపూర్వమైన చింతాశక్తిని ప్రదర్శించాడు. తన రచనల్లో తన స్వతంత్ర రచనా పటిమను గురించి షా చెప్పుకున్న వాక్యాలు 'మదన్యో కస్సమర్థః' అన్న పండితరాయల వాక్యాల్ని జ్ఞప్తికి తెస్తాయి. "ఇతరులు నలుగును విషాదాంతంగా చేస్తే, నేను విషాదాంతాన్నే నలుగుచేసాను. జీవితాప్రుశల్ని బుద్ధిరసంతో కల్పి హాస్యంగా పరిణమింపజేసి, సాధారణ జనానికి పంచిపెట్టాను" అని చెప్పకున్న వాక్యాలు సర్వులకూ తెలిసినవే.

నాటకరంగాన్ని నవీనం చెయ్యాలనే ఉద్దేశ్యంతో ఓం ప్రథమంగా 1889 లో జానెట్, ఇబ్సెన్ వ్రాసిన 'డోల్స్‌హౌస్' అనే నాటకాన్ని ప్రదర్శించాడు. ప్రాచీన మార్గీయులకు ఇదే మొదటి దెబ్బ. ఈ భావ ప్రవాహాన్ని అనుసరించే 1892 లో జ్యాక్‌గ్రేన్ 'ఇండిపెండెంట్ థియేటర్'ను స్థాపించాడు; ఇబ్సెన్ వ్రాసిన 'ఘోస్ట్స్' అనే నాటకాన్ని ప్రదర్శించాడు.

షా మొదటి నాటకం

ఈ రీతిగా పరాయినాటకాల్నే ప్రదర్శిస్తున్న నాటకరంగానికి, బెర్నార్డ్ షా రచించిన 'విడోయర్స్ హౌసెస్' అనే నాటకం ఇంగ్లీషులో లభించింది. వెంటనే దాన్ని జాక్‌గ్రేయిను రాయల్ థియేటర్లో ప్రదర్శించాడు. ఇది కథ:

"జర్మనీలో షికార్లు కొట్టే ఒక ఆంగ్లయువకుడికి ఒక ఆంగ్లయువతితో పరిచయమవుతుంది. ఈ పరిచయం ప్రేమగా మారుతుంది. తరుణి లక్షాధికారి కన్య. ఈ లక్షల వెనకాల కోట్లమంది బీదవాళ్ల రక్తిబిందువులు ఉన్నాయని యువకుడు గ్రహిస్తాడు. గ్రహించి, తన్ని పెళ్లి చేసుకుంటే తండ్రి డబ్బు ముట్టుకోకూడదనే షరతు పెట్టాడు. ఇదే నాటకంలో 'క్లైమాక్స్'. కాని, వెంటనే నాయకుడి వీరత్వం నీళ్లు కారిపోతుంది. ఏమంటే, తనది కూడా ఇల్లాంటి పాపపుసొమ్మే అని గ్రహిస్తాడు నాయకుడు. అంతటితో దిగజారిపోయి, వివాహం చేసుకొంటాడు."

ఈ నాటక ప్రదర్శనానికి ఫలితంగా సోషలిస్టుల ప్రశంసా, ఇల్లాంటి నాటకాల్ని చూడటానికి అభ్యాసంలేని దర్శకుల తిట్లూ షాకు లభించాయి.

ఇక విమర్శకులు: షమస్యను అతిరంజితం చేస్తాడని కొందరన్నారు. మరికొందరు గ్రంథకర్త మనస్సు భ్రంగిపోయి ఉంది, లేకపోతే కథానాయకుడు పరిస్థితులకు లొంగిపోయే వాడు కాడు. ధిక్కరించేవాడు, అన్నారు. కాని, ఈ నాటకం వ్రాయటంలో షాకు ఉన్న ఉద్దేశ్యాన్నే గ్రహించలేక పోయారు.

షా అభిప్రాయం: వర్తమాన సమాజంలో ఎంత కాలుష్యం ఉంది అంటే, దాన్నుంచి ఎవరూ తప్పించుకోలేరు, చివరకు వివేకబుద్ధి ఉన్నవాళ్లు కూడా విడిలించుకొని బయట పడలేరు, అని తెలియ జెప్పటమే.

రెండో నాటకం

షా రెండో నాటకం 'ఫిలాండర్'. ఇది ఇబ్సెన్ పక్షపాతుల మనుకొనే వాళ్లకు చెంపపెట్టు. తర్వాతకాలంలో షా, స్వపక్షపాతులమని ఊహించుకొనే వాళ్లమీద కూడా దెబ్బ తీస్తూ "డాక్టర్స్ డిలెమా" అనే నాటకాన్ని రచించాడు.

నాల్గో నాటకం

'ఫిలాండర్' నాటకం రంగానికి ఎక్కలేదు. అందువల్ల వెంటనే షా 'ఓరెన్స్ ప్రొఫెషన్' అనే నాటకాన్ని వ్రాశాడు. శ్రీమతి ఓరెన్ వృత్తి వ్యభిచారం—గణిక. దీనికి కారణం వర్తమాన సమాజంలో ఉన్న లోటే అని షా వెలెత్తి చూపించాడు. పురుషుడి స్వేచ్ఛా ప్రవర్తనగాని, స్త్రీల చంచలచిత్తంగాని దీనికి కారణం గాదు. ఆడవాళ్లకు స్వతంత్ర జీవికావృత్తికి ఆస్కారం కాకపోవటమే కారణం. ఇల్లాంటి వాదాన్ని చేపట్టటానికి షాయే ప్రథముడు. షాకు పూర్వం వేశ్యను కావ్యసౌందర్య రూపంలోనో, లేకపోతే అపవిత్రతా ప్రతిమూర్తిగానో చిత్రించినవాళ్లేగాని, మన అర్థనీతియొక్క దుష్టఫలంగా నిరూపించినవాళ్లు లేరు. విషమ సమాజవ్యవస్థే రూపోపజీవికల్ని ప్రసవిస్తోంది. మొదటినాటకంలాగా ఈనాటకం గూడా సమాజంమీదే దండెత్తుతోంది.

'ఆరమ్స్ అండ్ ది మ్యాన్' అనేది రంగానికెక్కిన నాల్గో నాటకం. ఇందులో రొమాన్స్ ఆవరణలో దాక్కున్న ఆదర్శప్రేమా, ఆదర్శ వీరత్వం అనే రెండు బీభత్సాల్ని షా బయటకు లాగి, నగ్నంగా చూపాడు. నూనవుడు ఆదర్శం అనే పేరుతో ఒకవైపున సహజసృష్టి ప్రక్రియని దమనంచేస్తూ, ఇంకోవైపున ధ్వంస ప్రవృత్తిని ఎట్లా పోషిస్తున్నదీ షా ఇందులో ప్రదర్శించాడు. ఈ మహాధ్వంసమే యుద్ధం. మొదటి ప్రపంచయుద్ధం యొక్క ఆఘాతాన్ని జీర్ణించుకొన్న ప్రపంచానికి, ఈ విషయం సంపూర్ణంగా అర్థమైంది. అనుపూర్వకంగా యుద్ధాన్నిగురించి మానవుడు కల్పించుకొంటున్న స్వాప్నికసౌధశిఖరాలు, యుద్ధ ప్రతిక్రియ కాంతిలో దిగజారిపోయాయి.

తర్వాత నాటకాలు

సాధారణ మానవుని వైపరీత్యాన్ని చూచి షా డిల్లపోయాడు. 'మ్యాన్ అండ్ సూపర్ మ్యాన్'అనే రచనలో వ్యంగ్యోక్తి పూర్వకంగా మరణానంతరం నేను సృష్టికర్తను కలసి కొన్నప్పుడు "వృద్ధ పితామహా! ఈ జనతను సమూలంగా తుంచెయ్యి. మానవుడితో నీవు చేస్తున్న ప్రయోగం నిష్ఫలమైంది. ఈ పశువు స్వరూపాన్ని దిద్దుతోంది మంత్రాంగం; కాని దీనికి స్వసంఖ్యావృద్ధి వల్ల సంభవించే సమస్యల్ని దిద్దుకొనే సామర్థ్యం లేదు. వీళ్ళని మొదలంటా నిర్మూలించి, ఇంతకంటె మంచివాన్ని దేన్నయినా సృష్టించు" కనుక షా దృష్టి మానవుడి నుంచి మళ్ళి, అతి-మానవుడి వైపుకు ప్రసరించింది. అతడి అభ్యుదయాన్నే అతని హృదయం ఆకాంక్షించింది. ఈ అభ్యుదయ ఛాయలు ప్రపంచంలో శిరస్థానీయులుగా పరిగణింపబడే వాళ్లలో గోచరిస్తాయి. ఈ అతిమానవ జాతి, లేక పురుషోత్తమజాతి భూమండలంమీద అవతరించినప్పుడు, పృథివీచక్రంలో ఉన్న సమస్యలన్నీ వాటంతట అవే తేలిపోతాయి. ఈ అతి మానవుల్లో బుద్ధీ, హృదయాలు రెండున్నూ అద్భుత వికాసాన్ని పొందిఉంటాయి!

ఈ వర్ణన సరిగ్గా మనపురాణకారుల సత్యయుగం లేక కృతయుగంలా ఉంది. శ్రీ వివేకానంద స్వామి, శ్రీ అరవింద ఘోషులు కూడా ఇల్లాంటి అతి - మానవ లేక పురుషోత్తమ జాతి ఉద్భవించే అవకాశం ఉందని సూచించారు!!

ఈ నాటకంలో షా ప్రకృతి తత్వాన్ని విమర్శించాడు. నాయకుడైన డాన్ జుయాన్ షా యొక్క ప్రతిబింబమే. ప్రకృతి ఎన్నోవిధాల అస్వాధీనమైనదాన్ని స్వాధీనం చేసుకోవాలను కొంటోంది. స్త్రీ ప్రకృతి అంగం. స్త్రీయే కాదు, జీవలోకంలో ఉన్న అమహత్సంతతి అంతానూ. వివాహం సృష్టికోసం స్త్రీ పురుషుల్ని బంధిస్తోంది. ఈ బంధనయొక్క ఒరిపిడే పాతివ్రత్యం.

కాని ఏ రీతిగా గణికావృత్తి సృష్టికి క్షయకారణం అవుతోందో, అదేరీతిగా ఈ పాతివ్రత్యం కూడాను, అంటాడు. సహజప్రేమ మిళనకు ఫలంగా కలిగిన సంతానమే, అభిజాత్య సంతానం.

మెథుసులా

షా తన 'బ్యాక్ టు మెథుసులా' అనే నాటకంలో మొదట భాగంలో చిత్రించిన 'ఏడం ఈవ్' ల స్వారస్య విహీన జీవితం చాలా గొప్పగా ఉంటుంది. "చిరకాలమూ మనం ఇక్కడే ఉండాలి, చిరకాలం అంటే ఏమిటో ఊహించుకో" అంటాడు. ఆడమ్ ఒకేరీతిగా ఎల్లాంటిమార్పులేని ఆజీవితాన్ని గడపటంకంటే మృత్యువే మంచి దనుకొన్నారు వాళ్లు. కాని, ఈ మృత్యువుకూడా శాంతిని ఇవ్వలేదే? మరి ఉపాయం? జన్మ. ఎల్లా? ఈవ్ అంటుంది. "కోరుకోటం, చింతించటం, ఇచ్ఛించటం—సృష్టించటానికి". సంక్షేపంగా చెప్పాలంటే దీనిపేరే ఉద్భవం. అప్పుడే మనుష్యుణ్ణి రక్షించేదిగా, అభ్యుదయ సూచకంగా మృత్యువు నిల్చింది.

షా మనలాగా పునర్జన్మను విశ్వసించకపోయినా, మృత్యువు ఇంకోవిధమైన జన్మకు కారణం అని అంగీకరిస్తున్నాడు. ఇది వ్యక్తిగతంగా కాదు, విశ్వగతంగా. 'మ్యాన్ అండ్ సూపర్ మ్యాన్' లో నరక దృశ్యంలో ఈ భావాన్ని షా వివరించాడు.

మనిషి అన్నవాడు అధమం మూడు వందల ఏళ్ళయినా బతక్కపోతే, ఏ పనీ నిక్కచ్చిగా చెయ్యలేడని షా అంటాడు.

సమాప్తి

అగాధమైన షా నాటక-వాఙ్మయంలోంచి కొన్ని తుంపులు తీసికొని, ఆయన నాటక కళయొక్క స్వరూపాన్ని దిఙ్మాత్రంగా ఈ వ్యాసంలో చూపించాను. కాలగర్భంలో షాతోబాటు షా నాటకాలు కూడా విలీనమై పోతాయి కాని, అతడు ఆ నాటకాలకి వ్రాసిన ఉపోద్ఘాతాలు ఆచంద్రతారార్కం నిలబడతాయి అని అన్నాడు—జి. కె. చెస్టర్‌టన్. వర్తమాన ప్రపంచాన్ని తమ రచనలవల్ల కదలించిన వాళ్ళల్లో షా ఒకడు. 92 వ జన్మోత్సవం చేసుకొన్నాడు. మన సంప్రదాయ ప్రకారం నూరో జన్మోత్సవం గూడా చేసుకోవాలి అని భగవంతుణ్ణి ప్రార్థిద్దాం.

ఇండియా-నిజాం సంప్రదింపులు

శ్రీ యన్. వి. కృష్ణమాచారి

ఆగస్టు 15-1947 నాటికే భారతదేశములోని సంస్థానాలన్నీ ఒక్క హైదరాబాదు తప్ప, సంస్థానశాఖవారు నరేంద్రులు కలిసి తయారు చేసిన ప్రవేశపత్రంమీద సంతకాలు పెట్టి, ఇండియన్ యూనియన్‌లో చేరినాయి. అంత వరకు బ్రిటిషువారి చెప్పు చేతలలో ఉంటూ వచ్చిన - నిజాము - బ్రిటిషుసార్వభౌమత్వము పోవటం తోడనే తాను సర్వస్వతంత్రుడనాతానని ఒక ఫర్మానా ద్వారా ప్రకటించు కొన్నాడు.

ఆగస్టు 14 వ తేదీని ఆఖరి బ్రిటిషు రెసిడెంటుకు యిచ్చిన వీడ్కోలు విందులో—ఇంత కాలంనుంచి నమ్మిన బంటుగా ఉన్న తన్ను బ్రిటిషువారు నట్టేట వదలి పోతున్నందుకు వాపోయాడు. అంతేకాని విదేశీయుల బానిసత్వంనుండి తన దేశం బయటపడుతున్నందుకు సంతోషం కలిబుచ్చలేదు. ఆనాటి రాత్రే లార్డు మౌంటుబాటన్ భారత ప్రజాపరిషత్తులో చేసిన తన ఉపన్యాసంలో హైదరాబాదు విషయం మాట్లాడుతూ, నిజాం పాకిస్తానులో చేరవన్నాడని, క్రమక్రమేణా ఇండియన్ యూనియన్‌లో చేరుటలో గల లాభాన్ని గ్రహించ గలుగుతాడని చెప్పినాడు. ఇక్కడ హైదరాబాదులో ఇత్తెహాదుల్ ముస్లిమీన్ పక్షంవారు నిజాముకు 'హిజ్ మెజస్టీ' అను బిరుదు యిచ్చినారు ఊరంతా - రోడ్డు మీద కూడా - అసఫ్‌జాహీ పతాకములతో అలంకరించారు. ఉత్సవముల చూచుటకు బయలు దేరిన నిజాంకు రాత్రి, పది పన్నెండుగంటల ప్రాంతాన తుపాకులతో ట్యూటు సాయిచ్చారు. నిజాం తన మోటారును ఆపి దానిని అందుకొన్నాడు. భారత యూనియన్ పతాకములను బజారులోని 'ఇండియన్ యూనియన్ పోస్టాఫీసు మీద ఉంటే దానిని లాగివేశారు, మౌంటుబ్యాటన్ ఉపన్యాసం విన్నవారు, భోపాలు నవాబులాగ నిజాంకూడ ప్రవేశపత్రం మీద సంతకం పెట్టి ఉంటాడని, అది నెమ్మదిగా బయటపెడ్తారని అనుకున్నారు. కాని హైదరాబాదులో ఆగస్టు 15 వ తేదీని జరిగిన ఉత్సవాలు చూసి వారు మాత్రం అట్టిది జరిగి ఉండదని అనుకున్నారు. కాని హైదరాబాదు విషయమై ఇండియన్ యూనియన్ వారు తరువాత కొంతకాలంవరకు ప్రస్తావించలేదు. నిజాం ప్రభుత్వంకూడ ఈ విషయమై ఎట్టి ప్రకటనా చేయలేదు. ప్రజలను ఊహాలకు వదిలేశారు సెప్టెంబరు చివరలో పత్రికా విలేఖరులకు యిచ్చిన విందులో వారి ప్రశ్నలకు జవాబు చెప్తూ ఆగస్టు 15 నుండి రెండు నెలల వ్యవధిని ఇండియా ప్రభుత్వంనుండి హైదరాబాదు సంపాదించినట్లు ఛత్తారి నవాబు బయట పెట్టినాడు. హైదరాబాదును తక్షణమే ప్రవేశపత్రంమీద సంతకం పెట్టమని బలవంతం చేస్తే, హైదరాబాదులో మహా భయంకరమైన రక్తపాతం జరుగుతుందని, అసంఖ్యాకులైన నిరపరాధులు చంపబడతారని చెప్పి, ఇండియా ప్రభుత్వంనుండి రెండునెలల గడువు నిజాము రాయబారవర్గం సంపాదించిందట ఈ రాయబార వర్గంలో ఛత్తారి నవాబు, సర్ వాల్టర్ మాంక్టన్, నవాబు అలియావర్‌జంగు, పింగళి వెంకటరామారెడ్డి, రహీంగార్లు ఉన్నారు.

ఈ మొదటి రాయబారవర్గం. సంప్రతింపుల కొరకు ఢిల్లీ వెళ్తే వీరిని ఒకకంట కనిపెట్టటానికి ఇత్తెహాదు ముస్లిమీన్ అధ్యక్షుడు సయ్యద్ మహమ్మదు కాశిం రజ్వీగారికూడా ఢిల్లీ వెళ్ళినారు మౌంటుబాటన్, పటేల్, నెహ్రూలతోను సంస్థానశాఖా కార్యదర్శి మీనన్‌తోను జరుగుతున్న సంభాషణల ఇత్తెహాదుల్ ముస్లిమీన్ పక్షాన నిజాం మంత్రి వర్గంలో ఉన్న రహీం ఎప్పటికప్పుడు కాశిం రజ్వీకి తెలియజేస్తూ ఉండేవాడు. ఇది తెలిసి మాంక్టన్ అలియావర్‌జంగుగార్లు రహీం, వెంకటరామారెడ్డిగార్లకు విషయాలు చెప్పటం మానివేశారట. దానితో కాశిం రజ్వీకూడ సంభాషణల వైఖరి తెలియటం లగిపోయింది. రజ్వీ తనకే—ఢిల్లీకి సంప్రతింపులకు వచ్చిన రాయబారవర్గము హైదరాబాదు స్వాతంత్ర్యాన్ని అమ్మివేస్తున్నదని, రెడ్డి, రహీంగార్లకు మాంక్టన్, అలియావర్‌జంగుగార్లు ఏమీ తెలియనిచ్చుటలేదని, ఛత్తారి నవాబు వారి యిద్దరి చేతులలో కీలుబొమ్మని, తాను ఢిల్లీలో ఉండి యిదంతా కనిపెట్టకపోతే హైదరాబాదు మహా విపత్తులో పడిపోయి ఉండేదనీ హైదరాబాదుకు ఉత్తరాలు వ్రాశాడు. అవి రహబరె దక్కన్ అనే ఉర్దూపత్రికలో ప్రకటింపబడినాయి. అవి ఆధారంగా - ఇత్తెహాదుల్ ముస్లిమీన్ కార్యవర్గం రాయబారవర్గం మీద - రహీం రెడ్డిగార్లను వదలి విశ్వాసం లేదని తీర్మానం చేసింది నవాబు అలియావర్‌జంగు రాయబారవర్గం నుండి మంత్రిమండలి నుండి రాజీనామా యిచ్చాడు.

ఇంతలో ఇండియా ప్రభుత్వం యిచ్చిన గడువు పూర్తి అయింది. ప్రజలంతా హైదరాబాదుకు ప్రవేశపత్రం మీద సంతకం పెట్టటం కంటె గత్యంతరం లేదని, పటేలు ఊరుకోడని అనుకొనడం మొదలు పెట్టినారు. కాని, ఛత్తారి, సర్ వాల్టరు మాంక్టన్, సర్ సుల్తాను అహమ్మదుగార్లు ఢిల్లీకి హైదరాబాదు తరఫున సంప్రతింపులకు వెళ్లుతున్నారని పత్రికలలో వార్త వచ్చింది. సర్ సుల్తాను అహమ్మదు నిజాంకు, ఇండియన్ యూనియన్‌లో చేరక తప్పదని, సంస్థానంలో బాధ్యతాయుత ప్రభుత్వం నెలకొల్పక తప్పదని, అట్లు చేయకపోతే సంస్థానం విచ్ఛిన్నమౌతుందని, అసఫ్ జాహీ వంశం అంతమొందుతుందని చెప్పినట్లు తెలిసింది. సర్ వాల్టర్ మాంక్టన్‌తో నిజాం పాకిస్తానులో చేరతానన్నాడట. మాంక్టన్ అది అసంభవం అన్నాడట. దాంతో నిజాం, నేను ఇండియన్ యూనియన్‌లో చేరనన్నాడట. అయితే స్వతంత్రంగానే ఉండాలి. కాని ఆ స్వాతంత్ర్యాన్ని నిలబెట్టుకోవాలంటే ప్రజలకు పూర్తిగా బాధ్యతాయుత ప్రభుత్వం యియ్యాలని మాంక్టన్ అన్నాడట. క్రమక్రమేణా బాధ్యతాయుత ప్రభుత్వాన్ని తాను నెలకొల్పుతానన్నాడట నిజాం. ఈ వేళ కాకపోతే రేపైనా ఇండియన్ యూనియన్‌లో చేరవలసి ఉంటుందని, బాధ్యతాయుత ప్రభుత్వం నెలకొల్పవలసి ఉంటుందని మాంక్టన్ కూడా నిజాంకు స్పష్టంగా చెప్పినట్లు తెలియవచ్చింది ఒక పత్రికా విలేఖరితో మాట్లాడుతూ మాంక్టన్, నిజాం కుశాగ్రబుద్ధి అని రాజ్యాన్ని పోగొట్టుకొనడని కూడా చెప్పినట్లు తెలియవచ్చింది.

సర్ సుల్తాను అహమ్మదు నెహ్రూ, పటేలుగార్లతో తన కున్న స్నేహసంబంధాల, ఉపయోగించి, మాంక్టన్, మౌంటుబాటన్‌తో తనకున్న పాతికేండ్ల స్నేహాన్ని ఉపయోగించి యథాతథపు ఒడంబడిక నొకదానిని తయారుచేసుకొని హైదరాబాదు తీసుకవచ్చారు ఈ ఒడంబడిక పత్రం తయారు అయ్యేముందు నిజాంకు—అందులోని విషయాలన్నీ ఎప్పటికప్పుడు తెలియజేస్తూనే ఉన్నారు. హైదరాబాదులో మంత్రుల సమావేశాలు ప్రారంభమైనాయి. ఇత్తెహాదుల్ ముస్లిమీనువారు ఒడంబడికను ఖండిస్తూ—తీర్మానాలు చేశారు. నిజాం ఎవరిముందు వారి వాదన అంగీకరిస్తూ ఉండేవాడట. లేకపోతే ఉభయులను పిలిచి వాదనకు వదలివేసేవాడట...చివరకు గత్యంతరంలేక నిజాము దానిని అంగీకరించి సంతకంపెట్టి పంపుతానని ఛత్తారిని, మాంక్టన్‌ను, సులాను అహమ్మదును పంపివేశాడట ఆ రోజు సాయంతం ఒక పత్రికావిలేఖరితో మాట్లాడుతూ—సర్ సుల్తాను అహమ్మదు యథాతథపు ఒడంబడిక కంటెమంచిదానిని ఇంకెవ్వరూ భారతప్రభుత్వం నుండి సంపాదించలేరని చెప్పినాడట. హైదరాబాదు సైన్యం మాట వస్తే—దానిని సైన్యం అనటం—సైన్యమనే మాటకు అవమానమన్నాడట. ఒడంబడికపై నిజాం సంతకంపెట్టటాడా అని అడిగితే, సంతకంపై కాగితం వచ్చేదాకా ఏమీ చెప్పలేనని అన్నాడట. రాత్రి 10 గంటలకు నిజాం ఒడంబడికపై సంతకం పెట్టి ఛత్తారి నవాబును పంపినాడట. ఈ వార్త ఊరంతా ఎల్లా తెలిసిందో, రాత్రికి రాత్రే, ఇత్తెహాదుల్ ముస్లిమీను వారు ముసల్మానుల యిండ్లకు పోయి తలుపు తట్టి నిద్రలేపి వారిని లారీలలోను బస్సులలోను కార్లలోను నింపి ఛత్తారి నవాబు ఉండే షామంజిల్ దగ్గర చేరవేశారు. ఉదయం అయిదుగంటలకు నాల్గువేలమంది ముసల్మానులు ఆయుధాలతో ఛత్తారి నవాబు యింటిచుట్టూ ఉన్నారు. అక్కడ కాపలా కాస్తున్న సైనికులు కూడా ఇంటిముందు చేరిన సంగతి ఛత్తారినవాబుకుగాని, అతిథిగృహంలో ఉన్న మాంక్టన్ సుల్తాను అహమ్మదు గార్లకుగాని తెలియచెప్పలేదట ఉదయం - చేరినవారిని వాదాలు విన్నప్పుడే తమకు అంతమంది అక్కడ చేరినట్లు తెలిసిందని సుల్తాను అహమ్మదు చెప్పినాడు షామంజిల్ దగ్గర చేరినవారు ఛత్తారినవాబుతో నిజాం సంతకం పెట్టిన యథాతథపు ఒడంబడిక తమకు నచ్చదని దానిని ఢిల్లీ తీసుకెళ్ళరాదన్నారు. ఛత్తారి నవాబు తాము ఢిల్లీకి వెళ్ళుట మానవేశామని ప్రజలకు చెప్పి, నిజాం దగ్గరకు వెళ్లినాడు. ఈలోపుగా ఒక బ్రిటిషు మిలిటరీ ఆఫీసరు, నిజాం సైనికులతో వచ్చి. మాంక్టను, లేడీ మాంక్టను, సుల్తాను అహమ్మదుగార్లను తన బంగళాకు తీసుకొని వెళ్లినాడు. రెండు రోజులు వారెక్కడ ఉన్నదీ ఎవ్వరికీ తెలియదు: రాయబారవర్గం నిజాం సంతకం పెట్టిన ఒడంబడికతో ఢిల్లీకి పోవుట ఆగిపోయింది. ఛత్తారి నవాబు తన ప్రధాన మంత్రి పదవికి రాజీనామా యిచ్చి వెళ్లిపోయినాడు. కొంతకాలంనుండి మంత్రి హోదాలో ఉన్న మాంక్టన్ మంత్రి పదవిని వదలివేసి సలహాదారుగానే ఉండిపోయాడు

సర్ సులాను అహమ్మదు, హైదరాబాదు వదలి వెళ్లేముందు నిజాంను చూడటానికి వెళ్లితే, అక్కడ జరిగినదంతా పటేలుకు. మౌంటుబ్యాటనులకు చెప్తావా, అని అడిగినాడట. అందుకు సుల్తాను అహమ్మదు, బయటకు పోకుండా మీరు నన్ను యిక్కడ నిర్బంధించినేనో లేక ఢిల్లీ వెళ్లే లోపుగా నేను మరణించితేనో తప్ప అంతా చెప్పవలసి వస్తుందని జవాబు చెప్పినాడట. తరువాత పత్రికలలో సుల్తాను అహమ్మదు పటేలు మౌంట్‌బ్యాటనులను కలుసుకొన్నట్లు వార్తలు వచ్చినవి.

నిజాం సంతకంపెట్టిన యథాతథపు ఒడంబడికను రాయబారవర్గంవారు ఢిల్లీకి తీసికొనిపోకుండా, హైదరాబాదు ముసల్మానులు ప్రతికూలప్రదర్శనావల్ల ఆపివారన్న వార్తలు భారతప్రజల ఆశ్చర్యచకితుల చేసివి. రాజకోట జామనగర్ సభలలో మాట్లాడుతూ సర్దార్ పటేలు. హైదరాబాదునిజాము కాలగతిని గుర్తించి ఇండియన్ యూనియన్‌లో చేరి, సంస్థానంలో బాధ్యతాయుత ప్రభుత్వాన్ని నెలకొల్పకపోతే జునాగడ్ నవాబుకు పట్టినగతే అతనికి కూడా పట్టగలదని, చివరకు నిజాము తాను సృజించిన ఇత్తెహాదుల్ ముస్లిమీన్ అనే పెనుభూతానికి తానే ఎర అవుతాడని గట్టిగా చెప్పినాడు. పటేలు అవి వ్యాఖ్యానటవల్ల హైదరాబాదు ప్రభుత్వానికి, ఇత్తెహాదుల్ ముస్లిమీన్ వారికి ఆందోళన హెచ్చినది. తిరిగి ఢిల్లీలో సంప్రతింపులు జరపడానికి నవాబు మొయిన్ నవాజ జంగుగారి నాయకత్వమున ఇంకొక రాయబారవర్గం ఏర్పాటుబడింది. ఇందులో పింగళి వెంకటరామారెడ్డి, రహీంగార్లు సభ్యులు. మొయిన్ నవాజ్ జంగ్ నిజాం మంత్రిమండలిలో ఆర్థిక, పోలీసు విదేశాంగ శాఖల మంత్రిగా ఉండెను. ఈ క్రొత్త రాయబారవర్గము కూడా ఢిల్లీకి విమానయాత్రల మొదలు పెట్టినది కాని ఎంత ప్రయత్నించినా, ఛత్తారీ నవాబు,మాంక్టన్, సుల్తాను అహమ్మదులు సంపాదించినదానికంటె—అప్పటికే హైదరాబాదుకు కలిగిన చెడ్డపేరు వల్లనో యింకెందువల్లనో—ఎక్కువ అనుకూలమైన ఒడంబడిక సాధించలేకపోయింది. చివరకు గతిలేక ఛత్తారి తీసుకొనివచ్చిన దాని మీదనే నిజాం సంతకం పెట్టించి ఢిల్లీకి అందచేశారు. ఈ ఒడంబడిక ప్రకారం నిజాం ప్రభుత్వం ఒక సంవత్సరంవరకు రక్షణ రాకపోకలు విదేశ వ్యవహారాల మీద పూర్తి అధికారం ఇండియా ప్రభుత్వానికి యిచ్చివేసింది ఒక్క సార్వభౌమత్వంతప్ప—మిగతా అన్ని విషయాలలో హైదరాబాదు-ఇండియా యూనియన్‌లమధ్య సంబంధాలు ఆగస్టు 15 కు పూర్వం బ్రిటిషు ఇండియా-హైదరాబాదు మధ్యగల సంబంధాలే. ఇది యింత స్పష్టంగా ఉన్నా ఒడంబడికలోగాని, నిజాం, మౌంటుబాటనులు ఒకరికొకరు వ్రాసుకొన్న ఉత్తరాలలోగాని ఎక్కడా బిరారు ప్రస్తావన లేకున్నా రాయబార వర్గనాయకుడు, ఈ ఒడంబడికవల్ల బిరారుపై నామమాత్రం అధిపత్యం నిజాంకు ఉంటుందని పత్రికా విలేఖరులతో చెప్పినాడు. ఇదివరకు రాయబారవర్గం ఒప్పుకొన్న దానికన్న కూడా మీరు ఒప్పుకొన్నది—అని అంటే ఒడంబడిక అదేనని ఒప్పుకొని, దానిని ఒప్పుకొన్నవాళ్ళం ఛత్తారి లాంటి బయటవాళ్ళము కామని, పూర్తిగా హైదరాబాదీయులమని—అదే అందులో గల విశేషమన్నాడు. హైదరాబాదులో యీ విషయం ప్రస్తావిస్తూ, ఇదివరకు రెసిడెంటుకు హైదరాబాదు ప్రభుత్వానికి ఏదైనా ఒక విషయంలో అభిప్రాయభేదం వస్తే రెసిడెంటుమాటే నెగ్గేదని ఇప్పుడు అట్లు కాక ఇండియన్ యూనియన్ హైదరాబాదులమధ్య విభేదాలు పుట్టుకొనివస్తే వాటిని మధ్యవర్తి ద్వారా పరిష్కారం చేయించుకొనటానికి ఒడంబడికలో అవకాశ

(17 వ పేజీ చూడుడు)

భారతరాజకీయాలు :

ఇకముందు మనం ఎదుర్కోనవలసిన సమస్యలు

ఆగస్టు 15 వ తేదీన స్వాతంత్ర్యోత్సవం దేశమంతటా బ్రహ్మాండముగా జరిపినారు. మన దేశం స్వతంత్రమై యిప్పటికి ఒక సంవత్సరం గడిచి రెండవ సంవత్సరం ప్రవేశించింది. గత సంవత్సరకాలంలో మనదేశ రాజకీయ పరిస్థితులను క్రిందటివారం సంక్షిప్తంగా సమీక్షించాము. ఇకముందుకూడా భారత ప్రభుత్వం అటువంటి క్లిష్ట సమస్యలనే ఎదుర్కోనవలసి వుంటుంది. అంతర్జాతీయంగా, మనదేశంపట్ల సుహృద్భావము, గౌరవము మెండుగానే వున్నా, ఆ గౌరవాన్ని కాపాడుకోవటానికి, ఆ ప్రతిష్ఠను నిలబెట్టుకోవటానికి మనం తీవ్రంగా కృషి చేయాలి. అంతరంగికంగా, మనదేశంలో పరిస్థితులు ఏమాత్రమూ చక్కబడలేదు. పైగా ఏ క్షణానైనా, ఏ మూలనుంచైనా ప్రమాదం సంభవించగల అవకాశం గత సంవత్సరంకన్న ఇప్పుడే ఎక్కువగా వున్నది.

గత సంవత్సరం ఈ రోజులలో ఆందోళన జనకంగావున్న సంస్థానాలసమస్య సంతృప్తికరంగా పరిష్కరింపబడినా, సంస్థానాలవల్లనే మనకు ఇప్పుడు పెద్ద ఇబ్బందులు కలుగుతున్నవి. హైదరాబాద్, కాశ్మీర్‌లు కొరకరాని కొయ్యలుగా మిగిలిపోయినవి. కాశ్మీర్‌లో ఇండియా-పాకిస్థాన్‌లకు అప్రకటిత యుద్ధము జరుగుచున్నది. హైదరాబాద్‌లో సైనిక చర్యలు ఏ క్షణానసైనా ప్రారంభం కాగల ప్రమాదం ఏర్పడినది. ఇండియా-పాకిస్థాన్‌ల సంబంధాలు సంస్థానాలవలననే ఎప్పటికప్పుడు చెడిపోతున్నవి. జునాగఢ్‌తో ప్రారంభమై కాశ్మీర్‌తో వృద్ధిపొంది, హైదరాబాద్‌తో పరిపూర్ణమౌతున్న ఈ విభేదాలవలన, ఉభయ అధినివేశాలు ఎక్కువగా నష్టపడుతున్నా, పాకిస్థాన్ అనవసర జోక్యం ఎందుకు కలిగించుకుంటున్నదో బోధపడినప్పటికి, సమంజసంగా మాత్రం లేదు. భారత ప్రభుత్వ సత్తాను పరీక్షించి, ఇతర సంస్థానాధీశ్వరులకు దారి చూపుటకే జునాగఢ్‌ను ప్రోత్సహించి, పాకిస్థాన్‌లో కలుపుకొనిరి. ఇటువంటి అక్రమ చర్యలు భారత ప్రభుత్వం సుతరామూ అంగీకరించదని తేలిపోవటంతోనే భోపాల్, రాంపూర్ మొదలైన ముస్లిం సంస్థానాలన్నీ భారతదేశంలో చేరిపోయినవి. హైదరాబాద్ నవాబు మాత్రం కాలానికి ఎదురు ఈదటానికే నిశ్చయించుకున్నాడు. కాశ్మీర్ ప్రజలలో అధిక సంఖ్యాకులు ముస్లిములు కాబట్టి అది పాకిస్థాన్‌లో చేరవలెనని లీగర్లు వాంఛించినారు. ఇందుకు వారు అనుసరించిన మార్గములు మాత్రము హర్షదాయకముగా లేవు. తమ అకృత్యములవలననే వారు కాశ్మీర్ మహారాజును భారత యూనియన్ అందుకు తరిమివైచి అతిర్వాత పశ్చాత్తాపపడినారు. ఏమైనను కాశ్మీర్‌ను వదలిపెట్టుట పాకిస్థాన్‌కు ఇష్టములేదు. చట్టబద్ధముగా తమ దేశములో చేరి, తమ రక్షణను పొందినదేశమును వదలిపెట్టటకు భారత ప్రభుత్వము మాత్ర మెట్లు ఒప్పుకొనును? కాశ్మీర్ వంటి కీలకప్రాంతమును వదలుకొనటకు ఏ దేశమూ సామ్యముగా అంగీకరించదు. ఇప్పుడు కాశ్మీర్‌లో ఇండియా, పాకిస్థాన్‌లకు అప్రకటితయుద్ధము జరుగుచున్నది. భద్రతా మండలి ఆదేశము ప్రకారము యుద్ధవిరమణ జరుగునా? ఇందుకు పాకిస్థాన్ బహుశః ఒప్పుకొనవచ్చును. కాశ్మీర్‌లో న్యాయముగా పాకిస్థాన్‌కు చోటు లేదు. యుద్ధవిరమణ జరిపి, ఎవరి ఆక్రమణలోనున్న ప్రాంతమును వారే ఆక్రమించుకొని వుండునట్లు ఏర్పాటుచేసిన పాకిస్థాన్ ఆక్రమణలో కాశ్మీర్‌లో కొంతభాగము వుండిపోయి, స్థిరపడుటకు అవకాశమిచ్చును. అందువలన కాశ్మీర్ యుద్ధవిరమణ పాకిస్థాన్‌కు లాభకరము. కాశ్మీర్ భూభాగమునుండి దుండగులు పూర్తిగా వైదొలగనిదే యుద్ధమును విరమించుటకు భారత ప్రభుత్వ మంగీకరించదు. దుండగులు వైదొలగినతర్వాత ఎట్టి షరతులపైనైన ప్లెబిసైట్ జరుపవచ్చునుగాని మన దేశములో ఇంకొక దేశపు సైనికులకు తావిచ్చు ప్రసక్తియే లేదు. కాబట్టి యుద్ధవిరమణ సూచన అంగీకరించుట అసంభవము. అయితే కాశ్మీర్‌లో ఇండియా-పాకిస్థాన్‌లకు అప్రకటితముగా యుద్ధము జరుగుచునే వుండునా? పాకిస్థాన్ ఇట్టి అప్రకటిత యుద్ధము జరుపుచున్నందుకు ఇండియా ఏమి ప్రతీకారం జరుపును? పాకిస్థాన్‌తో వర్తక వ్యాపార సంబంధములు తెంచివేయునా? లేక, దుండగుల స్థావరముల పైన దాడిచేయుటకు పూనుకొనునా? ఇండియా పాకిస్థాన్‌లమధ్య ప్రకటిత యుద్ధమే సంభవమా? ఈలోగా ఇండియాలో మతసంక్షోభము తిరిగి ప్రారంభమగునా? ఇంతవరకు ...కుండ, కాశ్మీర్ యుద్ధరంగమునకు ఇష్టోచ్ఛముగా సేనలను పంపించి, పాకిస్థాన్ సేనలు పఠానుల వెనుక వుండి చేయుటకే పూనుకొనును. కాశ్మీర్ సమస్య గత సంవత్సరముకన్న ఈ సంవత్సరమే ఎక్కువ ...గా రిణమించును.

హైదరాబాద్ సంస్థానంలో అరచకాన్ని అరికట్టటానికి భారత ప్రభుత్వం ఏ క్షణానసైనా సైనిక చర్యలు ప్రారంభించక తప్పని పరిస్థితి ఏర్పడినది. సంస్థాన వ్యవహారాలపై ఆధిపత్యము నవాబు చేతులలోనుండి పూర్తిగా రజాకార్ల చేతులలోకి మారిపోయినది. నిజాంరాజుకులే ఈ పరిస్థితిని గర్హించి, ప్రభుత్వముతో తమ సంబంధములను త్రెంచివేసికొనుచున్నారు. సంస్థాన స్వాతంత్ర్యం కాపాడటానికి హైదరాబాద్ ముస్లిములు ప్రాణాలైనా వారపోసెదరని రజ్వీతోపాటు లాయిక్ఆలీ కూడా ప్రచారం చేస్తున్నారు. సంస్థానముపై సైనికచర్యలు ఎప్పుడన్నదే ఇప్పుడు భారతదేశంలో సర్వత్రా అడగబడుచున్న ప్రశ్న. ఒకవేళ సైనిక చర్యలే ప్రారంభమైతే, సంస్థానంలోని హిందువుల గతి ఏమిటి? భారత సేనలు సంస్థానాన్ని పూర్తిగా ఆక్రమించుకునే లోపల వారిని హింసించరా? నిజాం నవాబు, అతని ధనము ఏమైపోతవి? ధనమంతా పాకిస్థానుకు అప్పుడే చేరిపోయినదా? నిజాం రాజ్యపరిత్యాగము చేసి, కొడుకును సింహాసనంపై యెక్కించి భారతయూనియన్‌లో చేరుస్తారా? నిజాంపై సైనికచర్యలే ప్రారంభమైతే, దక్షిణ భారతదేశములో యింక సంక్షోభము తప్పదా? దీనివలన ఇండియా-పాకిస్థాన్‌ల సంబంధాలు మరింత చెడిపోవా? మొత్తంమీద, హైదరాబాద్ సమస్య ఈ సంవత్సరంలో తేలిపోగలదు.

*　*　*　*

భారతదేశం బ్రిటిష్ సామ్రాజ్య కూటమిలో వుండటమో లేదో ఇంకా నిర్ణయింపబడలేదు. భారతరాజ్యాంగ చట్ట ముసాయిదా చర్చించి, ఆమోదించుటకు రాజ్యాంగ పరిషత్తులోనే సమావేశమగును. పండిట్ నెహ్రూ ఈలోపుగానే, లండన్ వెళ్లివచ్చి, ఇండియా-బ్రిటన్‌ల సంబంధాలపై తన అభిప్రాయాలను రాజ్యాంగ పరిషత్తుకు ఎరుక పరుస్తాడు. ఈ పర్యాయం రాజ్యాంగపరిషత్తు సమావేశమయినప్పుడు భారత రాజ్యాంగ చట్టంతోపాటు, ఈ విషయమై అంతిమ నిర్ణయం జరుగుతుంది. బ్రిటిష్ సామ్రాజ్య కూటమినుండి విడిపోతే కలుగగల లాభాలను, సామ్రాజ్య కూటమిలోవుంటే కలుగగల లాభాలను వివరంగా పరిశీలించిన పిదపనే ఈ నిర్ణయం జరుగుతుంది. ఇండియా-బ్రిటన్‌ల ప్రస్తుతసంబంధాలనుబట్టి, ఇండియా సామ్రాజ్య కూటమిలో వుండడానికే నిర్ణయించినా ఆశ్చర్యపడనక్కరలేదు.

*　*　*　*

కాంగ్రెస్‌వాదుల అనైక్యత నానాటికీ మితిమీరిపోతున్నది. ఇప్పటికే ప్రతిరాష్ట్రంలోను కాంగ్రెస్‌వాదులు గ్రూపులు, ముఠాలుగా ఏర్పడినారు. ప్రతిరాష్ట్ర మంత్రివర్గంపైనా విశ్వాసరాహిత్య తీర్మానాలు ఎప్పుడూ ఆలోచనలోనే వుంటున్నాయి. రాష్ట్రప్రభుత్వాల పరిపాలనకూడ ఏమంత సంతృప్తికరంగా లేదు. ఇందుకు పూర్తిగా కాంగ్రెస్‌వాదులే కారణం కాకపోయినా, నిందమాత్రం వారిపైననే వుంటున్నది. రాష్ట్రాభిమానం పెచ్చు పెరిగిపోతున్నది. ఆయా రాష్ట్రాలలో ఆధిపత్యం వహించివున్న వర్గాలు అధికారాన్ని తమ ప్రాంతప్రయోజనాలకొరకే ఉపయోగిస్తూ, ఇతర ప్రాంతాలవారు ప్రత్యేక రాష్ట్రాల కొరకు తీవ్రంగా ఆందోళన చేస్తున్నారు. రాష్ట్రీయాభిమానం కూడదని ఎంత మందలించినా, బాధపడుతున్నవారు ఈ వాదాన్ని వదలుకోరు. అధికసంఖ్యాకులై అధికార పదవులలో వున్నవారి వైఖరిలో మార్పు రావటమో, భాషాప్రాంతాలకు ప్రత్యేక రాష్ట్రాలు ఏర్పాటుచేయటమో జరగనిదే రాష్ట్ర దురభిమానం తొలగిపోదు; పైగా అనవసర కల్లోలాలకికూడ దారి తీయవచ్చును. ఈ సమస్య ఈ సంవత్సరంలో బహుశః పరిష్కారం కావచ్చును.

*　*　*　*

కాంగ్రెస్ సంస్థ పునర్నిర్మాణమై, సోషలిస్టులు ప్రత్యేక పక్షముగా ఏర్పాటు జరిగినది. కమ్యూనిస్టులు దౌర్జన్యవాదాన్నవలంబించి, తమకు పలుకుబడి వున్న చోట్లల్లో అల్లరులు ప్రారంభించి, జైళ్ళకు పోయారు. భారత రాజకీయరంగంలో కమ్యూనిస్టుపార్టీ ఒక ముఖ్య పాత్ర వహించగల అవకాశం తప్పిపోయింది. ఇకముందు రాజకీయ పోరాటం కాంగ్రెస్‌కు, సోషలిస్టులకు జరుగగలదు. సోషలిస్టుపార్టీ యంత్రము ప్రచారము ఇప్పుడిప్పుడే దేశంలో అన్నిమూలలకు వ్యాపిస్తున్నవి. రానున్న ఎన్నికలలో కాంగ్రెస్‌వాదులకు సోషలిస్టులు చికాకు కలిగించగలరు. ఆ ఎన్నికలు ఈ సంవత్సరాంతంలోగానే—1949 ఆగస్టు 15 కు పూర్వమే—బహుశః జరుగవచ్చును. ఆ ఎన్నికలలో సోషలిస్టులు ఇప్పటికన్న ఎక్కువ విజయాలు సాధించితీరుతారనటం నిస్సందేహం. కాంగ్రెస్‌వాదులు ఇప్పుడైనా మేల్కొని, తమ వ్యవహార ధోరణి చక్కబరచుకొనలేకపోతే, సోషలిస్టు పార్టీని బలపరచినవారౌతారు.

*　*　*

కాందిశీకుల పునరావాసపు ఏర్పాట్లు ఇంకా పూర్తికాలేదు. 20 లక్షలమంది కాందిశీకులకు ఆయా రాష్ట్రాలలో పునరావాసం కలిపించే

(21 వ పేజి చూడుడు)

మద్రాసు కొత్త గవర్నరు



శ్రీకృష్ణ కుమార్ సింహజీ భావసింహజీ
భావనగరు మహారాజా



సర్. ఆర్చిబాల్డు నై

సర్ ఆర్చిబాల్డునై స్థానంలో మద్రాసు గవర్నరుగా, భావనగర్ సంస్థానరాజు, మహారాజా శ్రీ కృష్ణకుమార్ సింహజీ, భావసింహజీగారిని భారతప్రభుత్వం నియమించింది. మహారాజులను ఒక పెద్దరాష్ట్రానికి గవర్నరుగా నియమించటానికి ఇదే ప్రథమం. సెప్టెంబరునెల మొదటిలో సర్ ఆర్చిబాల్డునై తన పదవినుండి విరమించటం, వీరు ఆ స్థానం స్వీకరించటం జరుగుతుంది. ప్రస్తుతం ఈయన సౌరాష్ట్ర సంస్థానకూటమికి ఉపరాజప్రముఖ్‌గా వ్యవహరిస్తున్నాడు.

భావనగర్ మహారాజుకి 36 ఏండ్లు. హారో విశ్వవిద్యాలయంలో చదువుకొన్న విద్యాధికుడు. మంచి వక్త. ఈయన పదునెన్మిదో ఏట భావనగర్ సింహాసనం అధిష్ఠించాడు. పూర్వపు నిరంకుశవిధానాలలో పరిపాలనలో తను జోక్యం కలుగచేసుకోటం అనేది లేకుండా, దివాను మీదే పరిపాలన అంతా వదిలేసేవాడు. బాధ్యతాయుత ప్రజాప్రభుత్వం, ప్రప్రథమంగా తన సంస్థానంలో స్థాపించిన మొదటి సంస్థానాధీశుడు ఈయనే. భారత స్వాతంత్ర్యప్రకటనతో, తన రాజ్యాధికారము ప్రజామంత్రులపరం చేశాడు. కథియవాడ్ సంస్థానాలను ఒక కూటమిగా చెయ్యటంలో ఈయన చాలా శ్రద్ధ వహించి, అల్లాటి సంస్థానకూటములకు దోహదమిచ్చిన ప్రథమ సంస్థానాధీశుడు కూడా ఈయనే.

ఈయనసతీమణి, ప్రస్తుత గోండాల్ మహారాజుగారి పుత్రిక. ఈ ప్రభు దంపతులు ఇద్దరూకూడా, భావనగర్ సంస్థానంలో, కుటీర పరిశ్రమల అభివృద్ధిచేయుటంలో చాలా కృషి చేశారు. గ్రామ పునరుద్ధరణ ప్రణాళికను నెరపటానికయే ఖర్చంతా ఈ మహారాజు, రాణీ, తమ స్వంతధనంలోనుంచే వినియోగించారు.

భావనగర్ మహారాజా చాలా దైవభక్తుడు. తనకు రాజ్యాధిపత్యం వచ్చినవెంటనే, సకుటుంబంగా బయలుదేరి కేదారనాథయాత్ర ముగించుకొని వచ్చినాడు.

ఆడంబర రహితుడుగా, వినయశీలుడుగా ఉన్న ఈయన మద్రాసుగవర్నరుపదవికి అన్నివిధాలా తగుననే, అభిజ్ఞులంతా అభినందిస్తున్నారు,

ప్రజాస్వామ్య నిర్మాణం

శ్రీ సహజానందం

ప్రజాస్వామ్యక వ్యవస్థ మనలక్ష్యం. ఈ లక్ష్యం సరిగా సిద్ధించాలంటే, ప్రజలందరిలో సంఘ చైతన్యం వర్ధిల్లాలి.

ఒక నాయకుని ప్రభుత్వమని గాని, ఒక పార్టీ ప్రభుత్వమని గాని ఎంచటం పొరబాటు. ప్రజాస్వామిక తత్వాన్నే మఱచినట్లువుతుంది. జరిగే పొరబాట్లు, తప్పులు అన్యాయాలు నాయకుల వల్లనే పార్టీలవల్లనే జరుగుతున్న యని ఖండించి, నిర్లిప్తతతో కూర్చోటం ప్రజాస్వామిక లక్షణం కాదు.

25 ఏళ్లనుంచి ఎన్నో పార్టీలు ఎన్నో తీవ్ర ఉద్యమాలను నడిపినందుకు స్వాతంత్ర్యం సిద్ధించినా ఇందువలన తగినంత విస్తృతి, గాఢ చైతన్యం ప్రజల్లో కలగలేదు.

బ్రిటిషుప్రభుత్వమంటే ప్రజ లెలా నిర్లిప్తత చూపారో ఇప్పుడు స్వతంత్ర ప్రభుత్వమంటే కూడ అలాగే మళ్లీ నిర్లిప్తతను చూపిస్తున్నారు.

ప్రజల అవిద్య ఇందుకు ముఖ్యకారణం అనవచ్చు. కాని విద్యాధికుల సంగతి కూడా ఎక్కువ బాగాలేదు. విద్యాధికుల్లో కొందరు స్వాతంత్ర్య ఉద్యమాలకు వ్యతిరేకంగా ఉన్నారు. ఉద్యోగాలు, వ్యాపారం భోగం - ఇవే ఇహమూ, పరమూ.

ఇప్పుడూ. అంతే దేశవిషయాలతో వీరికి ప్రసక్తి లేదు.

ఉద్యోగాలు, వ్యాపారం, భోగం—ఇవే మళ్ళీ ఇప్పుడూ ఇహం, పరం. ప్రభుత్వచర్యల వలన అటంకాలు కలిగినప్పుడుమటుకు 'ఏమిటయ్యా...స్వతంత్రప్రభుత్వ మంటారు! పాత రోజులే నాణెం' అని హుంకరిస్తారు.

హైదరాబాదు విషయం ఉదాహరణకు తీసుకుందాం. కొంతమంది విద్యాధికుల విమర్శ ఇది:

"మనవాళ్లు నైజామును జేసేదేమీ లేదు. హాయిగా మద్రాసులోని తెలుగు ప్రాంతాలను కూడా నైజాముకు ఇస్తే, సుఖపడిపోతాం" అని.

మరికొంతమంది :

"బ్రిటీషువాళ్లు మళ్ళీ వస్తామంటే, మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తాం".

ఇలా బైటకి చెప్పక పోవచ్చుగాని, ఈ ధోరణి ఉన్న విద్యాధికులు ఉన్నారు.

వీరి హీనస్థితిని గురించి విశేషించి వ్యాఖ్యానించ నక్కర్లేదు. ఇలాంటివారి వలన దేశానికి కలిగే అపకారం ఎక్కువ.

ఇక సామాన్యప్రజల ధోరణి

'ఏదో నాయకులే గదా ఏలుతున్నారు' అని అంటూ, ధరలు పెరిగితేనూ, కూలీలు పెరిగితేనూ మటుకు—

"ఏం ప్రభుత్వం? ఈ నాయకుల వ్యవహారం మరీ అధ్వాన్నంగా ఉంది" అని పెదములు విరుస్తారు.

తమ స్వార్థానికి చిక్కు వచ్చినప్పుడు మట్టుకే దేశంసంగతి మనస్సుకు పట్టించుకొని, మిగతా కాలమంతా చూపించే నిర్లిప్తతకు, విపరీత వికృత విమర్శకు, పైన ఉదాహరించిన అలోచనా వైఖరులకు మూలం దురభిప్రాయం. ఆ దురభిప్రాయం ఇది.

దేశపరిపాలనకు తాము బాధ్యులు కామని ఎవరో నాయకులు, పార్టీలు అని భ్రాంతిచెంది, అయినదానికీ, కానిదానికీ ఇతరులపై ఆధారపడటం, తాము మటుకూ చూస్తూ నిలబడటం.—

ఈ వైఖరి ప్రజాస్వామిక జీవితానికి పూర్తి విరుద్ధం. దౌర్జన్యాన్నే, నియంతృత్వాన్నే ఆదర్శంగా అంగీకరించేవారు ప్రజాస్వామిక వ్యవస్థకు ఎంతవిరోధులో, ఎంత ప్రమాదకారకులో ఈ నిర్లిప్తులూ అంత ప్రమాదకారకులు. ఎందుకంటె కొందరు శత్రుత్వం వహించి, కొందరు నిర్లిప్తత వహించి ఉంటే రాజకీయ వ్యవస్థ కూలనన్నా కూలుతుంది లేదా దౌర్జన్యం ద్వారాన్నే జీవాన్ని పొడిగించుకుంటూ, దౌర్జన్యవాదుల దాడికి ప్రతిక్రియగా వారి దౌర్జన్యాన్ని మించిన దౌర్జన్యాన్ని అవలంబించి, నిరంకుశ స్వరూపాన్ని పొందుతుంది. ఒకవేళ అట్టి నిరంకుశ వ్యవస్థను దౌర్జన్యవాదులు పడగొట్టి, మరొక ప్రభుత్వ స్నేర్పఱచగలిగినా, దానిపైకూడా ప్రజలకు ఏమాత్రం అధికారం ఉండజాలదు. ఈ కొత్త ప్రభుత్వం అధిక సంఖ్యాకులకు జీవన వసతులను తగినంతగా అమర్చగలిగినా అందువల్ల ప్రజల నిజ స్వేచ్ఛ, అంతశ్శక్తి, స్వేచ్ఛాజీవం పొందవు. సంఘంయొక్క స్వత్వమే హతం కాగలదు. పరమలక్ష్యాన్ని మఱచి, తాత్కాలిక ప్రయోజనాన్నే ఆదర్శంగా స్వీకరించకూడదు. మన పరమలక్ష్యం ఏమిటి?

కోటానుకోట్ల ప్రజలు అభివృద్ధి, వికాసం పొంది, సంపూర్ణ జీవనానికి దోహదమిచ్చే, ఆర్థిక రాజకీయ సాంఘిక వ్యక్తితత్త్వాలను గుర్తించి వాటి ప్రకారం అవసరమైన స్వేచ్ఛను, వ్యవస్థలను నిర్మించగలిగిన స్వాతంత్ర్యం, అధికారం ప్రజానీకానికి ఉండాలి.

"మీ తిండి బట్ట చదువు సంస్థ యేర్పాటు చేస్తాం. మేము చెప్పినట్టుమటుకు మీరు వినాలి." అని కొంతమంది మంచి ఉద్దేశ్యాలతోనే తమ అధికారాన్ని స్థాపించుకొన్నా అది ప్రజల నిజవికాసానికి తోడ్పడదు. బిచ్చగాని స్థాయిలోనే ప్రజలు ఉండక తప్పదు. దాతలు మారవచ్చు. దాతలు ఇదివఱకటి వారికంటె కూడా మంచివారు కావచ్చు అధిపతులు మారటంతప్ప ప్రజలకు పరాధీనత తప్పదు.

ప్రజల నిర్లిప్తతవల్ల ప్రభుత్వం ప్రజాస్వామిక తత్వానికి దూరమయ్యే ప్రమాదం ఎంతో ఉంది. ఈ నిర్లిప్తతవల్ల దౌర్జన్యాన్నే ఆదర్శంగా స్వీకరించి ప్రజాస్వామిక తత్త్వాన్ని ప్రతిఘటించే వారివల్లంగానూ ఎంతో ప్రమాదం ప్రజాస్వామ్యానికి కలగక తప్పదు.

ప్రభుత్వం ఒక్కటే కాదు, ప్రజాస్వామిక తత్వాన్ని ఉపాసించవలసింది—నిజానికి సంఘం యావత్తూ ప్రజాస్వామిక తత్త్వాన్నే ఎన్నుకుంటే, ప్రభుత్వస్వరూపం అలాగే ఉంటుంది. ప్రతివ్యక్తీ, వర్గమూ, పార్టీలూ అందరూ ప్రజాస్వామిక తత్వాన్ని ఆదర్శంగా స్వీకరించాలి. అప్పుడు మటుకే మనం నిజమైన ప్రజారాజ్యానికి నోచుకుంటాం.

కాబట్టి నిర్లిప్తత, వట్టి అసంతృప్తి, నిష్ఫల విమర్శ ప్రజల అభివృద్ధికి తోడ్పడవు. ప్రజాస్వామిక వ్యవస్థ ప్రజల పెన్నిధి. ఈ ప్రాణ రహస్యాన్ని ప్రజలు గుర్తించి, దాన్ని కాపాడుకుంటూ, శుద్ధపఱచుకుంటూ, నిర్దుష్టం చేసుకుంటూ, బలపఱచుకోవాలి.

ముఖ్యంగా మన దేశంలో నిర్లిప్తత విస్తారంగా ఉంది. ఎన్నికల్లో ఈ విషయం స్పష్టమౌతుంది.

బొంబాయి మ్యునిసిపల్ ఎన్నికల్లో (ఫిబ్రవరిలో జరిగినవి) 100 కి 35 గురే ఓట్లు చేశారు. ఈ 35 మంది కూడా పోటీ చేసే పార్టీల ప్రచారం, ప్రబోధంవల్ల ఓటుచేశారు. వారికి వారై కాదు. మరొక 30 మందికి సరైన ఇళ్లూ, వాకిళ్లూ లేకపోవటంవల్ల, వారి ఆచూకీ చిక్కలేదు—పార్టీలకు. ఈ దృష్ట్యా చూస్తే, బొంబాయి మ్యునిసిపల్ అధికారం ప్రజలదే అన్నప్పటికీ, 35 మంది 65 మందిమీద అధికారం చెలాయిస్తున్నారన్నమాట. ఇది ప్రజాస్వామిక లక్షణం కాదు.

పార్టీల విజయాపజయాలకంటె ముఖ్యమైన విషయం, ప్రజలందరు ఎన్నికల్లో పాల్గొనేట్టు ప్రబోధం చేయాలి. రాజకీయ చైతన్యం విస్తారంగా ఉండే బొంబాయిలోనే పరిస్థితి ఇలా ఉంటే, ఇతర ప్రాంతాలసంగతి ఇక చెప్పక్కర్లేదు.

ఇట్టి దుస్థితిని మనం తొలగించుకోక పోతే ఏ పార్టీయో ఒక పార్టీ నియంతృత్వం మనకు తప్పదు.తృత్వాలకు నియంతలే కాదు, నిజానికి ప్రజలే బాధ్యులు.

ఇప్పుడు కూడా మనలో కొందరు అంటూ ఉంటారు.

"ఏమిటీ, డెమాక్రసీ అంటారు? ఈ మంత్రులు లాభంలేదు. మనలో డిక్టేటరు కావాలి" అని.

అధికారం, దర్పం అంటే మానవ ప్రకృతికుండే మోజు ఇందుకుమూలం.

సామాన్య ప్రజానీకపు నిర్లిప్తతను, విద్యాధికుల వక్రవైఖరిని సరిచేసుకోటం అత్యవసరం.

ప్రభుత్వంతో గాని, ఇతర పార్టీలతో గాని బలాబలాల పరీక్షకు దిగేముందు ప్రతి పార్టీ ప్రజల్లో సక్రమమైన సాంఘిక చైతన్యం కలిగించాలి. ప్రజాస్వామిక విధానాన్ని ప్రజాస్వామిక తత్వాన్ని ఒప్పుకునేవారిపై ఈ బాధ్యత ఉంది.

ప్రజల తాత్కాలిక, ఉద్రేక, దౌర్జన్య ప్రతిఘటనా బలంపై ఆధారపడి ఆ ప్రవృత్తిని ఉపయోగించటం శాస్త్రీయం కాదు. అనుక్షణం వారికి విషయజ్ఞానం కలిగించి వాస్తవపరిస్థితుల్లో కర్తవ్యధర్మాన్ని గుర్తింప చేయించి, శాసనకర్తలు, శాసనబద్ధులు తామే అనే సత్యాన్ని ప్రబోధంచేయాలి. తత్ఫలితంగా ప్రబుద్ధులైన శిక్షితులైన ప్రజల శక్తే నిజమైన ప్రజాశక్తి. కాని ప్రజలను చైతన్యపఱచకుండా, ఏదో విధంగా దౌర్జన్యంద్వారా ప్రభుత్వాలను పడగొట్టాలని ప్రయత్నించటం వ్యక్తుల సాహసత్యాగాలకు నిదర్శనమైనా ప్రజాస్వామిక రీతి కాదు. ప్రజాశక్తి అంటే హింసాశక్తే కాదు. విషయగ్రహణ, విమర్శనాశక్తి, సంఘటన... ఇవన్నీ ఉన్న ప్రజాశక్తే నిజశక్తి.

ప్రభుత్వాధికారం వహించేమంత్రులు, అధికార్లు ప్రజాభిప్రాయాన్ని, ప్రజాశ్రేయస్సును, ప్రజాస్వామిక తత్త్వాన్ని త్రోసిపుచ్చి, ప్రజాశక్తి మీద కాక, ఆయుధశక్తిమీద ఆధారపడి సంఘంలో ప్రజాస్వామిక వికాసానికి వినాశనంకల్పిస్తూ ప్రభుత్వపీఠాన్ని మరఫిరంగిగా ఉపయోగిస్తే, అందుకు తలొగ్గటం దేశభక్తి కాదు. ప్రజాస్వామికలక్షణం కాదు. ఎవరు ప్రజాస్వామ్యాన్ని దెబ్బకొట్టతారో, వారిని నిర్దాక్షిణ్యంగా నిర్వీర్యపఱచి, నేలకూల్చటం ప్రజాస్వామికవాదుల విధి, ధర్మం. పై చెప్పిన వికృతరూపాన్ని ప్రభుత్వం అలవర్చుకుంటే, దాన్ని రద్దుచేసి, మళ్లీ తేజోవంతమైన ప్రభుత్వాన్ని ప్రజలేర్పఱచుకోవాలి. సంఘంలో వ్యక్తులు, వర్గాలు నిజమైన ప్రజాస్వామిక శక్తిని అలవర్చుకుంటే, ఏ ప్రభుత్వాలు గాని, పార్టీలుగాని నిరంకుశదౌర్జన్యంతో నెగ్గటం అసాధ్యం. మహాసైన్యాలను ప్రజానీకంపైకి ఉరికించిన ఉద్దండులు చివరకు ప్రజావిజృంభణ రౌద్రానికి తట్టుకోలేక, నేలకూలారు.

ఈ నిజమైన ప్రజాశక్తి సిద్ధించనంతవరకూ, అనవసరం. అకాల దౌర్జన్య—విధానాలవలన ఉపయోగం లేదు.

విద్యాధికుల్లో కొందరి వక్రవైఖరి ఎలా ఉన్నా అవిద్యమటుకు దేశానికి శత్రువు. విద్య లేని, చైతన్యం లేనివారు ప్రజాస్వామిక వ్యతిరేకశక్తు లేలిగ్గా లోనవుతారు. తాము మంచివారు అని అనుకున్న వారిపై అచంచల విశ్వాసం వీరికున్నా, ఆ మంచివారే వీరి అమాయక విశ్వాస ఫలితంగా నిరంకుశు లవుతారు. గతచరిత్రలో ఇలాంటి దుష్పరిణామం అనేక సార్లు వాటిల్లింది.

ప్రజాస్వామిక వ్యవస్థకు విద్య పునాది. మన ప్రభుత్వాలు, పార్టీలు ఈ ప్రాణప్రదమైన పనికి, విద్యావ్యాప్తికి, విస్తృత వ్యాప్తికి వెంటనే పూనుకోవాలి. రాష్ట్రంలో సుమారు 4000 పల్లెలున్నయ్. చిత్తశుద్ధి, శక్తి సామర్థ్యాలున్న వారు ఈ పని వెంటనే ఆరంభిస్తే అంతమంచిది.

సమ్మెలు, వ్యతిరేక ప్రదర్శనాలు, సభలు, సమావేశాలు, ప్రతిఘటన, శాసనోల్లంఘనం—సరిగా వినియోగిస్తే ప్రజల శ్రేయస్సుకు ఎంత అవసరమో ఈ విద్యాప్రబోధ కార్యక్రమం బహుశః అంతకంటె కూడ ఎక్కువ అవసరం.

పదిమంది మేధావులు కలసి, ప్రభుత్వ విధానాలతో అసంతృప్తిచెంది, ఊరికే కాగితంపై తీర్మానాలు చేస్తే ప్రయోజనంలేదు. సహనశక్తి ఉడిగి, అకాల తాత్కాలిక వైరుధ్యానికి దిగటమూ నిష్ప్రయోజనం.

144వ సెక్షను, ప్రజారక్షణచట్టం, లాఠీచార్జి, బాష్పవాయు ప్రయోగం, తుపాకీ కాల్పులు అవసరమనే ప్రభుత్వవాదన మాటవరసకు ఒప్పుకుందాం. ప్రభుత్వం (ప్రజాస్వామిక తత్త్వప్రేరితమైనది) ప్రజాస్వామిక శత్రువులనే ఎదుర్కోటానికి, నిర్వీర్యపఱచటానికి ఈ హింస అవసరమని అందాం. కాని ఇది మాత్రమే కాదు కావలసింది. ఇందుమూలాననే ప్రజాస్వామ్యం బలపడదు. ప్రజాస్వామ్యానికి శత్రుత్వం ప్రేరేపించ గలగటానికి పరిస్థితు లెందుకు అదునుగా, అనువుగా ఉన్నాయో విచారించి, గ్రహించి, వాటిని చక్కబఱచాలి. ప్రజాస్వామికతత్వం సంఘంలో, ప్రభుత్వపాలనలో ఎక్కడో లోపిస్తూ ఉండబట్టే, దాని వ్యతిరేక తత్వం వేళ్లు పోసుకుంటోంది.

ఇప్పుడు, ఇవ్వాళ సంఘం అనుసరిస్తున్న తత్త్వం ప్రజాస్వామికతత్త్వం అనుకోటం భ్రాంతి పొరబాటు. అసత్యం. ప్రజాస్వామ్యమంటే శాంతిభద్రతలే కాదు. నేటికి స్వాతంత్ర్యం సిద్ధించినందువల్ల మనం ప్రజాస్వామిక వ్యవస్థను నిర్మించుకోవాలని నిశ్చయించుకొని, అందుకొరకై పాటుపడుతున్నాం. ఇప్పటి సమాజంలో ప్రజాస్వామికం కాని, అందుకు వ్యతిరేకమైన తత్త్వాలు, లక్షణాలు అనేకం ఉన్నయ్-కుటుంబంనుంచి ప్రభుత్వంవరకూ. వీటిని మార్చకుండా, ఇలాగే ప్రజాస్వామ్యాన్ని నిర్మిస్తామనటం అశాస్త్రీయం, అసాధ్యం.

మహాత్ముడే హరిజనోద్ధరణకు పూనుకొని, కులనిర్మాణంలో ఉన్న అ—ప్రజాస్వామిక లక్షణాన్ని నిర్మూలించబట్టి, ఆ రంగంలో ఈ నాటికీ అ-ప్రజాస్వామిక శక్తులు తలెత్తలేక పోయినయ్. ఇలాగే సంఘనిర్మాణంలోని ఇతర భాగాల్లో కూడా ఉంటూవస్తున్న అ-ప్రజాస్వామిక లక్షణాలను నిర్మూలించి, నిజమైన పరిశుద్ధ ప్రజాస్వామ్యాన్ని నిర్మించాలి.

కారాగృహాలు, పోలీసు, మిలిటరీలకంటె పాఠశాలలు, ఉద్బోధ ఎక్కువ అవసరం ఉపయోగం.

అవిద్య ప్రజాస్వామ్యాని కెంత శత్రువో, దుర్భర దారిద్ర్యం అంతకంటె ప్రమాదకరమైన శత్రువు. నిరుద్యోగం, ఆకలితీర్చని కూలి,... తలదాచుకో వీలులేని నివాసం, మృత్యువే వైద్యం—ఈ పరిస్థితుల ఫలితంగా ఆలోచనా ధోరణి నిస్పృహతో పెడదార్లు తొక్కుతుంది. తమ జీవనయాత్రను చక్కబఱచని శాంతి భద్రతలపై ప్రజలకు లక్ష్యం, విశ్వాసం ఉండటం అసాధ్యం. అయుక్తం. కాబట్టి ప్రజాస్వామ్యతత్త్వం లక్ష్యమనుకొనేవారు—అన్ని వర్గాలవారూ—ఈ నిజాన్ని గుర్తించి సంఘంలో దారిద్ర్యాన్ని నిర్మూలించాలి. ఏ లక్ష్యమూ త్యాగాలు వినా సిద్ధించదు. ధనిక, అధనిక వర్గాలీ సత్యాన్ని మఱువకూడదు.

దౌర్జన్య, నిరంకుశ తత్త్వవాది ప్రజాస్వామ్యాని కెంత విరోధో, తనకోసమే సంఘం అనుకొనే స్వార్థవాది అయిన ధనికుడూ అంత విరోధి. 'ఉన్నవారు' ప్రజాస్వామ్యాన్ని, శాంతియుత సమాజాన్ని లక్ష్యాలుగా పరిగణిస్తే, 'లేనివారి' పరిస్థితులకు మూలమైన (ఆర్థిక రంగంలో) అప్రజాస్వామిక లక్షణాలను విసర్జించి, ప్రజల దారిద్ర్యాన్ని నిర్మూలించటం వారి కర్తవ్యం. విధి. ధర్మం. ఇందులకు త్యాగం తప్పదు. ఇలాకాక, సంఘంలో మాకే ఆధిపత్యం ఉండాలి, మాది ప్రత్యేకవర్గం, అధికారం ఈ వర్గానికే ఉండాలి అని అంటే,—ప్రభుత్వం మావర్గ నియంతృత్వంగానే ఉండాలి అని అంటే, కమ్యూనిస్టులు అందుకు జవాబుగా 'కార్మిక నియంతృత్వా'న్ని స్థాపిస్తామంటారు. ఈ రెండు అప్రజాస్వామిక శక్తులను ఎదుర్కొని ప్రజల సాంఘిక, ఆర్థిక, రాజకీయ స్వాతంత్ర్యాన్ని సిద్ధింపచేయవలసిన యుగధర్మం ప్రజాస్వామిక సోషలిజంపై ఉంది.

కథానిక :

"పతిత"

శ్రీ గిడుతూరి సూర్యం

కస్తూరీ బా హాస్పిటల్. ఎందరెందరు ఎన్నెన్ని పాపాలు చేసినా తల్లిలాగా హృదయంలోకి తీసుకొని హరించుకోగలమనే తెల్లని గోడలు. జీవితాల్లో జరిగిన కల్లోలసంఘటనలను మరపించే ప్రశాంతం. తాముచేసిన పాప ఫలితాలకే ప్రత్యక్షంగా అనుభవిస్తున్నా మని గ్రహించి పశ్చాత్తాపబడే రోగులు..... మూల్గులు..... రోగులను చూచే గంట అది. లలిత బాధతో ప్రక్కమీద మూల్గుతోంది. కుమార్తెను చూడ్డానికి తండ్రి గోపయ్య లలితమంచందగ్గరకు వస్తున్నాడు. మాతాపితలను మరపించేటట్టు సేవ చేసే తల్లి, నర్సు తనదగ్గరకు వస్తున్న దేమోనని లలిత కలపోసి సంతోషంతో నెమ్మదిగా కళ్లు తెరచింది.....ఆశ్చర్యం...ఆమెగుండె జక్కుసారే ఝల్లుమంది. "నాన్నా ! నీవా! నావద్దకు రావొద్దు ! వెళ్లిపో ! యిక్కడనుంచి వెళ్లిపో." అని లలిత భయంతో వరుపుకు అంటుకపోయి పలికింది. ప్రక్కనున్న వాళ్లకు ఆశ్చర్యం కలిగింది ఆమె దిక్కులేని మనిషి కాదని. ఆమె కో తండ్రికూడా ఉన్నాడని వాళ్లకు అర్థమయింది. అయితే ! కుమార్తెను తండ్రి చూడ్డానికి కొస్తే ఆమె సంతోషించాల్సింది బదులు ఎందుకు భయపడుతోందో వాళ్ల కర్థంకాలేదు.

"తల్లీ ! లలితా ! నీ తండ్రి నిలా వదలి హాస్పిటల్‌లోకి వచ్చికూర్చున్నావ్. అందుకు నేనెంత బాధపడుతున్నానో నీకే మరుగువుతుంది తల్లీ! చూడు. నాకళ్లెలా లోతుకు పోయాయో! నీ వస్తువులన్నీ తాకట్టులోంచి త్వరలో విడిపించుతా ! ప్రస్తుతానికి నీ మెళ్లోబంగారుతాడు యివ్వు తల్లీ! నేను అమ్మనులే! నాచిట్టి లలితవు కదూ !"

"నాన్నా నన్ను బాధపెట్టకు. నాదగ్గర ఒక్క వస్తువుకూడా లేదని తెలిసీ అలా మాట్లాడుతావేం? నీకు పుణ్యం ఉంటుంది. నాబాధకు తోడు నీవుకూడా ఎందుకు వేధిస్తావ్. నాన్నా, వెళ్లిపో !"

"అమ్మాయ్ ! చూడు నా నాలిక తడిలేక ఎలా ఆర్చుకుపోతోందో ! మంచిదానవు కదూ !" లలిత బాధతో ఒకసారి మూల్గి "నిన్ను నమ్మే యింతవరకు వచ్చా. ఆ త్రాగుడు దయ్యం నిన్ను వదలకపోవడంచేతనే నీ నోరార్చుకపోవడం. నీసుఖంకోసం మరో ప్రాణిని బాధపెట్టడం ధర్మం కాదు నాన్నా ! నన్ను విడిచి వెళ్లిపో ! నాన్నా, వెళ్లిపో !" అని పలికి ముఖాన్ని పరుపు కానించింది. ముఖమానినంత మేర కన్నీరే ! గోపయ్యకు కోపం వచ్చింది కోపగించుకుంటే వస్తువు రాబట్టుకోవడం కష్టమని ఓపికబట్టాడు.

గోప—లలితా, అప్పులవాళ్లు నన్ను వేపుకు తింటున్నారు ! మూడునెలల అద్దె బాకీ ఉన్నాం. ఈవేళ అద్దె యివ్వకపోతే సామానంతా బయట పారేస్తా నన్నాడు. మన పరువు నిలబెట్టడానికయినా నీ వస్తువు యివ్వు తల్లీ ! తాకట్టుపెట్టి డబ్బుతెచ్చి బాకీలు తీర్చేస్తా !

లలిత—అబద్ధ మాడతావేం నాన్నా ! అద్దె సంపూర్ణంగానే నిచ్చేశాను. మెళ్లోమిగిలిన ఒక్క బంగారంవస్తువుకూడా లాక్కున్నావ్ ! నావద్ద యింకేమీ లేదు. ఎందుకు పీడిస్తావ్. వెళ్లు నాన్నా ! పాడుఖర్మం నాకు చావయినా వచ్చింది కాదు. అని పలికి కళ్లనీరు కారుస్తోంది. ఏమీ చేయలేని గోపయ్యకు కోపం వచ్చింది. లోలోపల పళ్లు కొరికాడు. ఉక్రోషం. "లలితా ! నామాట విని నీ వస్తువు యివ్వు" అన్నాడు. లలిత మాటాడలేదు. అతని కళ్లు ఆమె బెడ్ ప్రక్కనున్న టేబిలుమీది మందు గ్లాసుపై మళ్లాయి. వెంటనే అతని చేతులు అటువైపుకు నడిచాయ్. "నాన్నా ! మందుగ్లాసు ! ...నిన్ను యిక్కడ దొంగతనం చేయనివ్వను" అని లలిత గ్లాసును అందుకోబోయింది.

"ఏయ్" అని గోపయ్య భీకరంగా అరచి నిర్దాక్షిణ్యంగా లలితచేయి మీద కొట్టబోయాడు. భయంతో ఆమె కళ్లు మూసుకుంది. గోపయ్య చేతికి గట్టిగా మరొక చేయి తగిలింది. గ్లాసు క్రిందపడి ముక్క లయింది. పగిలిన గ్లాసు ముక్కల్ని కన్నీటిచుక్కలు లలితకంటి వెంబడినుండి జలజలా రాలాయి. ఆవేగుండె రాయయింది. కన్నీరు ఆగింది. ఆమె శాంతంగా పలికింది: "నాన్నా ! నీవు నాజీవితాన్నికూడా ముక్కలు చేశావు."

కొత్తగా వచ్చిన వ్యక్తిని చూచి గోపయ్య అన్నాడు. "నీవు యిక్కడకూడా దాపురించావ్. నీకల్లనే నా కుమార్తె చెడిపోయింది. నీ నీతులకల్లనే యీ మూండయిల తయారయింది. చివరికి తండ్రినికూడ దగ్గరకు రానివ్వడంలేదు. నీవే కారకుడవు. నిన్నేం చేస్తానో చూడు. నీ పరువు నడివీథిలో తీడస్తా చూడు" అని డంబాలు పలుకుతూ గోపయ్య బయటకు వెళ్లిపోతున్నాడు. "నాన్నా ! నానా ! వారినెందుకు రచ్చకీడుస్తావ్ ? వారు నిన్నేం చేశారు? నాన్నా ! నాన్నా !" అని లలిత తండ్రిని కేకవేసింది. కాని గోపయ్య వినుపించుకోకుండా వెళ్లిపోయాడు.

* * *

ఆనాడు లలిత యింటిచుట్టూ జనంమూగారు. తన పొరిగింటివాళ్ల కేదో ఆపద వచ్చిందని నరహరి లోపలికి వెళ్లాడు. లలిత ఏడుస్తూ గదిలో ఒక మూల కూర్చుంది. నరహరి ఆమెను ప్రథమ పర్యాయంగా చూచాడు. ఆమెకూడా అతనివైపు చూచింది. అతనికి ఆమె కళ్లల్లో దైన్యం అవుపించింది. అతనికి జాలి వేసింది. పోలీసు యిన్స్పెక్టరు గోపయ్యపెట్టెలోని బట్టలు, లలిత పెట్టెలోని బట్టలు ఉద్రేకంగా చూపిస్తూ చిందరవందరగా బయట పారేస్తున్నాడు. పెద్ద మనిషిలాగా అవుపించే దుస్తుల్లో గోపయ్య, మొగంలో నెత్తురుచుక్క లేకుండా చేతులు కట్టుకొని నిలబడ్డాడు. సోదాలో ఆచోకీ ఏమీ అగుపించలేదు. అయినప్పటికీ గోపయ్యను ఠాణాకు రమ్మనమని యిన్స్పెక్టరు గద్దించాడు. ఠాణాల్లో నిజం చెప్పకపోతే పోలీసులు చేసే అమానుషదృశ్యాలు గోపయ్య కళ్లకు కట్టాయ్. "అయ్యా, నిర్దోషిని. నేనేం దొంగతనం చేయలేదు. నన్నువిడిచిపెట్టండి" అని బ్రతిమాలుకున్నాడు. నరహరి వంక దీనంగా చూచాడు నరహరి, యిన్స్పెక్టరూ స్నేహితులు. "సోదాలో ఆచోకీ దొంకనప్పుడు అతన్ని ఠాణాకు తీసుకెళ్లడం అన్యాయంరా ! గోపయ్యను వదిలిపెట్టరా !" అని నరహరి మిత్రుణ్ణి కోరాడు. "హరీ! వాళ్ల సంగతి నీకు తెలియదురా ! వీడి కొకసారి బుద్ధి చెప్పాలి "— "పోనీ ! ఈదఫాకు వదిలేయ్" అని నరహరి మిత్రుణ్ణి గట్టిగా కోరాడు. ఇన్స్పెక్టరు గోపయ్య నుద్దేశించి అన్నాడు: "ఏయ్ ! జాగ్రత్త! మావాడిమొగం చూచి వదిలిపెడుతున్నా. నీవు చేసే దగాలతనాలు వగైరా నేకనిపెడుతూనే ఉన్నా" అని యిన్స్పెక్టరు పలికి వెళ్లిపోయాడు. లలితగోపయ్యలు తమ కృతజ్ఞత వెల్లడించారు. ఆ దృశ్యం లలిత కిప్పుడు జ్ఞాపకానికొచ్చింది. తన తండ్రి యీనాడు విశ్వాసం లేకుండా నరహరిని నిష్కారణంగా రచ్చకీడుస్తానని పలికి వెళ్లిపోవడం ఆమె మనస్సుకు చాలా బాధ కలిగించింది.

నర— లలితా ! ఎందుకు భయపడతావ్ ! నన్నెవ్వరూ రచ్చకీడ్వలేరు. ఈశ్వరునా భయం లేదు......నీవొంట్లో ఎలా ఉంది?"

లలిత—నావొంట్లో కొంచం నెమ్మదిగానే ఉంది. నామూలాన మీకు......"

నర—లలితా ! పిచ్చిదానవు. నీవేం బాధపడకు ...డాక్టర్ ఏమన్నది ?"

లలిత—ఆమె 'జబ్బు నయమవుతుంది. కాని...... అని లలిత మాట్లాడలేకపోయింది. పొంగివచ్చే దుఃఖాన్ని అపుకోలేకపోయింది.

నర—లలితా ఏడవకు! నీకు సహాయం చేయడానికి నే ఉన్నా. సంకోచించకు. చెప్పు.

లలిత—ఏం చెప్పను. నా దౌర్భాగ్యపు తండ్రివల్ల నాజీవితం మట్టిపాలయింది...... నే నిప్పటికయినా ఒకచెట్టునీడ నాశ్రయించితే మంచిదని డాక్టరమ్మ చెప్పింది. ఈమాటే మీరు అనేకపర్యాయాలు చెప్పారు. కాని నాతండ్రి ......నేను బ్రతికి బట్టకట్టేకంటే యీ హాస్పిటల్ లో మరణించడం మేలు. నేన బయటకొస్తే ఆ పెను భూతం నన్ను బ్రతకనిస్తుందా? అని పలికి రెండుచేతులు ముఖానికడ్డుపెట్టకొని ఏడ్చింది.నర్సు వచ్చింది. "టయిమయింది. మీరు వెళ్లండి" అని నర్సు హాస్పిటల్‌లోకి రోగులను చూడ్డానికి వచ్చినవాళ్లతో చెప్పుతోంది. నరహరి అన్నాడు:

నర—లలితా ! విచారించకు ! నేను తప్పకుండా నీకొక మార్గం చూపిస్తా ! జీవితంపై నిరాశచూపడం మానవజాతికి పిరికితనం. తొందరపడకు. నే వెళ్లొస్తా లలితా. లలిత నమస్కారం చేసింది.

* * *

"చూశావుటే కాంతమ్మొదినా ! నరహరిగారి నిజస్వరూపం బయటపడింది. ఇంకా వెర్రిలో పడ్డావు.ఎన్ని సార్లు నీతో చెప్పలేదు— అలను ఆ యింట్లోంచి బయటకు రావడం చూచి. ఇప్పుడు విను గోపయ్యమాటలు."

"అవునే కామమ్మొదినా ! ఆ ముతకబట్టలు ఆ కవిత్వం, ఆ ఉపన్యాసధోరణి, ఆ శ్రీరంగనీతులూ వింటుంటే నిజమే అనుకున్నాం. పరోపకారంకొరకు త్యాగం చేసే మని మనుకొన్నాం. పొరిగింటివారికి సహాయం చేయాలట ! ఇదే కాబోలు సాయం ?"

"ఏమే ! వెంకమ్మా ! మట్లాడవేం రాయి కొట్టినదానిలాగ ! ఆ ముండవచ్చి యింట్లో కూర్చుంటే దానితో సిగ్గూ బిడియం లేకుండా మాట్లాడుతుంది నరహరిగారి యిల్లాలు. ఆమెకయినా బుద్ధి ఉండొద్దూ బజారుదాన్ని యింట్లోకి రానివ్వడానికి. అయ్యో ! ఎక్కడయినా ఉందా యీ విపరీతం ?"

"ఆయనకు జ్ఞానం ఉండక్కర్లేదటే సుబ్బమ్మక్కా ! నిక్షేపంలాంటి భార్య, బిడ్డలు ఉండగా ఇదేం పోయేకాలం. వాడకట్టులో యిలాంటి వేరుపురుగులమీద పేడనీళ్లు జల్లాలే."

ఈ వైవిధంగా, గోపయ్య టాం, టాంతో వాడకట్టులోనివారంతా ఆ వాడలో గౌరవప్రతిష్ఠలు సంపాయించుకున్న నరహరినిగురించి అనుకోవడం ఆనాడే మద్రాసునుంచి వచ్చిన స్నేహితుడు ఈశ్వర్ విన్నాడు. అతని చెవులు వినలేకపోయాయి. మనస్సు నమ్మలేకపోయింది. తాను లక్షాధికారి. చెడు సహవాసం వల్ల, త్రాగుడు, జూదం, వ్యభిచారం బాగా అలవాటు తీర్చుకున్నాడు. ఉన్నదంతా నాశనమై భిక్షాధికారి గున్నాడు. అప్పటనుంచు అతనికి నరహరికి స్నేహం కలసింది. అతనితో స్నేహం సన్నిహితమయిన కొలదీ తన చెడు అలవాట్లు దూర మవుతూ వచ్చాయ్. తాను చివరకు పశ్చాత్తాపంతో సన్మార్గంలో బడేట్టు చేశాడు నరహరి. ఈశ్వర్, గుర్రలవాట్లకు స్థాన మను కొనే సినిమారంగంలో చాలా కాలంనుంచి పని చేస్తున్నాడు నటుడుగా. గుర్రలవాట్ల లోతు తెలిసి విసిగెత్తిపోవడంవల్ల దుర్గుణా లతనికి దూర మయ్యాయి. తనంతటి చెడ్డవాణ్ణే మంచివానినిగా మార్చగలిగిన నరహరి యీనాడు చెడిపోయాడంటే ఈశ్వర్ నమ్మలేకపోయాడు. లోకులు యిలాంటి వాదలు వేయడం పరిపాటే అని మళ్లా అనుకున్నాడు. కాని చింతామణి నాటకం ఈశ్వర్ యింకా మరచిపోలేదు. నరహరి బిల్వమంగళుడికంటె గొప్పవాడా ? ఏమో ! అని ఆలోచిస్తూ నరహరి యింటికి వచ్చాడు. ఈశ్వర్‌ను చూచీ చూడ్డంతోనే నరహరిచిన్నకొడుకు "అమ్మా ! అమ్మా ! మద్రాసునుంచి మామయ్య వచ్చాడే" అని అరచి ఈశ్వర్ చేతిలోని బొమ్మలు, బిస్కట్లు గెండు చేతుల్లో అందుకొని క్రింద జారిపోయిన బిళ్లలు ఆదుర్దాతో ఏరుకుంటున్నాడు. కొడుకు కేక విని సుగుణ బయటకొచ్చింది. "రా అన్నయ్యా ! కాళ్లు కడుక్కొని లోపలికి రా అన్నయ్యా ! కులాసాగా ఉంటున్నావా ?"

ఈశ్వర్ కాళ్లుకడుక్కొని లోపలికి వచ్చి కూర్చున్నాడు.

ఈశ్వ—ఇప్పుడే వస్తున్నానమ్మా. అంతా క్షేమంగా ఉన్నారా ? వాడికి ఎన్నిసార్లు ఉత్తరం వ్రాసినా జవా బుండదుకదా ! లాభంలే దనుకొని బయల్దేరా — మిమ్మందరినీ ఓ పర్యాయం చూచి వెళ్దామని"

తాను తెచ్చిన సినిమాఫొటోలు, పత్రికలు టేబిలుమీద పడేశాడు. సార్లు కారుస్తూ సుగుణకొడుకు బొమ్మలుచూడ్డానికి పుస్తకాలన పరివేష్టించాడు.

ఈశ్వర్ —బావెక్కడి కెళ్లాడమ్మా ? విన్నావామ్మా ? మనవాణ్ణిగురించి వాడకట్టులో ఏమనుకొంటున్నారో ?

సుగు—లోకులు కాకు లన్నయ్యా ! పాపం ఆమెకు జబ్బుగా ఉండి హాస్పిటల్‌లో ఉంది. ఆమెను చూడ్డానికి వెళ్లొచ్చారు. దాంతో..

ఈశ్వ—ఎవరమ్మ ఆమె ? అంటూండగానే నరహరి వచ్చాడు.

"అమ్మ నాన్నొచ్చాడే" అని సొంగ కారుతున్న మొగంతో కొడుకు గబగబా తండ్రిచంక నెక్కాడు.

* * *

ఇద్దరు స్నేహితులూ కృష్ణానదీ తీరానికెళ్లారు మానవజీవితంలోని ఒడుదుడుకుల్లాగ ఉన్నయ్ యిసుకపొరలు. కరువుతో వాడిపోయిన మనిషి మొగంలా గవుపిస్తోంది ఆ నీరులేని కృష్ణ !


నర—ఈశ్వర్, మంచి సమయంలో యిక్కడికి వచ్చావంటే నమ్ము.

ఈశ్వ—అవునవును. సంఘం నిన్నాడిపోసుకొనే మాటలు వినడాని కొచ్చా. ఎవరో యీ హాస్పిటల్‌లో ఉన్న స్నేహితురాలు.


నరహరి లలిత కథ చెప్పడం ప్రారంభించాడు. కొంతవరకు చెప్పాడు. ఆశ్చర్యంతో ఈశ్వర్ అడిగాడు—"అప్పుడు నీవేం చేశావ్ ?"

నర—రాత్రి 12 గంట లయింది అప్పుడు. వెళ్లి గోపయ్య యింటితలుపులు కొట్టా. కూతుర్ని కొడుతున్న వాడల్లా ఆగి నెమ్మదిగావచ్చి తలుపు తీశాడు. నన్ను చూడగానే స్తంభించిపోయాడు. నమస్కారం చేసి ఏమో చెప్పబోయాడు తలుపుదగ్గరే నిలబడి. నేను లోపలికి తిన్నగా లలితదగ్గర కెళ్లా. దెబ్బలు తిని నేలమీద పడి యేడుస్తోంది. తను రక్షించమన్నట్లు దీనంగా నా కళ్లల్లోకి చూచింది లలిత. ఆమె గాజులన్నీ ముక్కలయి గదిలో చిందరవందరగా పడిఉన్నాయ్. చేతులనుండి రక్తం కారుతోంది. ఇదంతా చూచి నాకు బాగ కోపంవచ్చింది. "గోపయ్యా! నీవేమో పెద్దమనిషి వనుకున్నా. ఇలాగేనా కుమార్తెను కొట్టుకొనేది. నీ సంగతి పూర్తిగా నాకర్థమయింది. సంసారుల వాడకట్టులో యీ నీచమయిన పని సహించరానిది. నీవు పెద్దవాడివి, కండపుష్టి కలవాడివి. కాయకష్టం చేసి నాలుగు డబ్బులు సంపాయించుకొని, నిన్ను నీవు పోషించుకోవచ్చు. నీ కుమార్తె నెవరికైనా యిచ్చి పెళ్లి చెయ్. అంతేకాని యిదేం సానికొంప ! ఇలా


(18 వ పేజీ చూడుడు)



దేశవిభజన ప్రథకాన్ని జూన్ 4 న, జులై 25 న సార్వభౌమత్వం అంతరించిన అనంతర సంస్థానాల స్థాయిని రాజప్రతినిధి లార్డ్ మౌంట్ బాటన్ వివరించారు.




అదినివేశ ప్రథమ ప్రధానమంత్రి పండిట్ జవహర్లాల్ నెహ్రూ అధికారప్రమాణాన్ని స్వీకరిం



భారతదేశం అగ్రరాజ్యాలన్నిటితో రాజ్యాంగసంబంధా లేర్పాటుచేసుకున్న ది. ఢిల్లీ లోని రష్యా రాయబారి నోవికోవ్ విదేశాంగమంత్రి పండిట్ నెహ్రూతో సంభాషిస్తున్నాడు.

స్వతంత్ర ప్రథమ సంవత్సరం


మరికొన్ని ముఖ్యఘట్టాలు




నవంబరు 29 న నైజాం, భారతప్రభుత్వంతో యథాతథపు ఒడంబడిక కుదుర్చుకున్నది.




1947, డిసెంబరులోనే బర్మాప్రధాని థాకిన్‌నూ భారతదేశం వచ్చా
ఈ సంవత్సరం బర్మాస్వాతంత్ర్యోత్సవాలు జరుపుకుంది.




జనవరి 1 వ తేదీన కాశ్మీరులో పాకిస్థాన్ సైనికచర్యలనుగురించి భారతప్రభుత్వం భద్రతామండలి
భారతప్రతినిధివర్గ నాయకుడు శ్రీ గోపాలస్వామి అయ్యంగార్, కాశ్మీర్ ప్రధాని షేక్ అబ్దుల్లా భద్రతామం
కాశ్మీర్ సమస్యను విశదంచేశారు.






అక్టోబరు 27 న న్యూఢిల్లీలో అంతర్జాతీయ కార్మికసంఘం ఆసియాప్రాంతీయసభ జరిగింది. పండిట్ నెహ్రూ ప్రారంభోత్సవం జరిపారు;



జూన్ 1 వ ఢిల్లీలో అని



...చారు.




మౌంట్ బాటన్ పథకాన్ని అనుసరించి దేశం భారత, పాకిస్థానులుగా విభాగమై స్వతంత్ర రాజ్యాలుగా ఏర్పడినందున సరిహద్దులను నిర్ణయించి, కస్టమ్స్ కేంద్రాలను స్థాపించడం జరిగింది.



ఇండియా పాకిస్థాన్ సరిహద్దు.


లో




మార్చి 14 న ప్రధానామాత్యుడు పండిట్ నెహ్రూ విశాఖపట్నం వచ్చి భారత దేశంలో తయారైన మొదటి నౌక జలఉష జలప్రవేశోత్సవం జరిపారు. ఆసందర్భమున ఆంధ్ర విశ్వకళాపరిషత్తువారు ప్రధానామాత్యునికి స్వాగతపత్రం సమర్పించారు.



బ్రిటన్ బాకీపడిన స్టెర్లింగ్ పరిష్కారం విషయమై హెన్రీ గ్రేడీ, వి. వర హరిరావుగార్లు ఉభయప్రభుత్వాల పక్షాన ఒడంబడిక కుదుర్చుకున్నారు.



...ఫిర్యాదుచేసింది.
...డలి సమావేశాల్లో



కాశ్మీర్ కమిషన్ భారతదేశం వచ్చి ఇండియా పాకిస్థాన్ వివాదాంశాల విచారణ ప్రారంభించారు. రాజఘాట్ వద్ద గాంధీకి శ్రద్ధాంజలు అర్పించారు.



గాంధీజీ హత్యకేసు విచారణ మే 27 న ప్రారంభమైంది. సవర్కార్ సహ 9 మంది కుట్రదారులని నేరారోపణ జరిగింది.



...యా దూరప్రాచ్య ఆర్థిక వ్యవహారాల సంఘసభలో పండిట్ నెహ్రూ.



డిసెంబరు 18 వ తేదీన వస్తువుల ఉత్పత్తిని అధికంచేయడం గురించి పారిశ్రామిక సభలో త్రైపక్ష ఒడంబడిక జరిగింది.



అల్లీబిల్లీ లోకంలో అమ్మాయి కథ

'ఆలీస్ ఇన్ ది వండర్లాండు'
రచన:
లూయీ కెరోల్

అనుకరణం :
"ఆప్లవాన్"

వెఱ్ఱివెంగళాయి నెత్తిన టోపీ ఉంది. "రాజుగారిముందు సభలో టోపీ ఉండకూడదు, తీసెయ్" అని రాజుగారు వెంగళాయితో అన్నాడు.

"చిత్తమండి, అది నాది కాదండి" అంటూ వెంగళాయి వెఱ్ఱినవ్వు నవ్వుతూ టోపీ తియ్యకుండా నిలబడ్డాడు.

రాజుగారు పంచాయితీదార్లవంక తిరిగి "ఎత్తుకొచ్చాడన్నమాట, వ్రాసుకోండి" అన్నాడు. వాళ్ళు రాసుకొంటున్నారు. రాణీగారు కళ్లజోడు తగిలించి వెంగళాయి వంక ఉరిమి చూసింది. వెంగళాయి గజగజా వణికిపోతున్నాడు.

"అల్లా వణక్కుండా సాక్ష్యం చెప్పు" అని రాజుగారు కోపంతో కేక వేశాడు.

వెంగళాయి కాస్త ధైర్యం తెచ్చుకోటానికి టీ తాగుదామనుకొంటూ, మర్చిపోయి సాసరు పళ్ళెం ముక్క కొరికి మింగేశాడు.

అప్పుడు పాపకు మళ్ళీ తనలో ఏదో విపరీతం జరుగుతూన్నట్టు అనిపించింది. తీరా చూసుకుంటే తను మళ్ళీ పెద్దదిగా ఎదగటం ప్రారంభిస్తూంది. ముందు అక్కడినించి లేచి బైటికి వెళ్లిపోదామా అనుకొంది. కానీ మళ్ళీ ఆలోచించి "జాగా చాలకపోతే అప్పుడు చూసుకొందాములే" అని అల్లాగే ఉండిపోయింది.

పాప పక్కనే ఉన్న తెల్లఎలుక, "ఏమిటీ! మరీ అల్లా నొక్కేస్తున్నావ్? ఊపిరికూడా ఆడటం లేదు" అంటూ పాపతో కోపంగా అంది.

"నే నేం చేసేది! నేను ఎదిగిపోతున్నాను" అంది పాప.

"ఇదేం నీ ఇల్లు కాదు, ఇష్టమొచ్చినట్టు ఎదగటానికీ, కుంగటానికీ" అంది ఎలుక కోపంతో.

పాపకూ కోపం వచ్చింది. "చాల్లే! అవకతవకగా వాగక — నువ్వుమాత్రం ఎదగకుండానే ఇంతదానివయావా?" అని గదమాయించింది.

"ఎదిగితే మటుకు - ఇల్లా ఏదో ముంచుకు పోయినట్టు హడావుడిగా ఏమీ ఎదగలే" అని ఎలుక మొహం ముడ్చుకొని, పాప పక్కనించి కదిలి, సభలో రెండోవైపు నుల్చుందామని పోయింది.

అంతసేపూ రాణీ వెంగళాయ్‌వంక అల్లా ఉరిమి చూస్తూనే ఉంది. వెంగళాయ్ మరీ వణికిపోతున్నాడు. రాజు కోపంతో "వణికావంటే తల తీయించేస్తాను జాగ్రత్త! ఊ! వణక్కుండా చెప్పు" అని వెంగళాయిని గదమాయించాడు.

"చిత్తం మహాప్రభూ! రక్షించాలండి — నేనండి, నేను చాలా బీదవాడినండి, కూలి నాలీ లేదండి, ధరలు పెరిగిపోయాయండి, టీఖరీదు పెరిగి పోయిందండి, తాగుతూంటే తళతళలాడ్తూ పెరిగిపోతూందండి".

"ఏమిటా వెఱ్ఱివాగుడు? నేను వెఱ్ఱివాడి ననుకొన్నావా అల్లా వాగుతున్నావు?" అన్నాడు రాజు కోపంగా. వెంగళాయ్ మళ్ళీ మొదలెట్టాడు. "చిత్తమండి- క్షమించాలండి- మా తొఱ్ఱికుందేలు అన్నాడండీ..."

"నేనేం అనలేదు" అంటూ తొఱ్ఱికుందేలు కేక వేసింది.

"అన్నావు" అని కేక వేశాడు వెంగళాయి.

"అనలేదు" అని అరిచింది కుందేలు.

"సరే, అనలేదంటోంది గా — ఆ విషయం వదిలేసి చెప్పు" అన్నాడు రాజుగారు. వెంగళాయి మళ్ళీ మొదలెట్టే లోపుగా పంచాయితీదారుల్లో ఒకరు "పోనీ, వెల్ల ఎలుక ఏమంది?" అని అడిగాడు.

"అది నాకు జ్ఞాపకం లేదండి" అన్నాడు వెంగళాయి.

"జ్ఞాపకం తెచ్చుకొని తీరాలి. లేకపోతే తల కొట్టేస్తా!" అన్నాడు రాజుగారు.

వెంగళాయి చేతిలో కప్పూ సాసరూ, చేతులు వణకటంతో చెయ్యిజారి నేల మీద పడ్డాయి. వెంగళాయి మోకాళ్ళ మీద పడి, "దయఉంచాలి మహారాజా! నేను చాలా బీదవాణ్ణి" అంటూ ఏడ్చాడు.

"బీదవాడవా, పేదవాడవా?" అని అడిగాడు రాజుగారు. ఆ ప్రశ్నకు ఒక పంది పిల్ల పకపకా నవ్వటం మొదలు పెట్టింది. రాజభటులు నల్గురు చేరి గభాలున పంది పిల్ల నోరు నొక్కేశారు. అంటే నల్గురూ, ఒక పెద్ద గుడ్డ తెర పట్టి, అందులో పంది పిల్లను పడేసి, గట్టిగా ఉండచుట్టేసి, అరుపు ఏమాత్రం వినబడకుండా నొక్కి అవతలకు లాక్కుపోయారు.

"'నోరు నొక్కేయటం' అని ఎన్నిమాట్లో విన్నాగాని ఇప్పటిదాకా చూడలేదే; ఇది భలేగా నేడుంది" అనుకొంది పాప.

ఈ లోపుగా వెంగళాయిసాక్ష్యం పూర్తి అయిపోయింది. అవతలకు నడిపించారు.

ఇక రెండో సాక్ష్యం జమీందారిణి వంటమనిషి. వంటమనిషి సభలోకి వచ్చేటప్పటికే అందరికీ, కోరుపెట్టినట్టు

బాల

లంచగొండికి శిక్ష

పిల్లల కథ — ఛ॥ చల్లా సత్యనారాయణశర్మ

పూర్వం ఒక రాజుగారు పండితులను బాగా గౌరవించేవారు. ఆయన వద్దకు పోయి, ఎంతోమంది పండితులు, ఎన్నో బహుమతులు పొందేవారు! కాని రాజుగారి ద్వారపాలకుడు లంచగొండి. రాజుగారి దర్శనార్థం వచ్చేవారందరిదగ్గరా లంచాలు తీసుకొనేవాడు! కొందరు యితనికి లంచాలు యిచ్చుకోలేక, రాజుగారి దర్శనానికి పోవడమే మానుకున్నారు! ఒకసారి ఒక బీద బ్రాహ్మణుడు, తన పాండిత్యాన్ని రాజుకు చూపి ఒక బహుమతి పొందుదామనే ఆశతో, రాజస్థానంలోకి పోబోయాడు. కాని, ద్వారపాలకుడు, తనకు లంచమిచ్చినగాని, పోనీయనన్నాడు. బ్రాహ్మణుడి చేతిలో కానైనా లేదు! అందుచే, ఆయన యిల్లా అన్నాడు: "నేను రాజుగారినుంచి పొందే బహుమతిలో కొంచెం భాగం నీకు యిస్తాలే!" అని!

ఇందుకు, ద్వారపాలకుడు ఒప్పుకున్నాడు.

రాజుగారు ఈయన పాండిత్యానికి మెచ్చి, పెద్ద పెద్ద బహుమతులిచ్చాడు!

ఆయన తిరిగి వెళ్ళిపోతూంటే, ద్వారపాలకుడు తనకీయవలసిన సొమ్మిమ్మన్నాడు. కాని, బ్రాహ్మణుడు, "ఈ వేళకి పూరుకో; రేపు నాకొచ్చిన బహుమతంతా నీకే" అన్నాడు.

మరునాడు బ్రాహ్మణుడు వచ్చాడు. తన పాండిత్యమంతా చూపాడు. కాని ఆఖర్ని యిల్లా అన్నాడు: "లంచగొండి సిపాయిలను పోషించే ఓ రాజా, నీకిదే నా నమస్కారము!"

ఈ మాటకి రాజుకి చాల కోపం వచ్చింది. కోశాధిపతికి ఒక ఉత్తరం వ్రాశాడు: "ఈ లేఖ తీసుక వచ్చిన వానికి, వంద కొరడా దెబ్బలు బహుమతి యిమ్ము."

ఆ లేఖకి సీలు వేయించి, బ్రాహ్మణుని చేతి కిచ్చి, కోశాధిపతికీయమన్నాడు. అందులో తనని కొట్టమని వ్రాసి వుంటాడనే సంగతి బ్రాహ్మణునికి తెలుసు. బ్రాహ్మణుడు ఆ లేఖ తీసుకెళ్ళి, ద్వారపాలకుడికిచ్చి "ఇది కోశాధిపతి కీయి; ఆయన యిచ్చే బహుమానాలన్నీ నీవే తీసుకో!" అని చెప్పాడు.

ద్వారపాలకుడు సంతోషంతో, ఆ లేఖ కోశాధిపతి కిచ్చాడు. రాజ మొహరుతోఉన్న ఆ లేఖని చూసి, కోశాధిపతి ద్వారపాలకుణ్ణి, 100 దెబ్బలు కొట్టించాడు!

ఆ దెబ్బలకి, వాని వళ్ళంతా హూనమయిపోయింది. తను లంచాలు తీసుకొనడంమూలానే తనకీ శిక్ష జరిగిందని తెలుసుకున్నాడు!

ఇక, ఆనాటినుంచి, తన అన్యాయపు ప్రవర్తన మానుకున్నాడు! చూసారా, బ్రాహ్మణుని తెలివి?

[హిందీనుంచి]

తుమ్ములూ దగ్గులూ అదే పనిగా రావటం మొదలు పెట్టాయి. వంట మనిషి చేతిలో గొడ్డుకారం డబ్బా మూత లేకుండా ఉంది.

"సాక్ష్యం చెప్పు" అన్నారు రాజుగారు.

"నే చెప్పను" అంది వంటమనిషి.

రాజు కంగారుగా తెల్ల కుందేలు వంక చూశాడు. "మహారాజుగారు ఈ సాక్షిని తప్పకుండా విచారించాలి" అన్నది. తెల్లకుందేలు.

"సరే, తప్పని సరి అయితే చేస్తాను" అంటూ రాజు విచారంగా మొహం పెట్టి వంటలక్క వంక చూసి "కజ్జికాయలు దేంతో చేస్తారు?" అని అడిగాడు.

"మిరపకాయలతో" అంది వంటలక్క.

"నేమ్యా పిండితో" అని ఓ నిద్ర మోతు కంఠం వెనకనుంచి వినిపించింది.

రాణీ కోపంతో, "వెల్లఎలుకను మెడ పట్టుకొని బైటికి గెంటెయ్యండి, నోరు నొక్కేయండ్రా! ముక్కు మీసాలు ఊడపీకేయండి!" అంటూ రాణీగారు అరిచింది.

సభఅంతటా ఒక్కసారి కంగారు

నందం

కథా గేయం:



అన్నముత్యం

'ప్రసాదరావు'

౧౭

అన్నముత్యము మాటలను విని
సన్ననవ్వొగినవ్వి, శాంత మె:
కన్నులం దొణుకాడ, వేణూ
విన్నవించె నిటుల్. 1

"ముత్యమా, ఒక మాట చెప్పెద
సత్య మని నమ్ము మది చాలును;
ప్రతిఫల మ్మాశించి కాదు సు,
యతివ నా నడతల్. 2

చిన్ననా డాటల్లనుండీ
నిన్నువలచిన మాట నిజమే!
నిన్ను వలచిన హృదితో వేరొక
కన్నె దలచగ లే 3

నదియునంతటి నిజమె! నమ్ముము—
అందమును, మదిమియును జెప్పితి
వందకత్తెవు నిత్యయౌవని, వెఱు,
డెందు, నా కివే! 4

ఏవ, బలిమిని, ఆణి కంకిత
మైన నీ హృది గొనగజాలెడి,
మూఢుడను, మందుడను గానో
ముత్యమా, నేనూ. 5

అట్టి మాటల జోలి లే, దది
వలవ, దడిగితి గాన జెప్పితి,
నెట్టి బాధయు గనను, యూరక
కలత జెందకుమా! 6

ఎన్నడైనను విధి కృపంగని,
అన్నయింటికే వచ్చి, నీవును
ఆణి, పిల్లలు, సుఖములం గని
ఉన్న చో చాలుఁ. 7

పెండిలే వలవదూ, నా కిటు
లుండు టే శాంతమ్ము, సౌఖ్యము,
మమత లెరుగని శుచితమంబగు
మైత్రియే వలయుఁ. 8

మాటల్లో, చేతల్లో, నే నే
మాత్ర మెరుగని వేధ పెట్టిన
క్షమను చూడు మక్కృతిమమిత్రుని
గాగ చూడు మన్నా." 9

అని శాంతగంభీర మతిధీరమైన
పలుకుల నెమ్మది పల్కెడి వేణు
గని, శాంతవశీకృతజ్ఞతనిండుహృదిని,
ముక్కెమాత నికిన మోవాకమిడియ. 10

(ఆంగ్లకవి టెన్నిసన్ రచించిన 'ఈనక్ ఆర్డెన్' కథ ఆధారముగా కల్పించుకొన్న కథాగేయంలో ఇది తొలిశకం.)

బయలుదేరింది. వెల్ల ఎలుకను ఎల్లాగో బయటికి తరిమాక మళ్ళీ కాస్త సద్దు మణిగింది.

రాజుగారు "అమ్మయ్యా బతికాం," అని, "సరే! తరువాత సాక్షిని పిలు" అని తెల్లకుందేలుతో అన్నాడు. అని రాణితో నెమ్మదిగా, "ప్రియా, ఈమాటు సాక్షిని నువ్వు విచారించాలి. నా కిప్పటికే తల తిరుగుతూంది" అన్నాడు.

తెల్లకుందేలు తర్వాత సాక్షి పేరు కోసమని కాగితాలు అన్నీ వెదుకుతూంది.

"ఇంతవరకు సాక్ష్యం ఏం వచ్చింది నా మొహం! అయినా, తర్వాత సాక్షి ఎవరో" అనుకొంటూ పాప తెల్లబోతూ నిలుచుంది.

తెల్లకుందేలు చివరికి కీచు గొంతుకతో గట్టిగా అరిచింది. "తరువాత సాక్షి పాప" తనపేరు సాక్షులలో వినేటప్పటికి పాపకు ఒక్కసారి ఆశ్చర్యం వేసింది.

"ప్రెజెంటు" అంటూ బడిలోలాగ ఒక కేక వేస్తూ పాప అదాటున కదిలింది.

ఆ అదావుడిలో పంచాయితీదారులున్న పెట్టె బోర్ల బుక్కలుగా పడిపోయి అంతా తల్లకిందులుగా పడిపోయారు. పాపకు వాళ్లను చూస్తే జాలీ, సభలో తాను ఇల్లా చేసినందుకు కంగారూ కలిగాయి. త్వరత్వరగా వాళ్ళందరినీ లేవనెత్తిపెట్టి సరిచేసి, మళ్ళీ ఎవళ్ల స్థానాలలో వాళ్లను పెట్టింది

"పంచాయితీదార్లందరూ తమతమ స్థానాలలోకి సరిగ్గా వచ్చేదాకా విచారణ జరగటానికి వీల్లేదు" అని రాజుగారు కేక వేశాడు.

పాప మళ్లీ పంచాయితీదార్ల వంక చూసింది. ఇందాక అదావుడిలో తొండ భీముడుని తల్లకిందులుగా నిలబెట్టింది. "ఆ, ఈ విచారణకి వాడు ఎల్లా ఉంటే మాత్రం ఏమయిం దేమిటి?" అనుకొంటూనే భీముడిని మళ్లీ సరిగ్గా నిలబెట్టింది.

పంచాయితీదారులు ఈ భూకంపం నుంచి కాస్త తేరుకొని, మళ్లీ తమ పలకలూ, బలపాలూ కూడ దీసుకొని వ్రాయటం మొదలుపెట్టారు. భీముడు మాత్రం పైకప్పువంకా, వాసాలవంకా చూస్తూ కూర్చున్నాడు.

"ఈ విషయం నీకేం తెలుసును?" అని రాజుగారు పాప నడిగాడు.

"ఏమీ తెలియదు" అంది పాప.

"ఏమీ తెలియదూ?"

"ఏమీ తెలియదు"

అయితే, అది వ్రాసుకోటం చాలా అవసరమే" అన్నాడు రాజు పంచాయితీదార్ల వంక తిరిగి.

తెల్లకుందేలు నసుగుతూ ముఖప్రీతిగా నవ్వుతూ, రాజుగారితో, "అనవసర మని మహారాజుగారి అభిప్రాయం" అంది.

రాజు ముఖం చిట్లించుకొని "అనవసరమనే నేను చెప్పిందీని" అని, "అవసరం - అనవసరం," "అనవసరం-అవసరం" - అని పదే పదే అంటూ, రెండు అరచేతుల్లోను రెండు మాటలు తూస్తున్నట్టు చేతులు పైకి కిందికి ఆడిస్తున్నాడు.

పంచాయితీదారులు కొందరు "అవసరం" అనీ, కొందరు "అనవసరం" అనీ వ్రాసుకొన్నారు.

పాప వాళ్ళ పలకలవంక చూసి, "నా మొహం, ఏదైనా ఒకటేగా" అంది.

అంతవరకు తన ధోరణిలో తానున్న రాజుగారు పాపను మొదటిసారి పరకాయించి చూశాడు. అప్పటికప్పుడే పాప చాలం పొడుగు ఎదిగింది.

రాజుగారు వెంటనే "42 వ రూలు ప్రకారం, ఓ మైలుకన్నా ఎత్తున్న వాళ్ళంతా సభలోంచి వెళ్ళిపోవాలి," అని కేకవేశాడు.

అంతా పాపవంక చూడటం మొదలు పెట్టారు.

"నేనేం మైలుపొడుగు లేను" అంది పాప.

"ఉన్నావు" అన్నాడు రాజుగారు.

"ఒకటేమిటి, రెండు మైళ్ళు పొడుగుంటే" అని రాణీ అరిచింది.

"ఏమయినా, నేను బైటికి వెళ్ళేది లేదు. అదికాకుండా, ఆ రూలు ఇప్పటికిప్పుడు నువ్వు కల్పించావు. అది నప్పదు" అంది పాప.

"న్యాయశాస్త్రంలో మొదటి రూలే అది" అన్నాడు రాజు.

"అయితే, ఒకటవ రూలు అవాలి గాని, నలభైరెండెల్లా అవుతుంది? అబద్ధం" అంది పాప.

"పంచాయితీదార్లూ, తీర్పు చెప్పండి" అన్నాడు రాజుగారు.

తెల్లకుందేలు అదావుడిగా, "ఆగండి, ఆగండి మహారాజా. ఇంకా బోలెడు సాక్ష్యం ఉంది. ఇదిగో ఈ కాగితం ఒకటి ఇప్పుడే దొరికింది" అంది.

"ఏముందా కాగితంలో?" అని అడిగింది రాణి.

"చిత్తమండి! నే నింకా చూడలేదు. ఇప్పుడే మడత విప్పుతున్నాను. ఎవళ్లో ఎవళ్ళకో వ్రాసిన ఉత్తరంలా గుందండి" అంది కుందేలు.

"అంతే అయిఉండాలి. ఎవళ్ళకీ రాయని ఉత్తరం అంటూ ఎక్కడా ఉండదుగా!" అన్నాడు రాజుగారు.

"ఎవరి పేర వ్రాసి ఉంది?" అని పంచాయితీదారు అడిగారు.

"పైన ఎవరిపేరూ ఏమీ వ్రాయలేదు—అదే కాకుండా ఉత్తరంకూడా పద్యాలలో వ్రాసి ఉంది."

"ముద్దాయిదస్తూరీలోనే ఉందా?" అని మరో పంచాయితీదారు అడిగాడు.

"అదే గమ్మత్తు! ముద్దాయి దస్తూరీలో ఉన్నట్టు లేదు." పంచాయితీదార్లు తెల్లబోయారు.

"అయితే, దొంగ ఇంకోళ్ల దస్తూరీ కాపీచేసి ఉండాలి" అన్నాడు రాజుగారు. పంచాయితీదార్లు కాస్త తెలివిని బడ్డారు.

(18 వ పేజీ చూడుడు)

నిజాంపట్ల భారతప్రభుత్వం వహించిన సమరసవైఖరి

1946-వ సం. మే 16-వ తేదీ అమాత్య త్రయ పథకంలో, సంస్థానాలపై భారతప్రభుత్వం చలాయిస్తున్న సార్వభౌమత్వం వారసప్రభుత్వాలకు సంక్రమించదని గుర్తించబడినా, సంస్థానాలు విశ్వాసంగా ముందుకు వచ్చి సహకరిస్తవని భావించబడింది. ప్రతిసంస్థానము రక్షణ, రాకపోకలు, విదేశవ్యవహారాలను మూడు విషయాలపై అధికారాన్ని దత్తతచేసి భారత అధినివేశంలో జేరిపోవటం ఈ పథకంలో ఒక ముఖ్యభాగము. అమాత్యత్రయ పథకం జూన్ 3-వ తేదీ పథక అంగీకారంతో రద్దయిపోయినా, భారత అధినివేశంలో సంస్థానాల స్థాయినిగురించి బ్రిటిష్ప్రభుత్వ నిశ్చిత అభిప్రాయాలు ఇవే ననటం నిస్సందేహం.

హైదరాబాద్ సంస్థానంవిషయంలో భారతప్రభుత్వం చాల సమరసభావంతో, సుహృద్భావంతో, సుదీర్ఘకాలం ఓపికపట్టి ఒడంబడికకు ప్రయత్నించెను. కాని, నిజాం తన సర్వస్వతంత్రతను పట్టుకు వ్రేలాడుతూ, భారతప్రభుత్వం చూపిస్తున్న ఔదార్యాన్ని దురుపయోగ మొనర్చినాడు. ఇకమీదట నిజాంతో సంప్రదింపులు జరపరాదని భారతప్రభుత్వం నిర్ణయించింది. ఈమధ్య భారతప్రభుత్వం ప్రకటించిన శ్వేతపత్రంలో భారతప్రభుత్వ వైఖరిని స్పష్టపరిచారు. నిజాం సమస్య క్లిష్టమై పోవటానికి కారణాలేమిటో వివరిస్తూ, శ్వేతపత్రం లోని ముఖ్యభాగాలను ఇక్కడ పొందుపరుస్తున్నాము.

ప్రజలభవిష్యత్తు న్యాయశాస్త్ర అనుమానాలపై ఆధారపడి వుండదు

భారతదేశరక్షణ, దేశవిస్తృత, శాంతిభద్రతలు, హైదరాబాద్-భారతప్రజలందరి ప్రయోజనములు ఈ విధమైన న్యాయశాస్త్ర అనుమానాలపై ఆధారపడి వుండుటకు వీలులేదు. ఏ ఒడంబడిక, ఏ ప్రకటనవలనగాక తమ ఆధిపత్యమువల్లనే తమకు లభించిన దని బ్రిటిషువారే అంగీకరిస్తున్న సార్వభౌమత్వం అనే సూత్రం మార్పుల ప్రకారం కోట్లకొలది ప్రజల జీవితాలను తృణీకరించి పారవేయటానికి వీలులేదు. 'సార్వభౌమత్వ'సూత్రం న్యాయశాస్త్ర అంతరార్థమైనా, అది ఒక్క నిజాంకే వర్తించవు; దాదాపు 600 సంస్థానాలకు సమానంగానే వర్తిస్తవి. కాని ఆ న్యాయశాస్త్ర అంతరార్థ ఫలితాలను అనుభవించటానికి ఒక్క నిజాం మాత్రమే కోరుకున్నాడు.

యథాతథపు ఒడంబడిక

నిజాం భారతదేశంలో చేరితే, భారతదేశ రాజ్యాంగ నిర్వహణములో హైదరాబాద్కు గౌరవనీయమైన స్థానం లభిస్తుందని విశ్వసించడం వలననే భారతదేశంలో చేరవలసిందని భారత ప్రభుత్వం నిజాంను ఆహ్వానించెను. అన్నివిధాల ఇండియాతో ఎక్కువ సంబంధా లున్న హైదరాబాద్ భారతదేశంలో చేరిపోయి, ఆ మూడు విషయాలపై అధికారాన్ని దత్తత చేయటం ద్వారానే హైదరాబాద్ సమస్య పరిష్కారం కాగలదని భారతప్రభుత్వం నిస్సంశయంగా భావిస్తున్నది. ఈ విషయమై ఇంకా ఆలోచించటానికి రెండు నెలలు వ్యవధి కావాలని నిజాం కోరగా, అందుకు అంగీకరించి, ఈ సంప్రదింపులు జరపవలసిందిగా లార్డ్ మౌంట్ బాటెన్ను భారతప్రభుత్వం కోరింది. హైదరాబాద్ భారతయూనియన్లో చేరకుండానే, 1947వ సం. నవంబరు 29-వ తేదీన భారత ప్రభుత్వం ఆ సంస్థానంతో యథాతథపు ఒడంబడిక చేసుకున్నది. ఇంకే ఇతరసంస్థానం విషయంలోను భారతప్రభుత్వం ఇటువంటి ఒడంబడికకు అంగీకరించి వుండలేదు. ఇది చాల అసామాన్యమైన ఏర్పాటు. నిజాంప్రభుత్వం అంతరంగిక పరిస్థితులను పరిష్కరించు కొనటానికి కొంత గడువు యివ్వాలనే వుద్దేశంతోనే భారతప్రభుత్వం ఇందుకు అంగీకరించింది. ఈ ఒడంబడిక హైదరాబాద్ను భారతదేశానికి సన్నిహితం చేస్తుందనీ, దీనివలన ఏర్పడే మైత్రీపూర్వక, సుహృద్భావ వాతావరణంవలన నిజాం సముచితంగా, అధినివేశంలో చేరిపోవటానికి నిర్ణయించగలడనీ, భారత ప్రభుత్వం ఆశించింది. సార్వభౌమ ప్రతినిధికి, నిజాంకు వుండే సంబంధాలను, సార్వభౌమత్వం మినహాగా, కొంతకాలం యథాతథంగా సాగిస్తే నిజాం త్రోవలోకి రాగలడని భావించబడింది. తరువాత జరిగిన సంఘటనలు ఈ ఆశలు నిరాశలనీ, పెంకితనముగా, నిరంకుశముగా ప్రవర్తించువారితో సమాధానవైఖరి నవలంబించుటవల్ల సమస్యలు పరిష్కారము కాకపోగా మరింత బిగిసిపోవునని రుజువు చేసినవి.

భారతప్రభుత్వ సమాధాన వైఖరి

ఈ ఒడంబడిక ఏ సుహృద్భావముతో చేసికొనబడినదో, అట్టి సుహృద్భావముతోనే దానిని ఆచరించుటకు భారతప్రభుత్వము పూనుకున్నది. ఈ ఒడంబడికలో ఒక భాగముగా, సికిందరాబాద్ కంటోన్మెంటులోని భారత సేనల నుపసంహరించుటకు భారతప్రభుత్వము అంగీకరించినది. ఈ ప్రకారముగానే భారత ప్రభుత్వము ఆ సేనలంతటిని ఉపసంహరించెను. ఇది చాల ముఖ్యమైన విషయము. ఎందువల్ల ననగా, సికిందరాబాద్లోని భారతసేనలు, సైనికముగా, హైదరాబాద్ సంస్థానములోనంతను అజమాయిషీలో నుంచగలుగును. ఆ సేనలను సికిందరాబాద్లోనే వుంచి, సంస్థాన వ్యవహారములపై ఆధిపత్యము వుంచుకొనుట అతి తేలికైన పని. కాని ఈ యథాతథపు ఒడంబడికను మన్నించి, దాని ప్రకారము ఆ సేనలన్నింటిని భారతప్రభుత్వము ఉపసంహరించెను. ఈ సుహృద్భావ ప్రకటనకు ప్రతిగా నిజాం ఏమి చేసెను?

ఈ ఒడంబడిక ప్రకారం తమకు కలుగగల గరిష్ఠప్రయోజనములను సంపాదించుకుంటూ, హైదరాబాద్ సర్వస్వతంత్రత ప్రకటించుకొనుటకు ఈ వ్యవధిని ఉపయోగించుకుంటూ, ఒడంబడిక జరిగిన ముహూర్తంనుంచే దానిని వారన్నివిధముల భగ్నపరచిరి. ఈ ఒడంబడిక సంప్రదింపులు జరుగుచుండగానే, పాకిస్తానుకు ఋణ మిచ్చి, దీనిని భగ్నపరచుటకు సంప్రదింపులు జరుగుచుండెను. విదేశ వ్యవహారాలు, రాకపోకలు మొదలైన, రక్షణకు సంబంధించిన ముఖ్యవిషయాలపై ఇంకా అనేక పర్యాయములు ఈ ఒడంబడిక భగ్నమొనర్చబడెను. రక్షణ విషయములో, 1939వ సం.లో సంస్థాన సేనల స్కీమును—యథాతథపు ఒడంబడిక సాగించిన ఒడంబడికలలో ఇది ఒకటి—అమలుజరపటానికి నిరాకరించారు. ఆ స్కీము ప్రకారం సార్వభౌముడు—యథాతథపు ఒడంబడిక ప్రకారం భారతప్రభుత్వం—సంస్థానాల సేనల సంఖ్యను, యూనిట్ల వివరాలను అజమాయిషీ చేయటానికి అధికారం వున్నది. అనుమతిపొందకుండా వీరు తమ సైన్యాలసంఖ్యను వృద్ధిపరచుకొనుటయు, మందుగుండుసామగ్రి, ఆయుధసామగ్రి తయారు చేయుటయు యుద్ధసామగ్రి కొని రహస్యంగా సంస్థానంలోనికి తీసుకుపోవుటయు, ఆయుధాలు దొంగచాటుగా రవాణా చేయుటకు భారతదేశ మంతటా పంచమాంగదళాన్ని ఏర్పాటుచేయటము మొదలైన విపరీత చర్యలు ప్రారంభించారు.

ఆయుధ సంఘర్షణకు అతి చురుకుగా ప్రయత్నములు జరుగుచున్నవి. కొన్ని నెలల నుంచి హైదరాబాద్ ఒక సైనికశిబిరమువలె వుంటున్నది. భూమార్గంగాను, వాయుమార్గంగాను ఆయుధాలు దొంగతనంగా రవాణా జరుగుచున్నవి భారతప్రభుత్వ నిబంధనల నుల్లంఘించి ఈమధ్య సిడ్నీకాటన్ చేసిన ప్రయాణమును ఇందుకు ఉదాహరణగా పేర్కొనవచ్చును. భారతదేశాన్ని అపఖ్యాతి పాలు చేయటానికి, భారతదేశంలోను, విదేశాలలోను విరివిగా ప్రచారం సాగిస్తున్నారు.

రజ్వీ, అతని సహచరులు

ఇత్తెహాద్ ముస్లిమీన్ సంస్థ, దాని అనుబంధ సంస్థ అర్థ-సైనికసంస్థ అయిన రజాకారసంస్థ, నిజాం, అతని ప్రభుత్వ ప్రోత్సాహంతో శీఘ్రవేగంతో అభివృద్ధి చెందుచుండుటం ఈమధ్య హైదరాబాద్ రాజకీయాలలో ముఖ్యవిషయముగా పరిణమించెను, భారతప్రభుత్వము సుహృద్భావ వైఖరిని కావు లేకుండా చేస్తున్నవి. ఇత్తెహాద్, రజాకార్లు భారతదేశ వ్యతిరేక ప్రచారం తీవ్రంగా సాగిస్తూ, భారతప్రభుత్వ వ్యతిరేక చర్యలు చేయించుచున్నారు. సంస్థానంలో అనేకప్రాంతాలలో వారి అమానుషకృత్యాలవలన శాంతి, భద్రతలు పూజ్యమైపోయినవి. హైదరాబాద్ సంశ్లిష్ట భారతరాష్ట్రములకు బొంబాయి, మదరాసు, సి పి లలో సరిహద్దుప్రాంతాలపై అనేక పర్యాయాలు దాడులు జరిగినవి. రజాకార్ల గూఢచారులు, ఏజెంట్లు, భారతదేశమంతటా వ్యాపించి, భారతదేశములో మత సంక్షోభము ప్రారంభం కాగల ప్రమాదం కలిగిస్తున్నారు. నిజాం, అతని ప్రభుత్వసహాయ, ప్రోద్బలములతో రజాకార్లు జరుపుతున్న అకృత్యములవలన భారతదేశములో ప్రశాంతత నశించిపోవునట్లున్నది తమ సుదీర్ఘ సంభాషణలలో భారత ప్రభుత్వ మనేకపర్యాయములు ఈ సంగతి నిజాంప్రతినిధులకు నచ్చజెప్పి, రజాకార్ల దళమును రద్దుపరచి, దేశములో పెచ్చు పెరుగుతున్న విద్వేషభావములను ఉపశమింప జేయవలసిందని నిజాం ప్రతినిధులను కోరెను గాని వారిందుకు సుతరామూ అంగీకరించలేదు.

మాటలు తేటలు; చేతలు...?

భారతదేశంతో మైత్రీ వ్యవహారిస్తూ శాశ్వతసంబంధాలు ఏర్పరచుకోవటమే తమ ఆశయమని నిజాం ప్రతినిధులు మాటిమాటికి ఉద్ఘాటిస్తూండగా, ఈ తేనె లొలుకు మాటల అడుగున, రజాకార్ల నాయకుని కతి. ఆసఫ్జాహీ జెండా మును ఎర్రకోటపై ఎగురవేసెదనను అతని ప్రగల్భములు వుంటనే వున్నవి. ఛతారీనవాబు ప్రధానమంత్రిగాను ఢిల్లీ రాకుండా ఒక్క ప్రదర్శనముతో అతని నిరోధించగలిగి నాడంటే, నిజాం వద్ద అతనికి ఎంత పలుకుబడి వున్నదో బోధపడుతున్నది. ఛతారి మంత్రిగా రాజీనామా చేయించి, తనకు కీలుబొమ్మగా వుండే ప్రభుత్వాన్ని అతడు ఏర్పాటు చేయించగలిగినాడు. రజ్వీ నాయకత్వాన, సంస్థానంలో ఫాసిస్టు శక్తులు, పద్ధతులు విజృంభించుచున్నవి. ఉదాహరణకు, కొంతకాలము క్రిందటివరకు, నిజాం ప్రభుత్వము కమ్యూనిస్టులను తీవ్రముగా నిరసించుచుండెడిది; వాస్తవానికి, సంస్థానాన్ని కమ్యూనిస్టులనుండి తప్పించటానికే రజాకార్లను ఏర్పాటుచేస్తున్నామని అప్పుడు చెప్పియుండేవారు. ఇప్పుడు ఇత్తెహాద్ ప్రభుత్వము, కమ్యూనిస్టులపై అయిదేండ్లనుండి వున్న ఆంక్షను తొలగించి, రజాకార్లు-కమ్యూనిస్టులు సంయుక్తముగా భారతదేశమునకు వ్యతిరేకముగా పనిచేయుటకు ప్రోత్సహించుచున్నది. భారతదేశమునకు వ్యతిరేకముగా, కమ్యూనల్, కమ్యూనిస్టు, ఫ్యాసిస్ట్ శక్తుల నన్నింటిని నిజాం ప్రభుత్వము ప్రయోగిస్తున్నది. ప్రజాస్వామ్యవిరుద్ధము, భారతదేశ-వ్యతిరేకమునైనదల్లా వారికి రుచించుచున్నది.

జనవాక్య నిర్ధారణకు భారతప్రభుత్వ ఆహ్వానము

ప్రాథమిక ప్రశ్నలపట్ల నిజాం, అతని తాబేదారుల వైఖరిని గమనించినచో, శాశ్వత ఒడంబడిక కుదుర్చుకొనవలెనని ప్రయత్నిస్తున్నామని వారు చెపుతున్నదంతా బూటకమని రుజువు కాగలదు. భారత ప్రభుత్వం తరఫున భారతగవర్నర్ జనరల్, ఈ మధ్య సంప్రదింపులలో, హైదరాబాద్ భారతదేశంలో చేరవలెనని చేసిన సూచనను, నిజాంప్రతినిధులు తిరస్కరించిరి. సంస్థానంలో బాధ్యతాయుత ప్రజాప్రభుత్వం స్థాపించవలెనను సూచనకూడా, తద్వారా అధికారం దఖలుపరచడం తప్పదని, వారు తిరస్కరించిరి. 1947 ఆగస్టు నెలలోనే, బ్రిటిష్ ఉద్యోగులచే ప్లెబిసైట్ జరిపించి జనవాక్య నిర్ధారణ చేయించవలసిందని భారత ప్రభుత్వం నిజాంకు సూచించెను. హైదరాబాద్ రాజ్యాంగ వ్యవహారములలో రిఫరెండంకు తావు లేదని ఇందుకు సమాధానం వచ్చెను. తిరిగి 1948 ఏప్రిల్లో కూడ, ప్లెబిసైట్ జరుపవలెననీ, దానిని నిష్పాక్షికముగా నిర్వహించగల ప్రభుత్వము ఏర్పాటు చేయవలెననీ భారత ప్రభుత్వము సూచించెను. ఇటువంటి విషయములలో ప్రజాభిమతమే అంతిమ నిర్ణయము చేయవలెనని భారతప్రభుత్వము పదేపదే నొక్కి వక్కాణించెను. ఈ సూచనను లాయక్ అలీ స్వయముగా తిరస్కరిస్తూ, ప్లెబిసైట్ జరుగుతుందని ప్రకటించగానే సంస్థానంలో శాంతి భగ్నమైపోగలదని చెప్పెను. సంస్థానంలో ప్లెబిసైట్ అనవసరమని ఈ మధ్య నిజాం ప్రతినిధులు చెపుతున్న కుప్రయోజనాలన్నిటిని ఈ దృక్పథంతో పరిశీలించవలెను; సంస్థానంలో ప్రజావ్యతిరేక ప్రభుత్వం వుండి రజాకార్ దౌర్జన్యవాదులు అధిక సంఖ్యాకులను నిర్బంధించగలిగి వున్నంతకాలము, నిష్పాక్షిక ప్లెబిసైట్ జరుగుట అసంభవమనే విషయమును వారు వ్యక్తపరుస్తున్నారు.

సుదీర్ఘ సంభాషణలు

'అధికారదత్తుల పత్రము' గాక, 'అధికార సమన్వయ పత్రము' వ్రాసికొనవలెనని, సంభాషణల ఆఖరుదశలో మీర్ లాయక్ అలీ సూచించినాడు. ప్రస్తుతమునకు, అధికార దత్తుల విషయము ప్రస్తావించకుండా, భారతప్రభుత్వ శాసనములు, రక్షణ రాకపోకలు, విదేశ వ్యవహారములకు సంబంధించినవి, హైదరాబాదుకు కూడా వర్తింపచేసినచో చాలునని భారత ప్రభుత్వము అంగీకరించినది. హైదరాబాద్ శాసనసభ ప్రమేయం లేకుండానే భారత శాసనాలు హైదరాబాదుకు వర్తించవచ్చునని లాయక్ అలీ ముందు అంగీకరించెను; తరువాత ఈ అంగీకారము ఉపసంహరించుకొనెను. నిజాం కోర్కెను మన్నించుటకు గాను, రాజ్యాంగపరమునకు సంబంధించిన ముఖ్యవిషయములలో నవి, భారతప్రభుత్వము అనేక సవరణలకు అంగీకరించెను. శాంతిని కాపాడుటకు, సహృదయపూర్వకముగ ఒడంబడిక చేసికొనుటకు భారతప్రభుత్వము ఇంకెన్నో ముఖ్యసవరణలకు అంగీకరించెను. ఈ ముసాయిదా అంతిమ ముసాయిదా అనీ, దీనిని నిజాం తప్పక అంగీకరించునని భారతప్రభుత్వము ఆశించెను. కాని వర్తకవ్యాపారాది విషయములలో సంపూర్ణ స్వాతంత్ర్యము సూత్రప్రాయముగా అంగీకరించవలెనని కోరుచు నిజాం దానిని తిరస్కరించెను. లాయక్ అలీకి తెలియకుండా ముసాయిదాలో కొన్ని మార్పులు చేసితిమని కొన్ని ఆరోపణలు కూడ జరిగినవి గాని తర్వాత వానిని ఉపసంహరించుకొనిరి.

ఈ సంభాషణల క్రమము, పద్ధతుల పరిశీలించినచో ప్రస్తుత లాభముల సంపాదనకన్న వేరే ఏ సూత్రము ప్రకారము ఇది జరుగలేదని రుజువగును. సంస్థానప్రధాని, మంత్రులు, సహచరులు అనేక పర్యాయములు ఢిల్లీ-హైదరాబాద్‌ల తిరిగారు. ప్రతి పర్యాయము వారొక ముసాయిదాను అంగీకరించి, అక్కడికి వెళ్ళి దానిని తిరస్కరించుచుండేవారు.

హైదరాబాద్‌పట్ల భారతప్రభుత్వం వహిస్తున్న వైఖరి, భారతప్రజలకు అసంతృప్తి కలిగించినా, ఏదో సంఘర్షణ రాకుండ ఒడంబడిక చేసుకొనవలెనన్న ఉద్దేశ్యముతో భారత ప్రభుత్వం చాల సమాధానవైఖరి నవలంబించెను. సంస్థానప్రభుత్వ వైఖరిలో మార్పు వచ్చేవరకు సంప్రదింపుల జరిపి లాభంలేదని భారతప్రభుత్వం ఇప్పుడు భావిస్తున్నది. నిజాం చేసే ప్రతిపని, హైదరాబాద్ సర్వస్వాతంత్ర్యం చాటుటకే, ఉద్ఘాటించుటకే జరుగుచున్నది. ఇందువలననే నిజాం-భారతప్రభుత్వాల సంబంధాల చరిత్ర — హైదరాబాద్‌కు విదేశవ్యవహారాల నిర్వహణలో జోక్యం లేకుండా వుండాలన్న ఒడంబడిక — అసంభవమై పోతున్నది.

ఆజాద్ హైదరాబాద్ అసంభవం

ఆజాద్ హైదరాబాద్ భారతదేశ రక్షణకు, ప్రశాంతతకు, ఆర్థికవ్యవస్థకు ప్రమాదకరము కాబట్టి, అందుకు భారతప్రభుత్వ మెన్నటికీ అంగీకరించజాలదు. అన్నివైపుల ఒకే స్వతంత్ర రాజ్యంచే ఆవృతమైవున్న స్వతంత్రదేశము ఇంత వరకు ఏర్పడివుండలేదు. ఆస్ట్రియా, స్విట్జర్లాండులు అన్నివైపుల ఆవృతమైవున్నా స్వతంత్రంగా వుండలేదా అని వాటిని హైదరాబాదుతో పోల్చటం, చరిత్రను, భూగోళాన్ని నిర్లక్ష్యం చేయటమే అవుతుంది. స్విట్జర్లాండు, ఆస్ట్రియాలకు అన్నివైపుల వేర్వేరు స్వతంత్ర రాజ్యాలుండటంవలన వాటి ఆర్థిక, రాజకీయ వ్యవస్థ భిన్నమార్గాలలో అభివృద్ధి చెందినది. భారతీయ ప్రాంతాలన్నీ స్వతంత్ర రాజ్యాలై వుండి, వాటిలో ఒకరాజ్యం హైదరాబాద్ స్వతంత్రతను ప్రకటించుకుంటే, అప్పుడు స్విట్జర్లాండు సామ్యం వర్తిస్తుంది. ప్రస్తుత భౌగోళికపరిస్థితుల ననుసరించి, హైదరాబాద్ ఏ విదేశంతోనైనా రక్షణను గురించిగాని, ఆర్థికవ్యవహారాలను గురించిగాని భారతదేశానికి వ్యతిరేకంగా ఏ ఒడంబడికనైనా చేసుకుంటే, భారతదేశ స్వాతంత్ర్యానికి భంగం కలుగకుండా దానిని అమలు జరుగనీయటం వీలుపడదు. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలో కొలరాడో రాష్ట్రంగాని, బ్రిటన్‌లో వారి విక్‌షైర్, వర్సెస్టర్ జిల్లాలుగాని, స్వతంత్రత ప్రకటించుకొందలిస్తే, ఏ విధంగా వుంటుందో,

ఇండియా నిజాం సంప్రదింపులు

(8 వ పేజీ తరువాయి)

ముందని. అదియొక పెద్దలాభమని చెప్పాడు. ఈ ఒడంబడిక 47 నవంబరు 29వ తేదీన జరిగింది. ఇండియన్ పార్లమెంటులో దీని విషయం తెలుపుతూ, సద్భావంతో యీ ఒడంబడిక అమలులో పెట్టబడితే, అది శాశ్వతమైన సంబంధానికి దారి తీస్తుంది; వచ్చేలోగా సంస్థానంలో ప్రజాప్రభుత్వస్థాపనలో కొంత కాల్పనలవీలదని నిజాము ప్రభుత్వానికి సలహా యిచ్చాడు

ఈ ఒడంబడికవల్ల ఎవరూ ఆశించిన మంచి ఫలితాలు కలుగలేదు. ఒకవంక ఒడంబడికకొరకు రాయబారాలు నడుపుతూనే, మొయిన్ నవాజ్ జంగు పాకిస్థానుకు 20 కోట్ల రూపాయల ఇండియన్ సెక్యూరిటీలు యిచ్చివేశాడు. వాటికి బదులు పాకిస్థాన్ సెక్యూరిటీలు తీసుకున్నాడు. ఈ విషయం ఒడంబడిక జరిగిన రెండు నెలలకు పాకిస్థాను పత్రికల ద్వారా బయటపడింది. ఈ యిచ్చిపుచ్చుకోటాలు ఆర్థిక శాఖా కార్యదర్శికి తెలియకుండా—ఆర్థిక శాఖామంత్రి కానిచ్చాడు. ప్రతిదీ నవాబు రహస్యమా తర్వాత, నవంబరు నెల ఆఖరున ఒడంబడిక సంతకం కాకపూర్వం యీ ఆస్తుల బదిలీ జరిగిందని నవాబు మొయిన్ నవాజ్ జంగే స్వయంగా ప్రకటించాడు.

ఢిల్లీలో ఉన్నది ఇతరుల కన్న బ్రిటీషు ప్రభుత్వం కాక ప్రజాప్రభుత్వం అనటంవల్ల హైదరాబాదులో తన ఆధిపత్యం ఎప్పటికీ నిలబెట్టుకొనటానికి ఇత్తెహాదుల్ముస్లిమీనవారు నిజాంప్రభుత్వం సహాయంతో ఎత్తుల ప్రారంభించారు. ఇత్తెహాదు వీరంట్లు ఇండియన్ యూనియన్‌లో ఉన్న ముసల్మానుల ప్రచారం సాగించి, వారికి పెద్దపెద్ద ఆశలు కల్పించి, చాలమంది— అనగా కొన్ని లక్షలమంది భారత జిల్లాలలో నవ హైదరాబాదు సరిహద్దు జేరారు. ఇల్లా వచ్చినవారందరిని నిజాం సైన్యంవారు టిక్కట్లు లేకుండా ప్రత్యేక రైళ్ళ ద్వారా తీసుకువచ్చారు. ఇట్లు వచ్చినవారిలో ఇండియన్ యూనియన్‌లో చేసిన ద్రోహానికి శిక్షను తప్పించుకొని వచ్చినవారూ ఉన్నారు. ఇత్తెహాదు వీరంట్లు పెట్టిన ఆశలకు మోసపోయి, ఉన్న కొద్ది ఆస్తి కాస్తా, గోడని అమ్ముకొని హైదరాబాదులో బాగుపడదామని వచ్చినవారూ, ఉన్నారు. పెద్దపెద్ద వ్యాపారం సాగించి ఎక్కువ ధనం సంపాదించటానికి వచ్చిన ధనవంతులూ ఉన్నారు. కొద్దో గొప్పో చదువుకొని పెద్ద ఉద్యోగాలు సంపాదించాలని వచ్చినవారూ ఉన్నారు. ఇట్లు వచ్చినవాళ్ళని రజాకారు సేవదళంవారు స్వాగతమిచ్చి వారికొరకు ప్రత్యేకంగా నిర్మించబడిన కాలనీలకు చేరవేశారు. కొందరికి వసతులు కల్పించటానికి ప్రభుత్వం ఒక ప్రత్యేక ఉద్యోగిని నియమించింది. తలాఇంత డబ్బును యిచ్చింది. కాలనీలు నిండిపోయిన తర్వాత యీ వచ్చిన వాళ్ళు, నగరంలోని హిందువులందరి కొంపలు ఆక్రమించటం మొదలుపెట్టారు. ఈతులాది ముసల్మానులు నగరమంతా నిండిపోతే, నగరవాసులైన హిందువులు భయభ్రాంతులైనారు. ఇత్తెహాదుల్ముస్లిమీనవారు యీ వచ్చినవాళ్ళకు తగిన సౌకర్యాలు కల్పించలేకపోయారు. పోను పోను, ధనం కూడ కొరతపడడం జరిగింది. పైగా పెద్ద ఆశలు పెట్టుకొని వచ్చిన వాళ్ళు చిల్లర ఉద్యోగాలకు పనులకు అంగీకరించక పోయేవారు. సైన్యంలోను, పోలీసులోను చేరమంటే అంగీకరించేవారు కారు. నవాబుల పెద్దపెద్ద దేవిడీలు ఖాళీగా పడివున్నా యటువంటి వొచ్చిన యీ ముసల్మానులు ఆడవాళ్ళు, పిల్లలు చలిలో, వానలో రోడ్లప్రక్కల చిన్న చిన్న గుడారాలలోను పూరి గుడిసెలలోను ఉండవలసి వచ్చేది. రాను

రాను [illegible] వారి ఆటలకి దొరికే దగ్గరపడియుండె. మొత్తం కనుక పోయి కష్టాలు ఎక్కువయింది. దగ్గరనున్న వాళ్ళు అడిగి పంపవలసివచ్చింది. దీనివల్ల వారిలో అసంతృప్తి వ్యాపించింది. కాని వాళ్ళ నిస్పృహయుల ఈ సందర్భంలో ఒక దెబ్బకు రెండు పిట్టల చంపే ఎత్తు వేశాడని ఇత్తెహాదువారు ఆలోచించారు. రాత్రి వరకు వరదరుకుంటకు యీ శరణార్థులను దగ్గరకు మోటారు లారీల మీద తీసుకొని పోయి, వారిని సందులలో దించి హిందువుల ఇండ్లమీదికి ఉసిగొల్పి హిందువుల యిండ్లను లూటీ చేయించటం మొదలుపెట్టారు. దీనివల్ల ధనం దొరికేది; హిందువులు భయభ్రాంతులై యిండ్లు వదిలి సంస్థానం వదలి పోతారు వారి సంస్థానంలో హిందువుల సంఖ్య తగ్గుతుంది; ముసల్మానుల సంఖ్య హెచ్చుతుంది. ఈ కార్యక్రమన్ని చాల జోరుగా సాగించారు. దోచుకొన్న సొమ్ము తెచ్చి యిండ్లను తగులపెట్టి వారి ఉద్దేశం సఫలం చూచారు. నగరంలోనే కాదు ఈ పద్ధతి వచ్చిన ముసల్మానుల జిల్లాలకు కూడా పంపారు. ఈ విధంగా, యీ అత్యాచారాలకు తోడు ఇండియన్ ప్రజానాయకుల నెన్నో ప్రకటనలు వేశారు. కాని ఫలితం శూన్యం. ఈ కార్యక్రమం - పోలీసు మిలిటరీల సహాయంతోనే పకడ్బందీగా నడపబడింది.

సాధ్యమైతే, హైదరాబాదు రాజ్యంలో ఉన్న హిందువులను అసౌకర్యం కలిగించి వారిని సంస్థానం వదలి పోయేట్లు చేసి, యూనియన్ ముసల్మానులతో హైదరాబాదును ఇత్తెహాదుల్ముస్లిమీనవారు నింపివేసేవారు. కాని అది సాధ్యం కాలేదు. అందుకు కారణం యిట్టి కలహ జరగకుండ హైదరాబాదు సరిహద్దులలో ఉన్న రాష్ట్రప్రభుత్వాలవారు తగిన చర్యలు తీసుకొనటమే. [illegible] హైదరాబాదు ముసల్మానుల దుష్కృత్యాల వరకు, ఇత్తెహాదుల్ముస్లిమీను పత్రికలు ఇండియన్ యూనియన్‌లో ముసల్మానులలో అసంతృప్తి ద్వారా హిందూ ముసల్మానుల కొట్లాటలు కొనసాగించటానికి కూడ ప్రయత్నించారు. కాని యూనియన్ ప్రభుత్వం యొక్క అప్రమత్తతవల్ల, రాష్ట్రప్రభుత్వాల సామర్థ్యంవల్ల ఆ ప్రయత్నం మొదట్లోనే అడుగంటింది. కాని ఇత్తెహాదుల్ముస్లిమీనవారి ప్రయత్నాలు [illegible] వారి [illegible] రగిలింది.

హైదరాబాదు సంస్థానం ఇండియన్ యూనియన్‌లో చేరటానికి, బాధ్యతాయుత ప్రభుత్వం సాధించటానికి హైదరాబాదు స్టేటుకాంగ్రెసు 1947 ఆగస్టు 8వ నుండి సత్యాగ్రహోద్యమం ప్రారంభించింది. సంస్థాన కాంగ్రెసు అధ్యక్షులు స్వామి రామానందతీర్థ, తదితర కాంగ్రెసు నాయకులు నిర్బంధింపబడినారు. సంస్థాన సరిహద్దులలో ఉన్న కస్టమ్సు నాకాల (సంస్థానంనుండి బయటకు పోవు సరుకుల మీద, లోపలికి వచ్చే సరుకుల మీద సుంకాలు వసూలుచేయు కచేరీలు) నేలకూలదిచ్చే సత్యాగ్రహం ఆ చుట్టుపక్కల ప్రజలు రికార్డులతో సహా తగలబెట్టి, హైదరాబాదు ఇండియన్ యూనియన్ మధ్యగల కృత్రిమ పరిహద్దుల నాశనము చేయ మొదలుపెట్టారు. ఇట్టి దశలను అరికట్టటానికి సంస్థాన పోలీసులకు, సైన్యానికి సహాయపడటానికి ఇత్తెహాదుల్ముస్లిమీనవారు రజాకారుల (స్వయంసేవకుల) దళం మొదలుపెట్టారు. యుద్ధశిక్షణ యువకులకు ఇచ్చుటకు హైదరాబాదు నగరంలో శిక్షణకేంద్రాలు ఏర్పాటుచేసినవి. నిజాం మిలిటరీ ఉద్యోగులే యిక్కడ శిక్షణ యిచ్చేవారు. నగరంలోని ముస్లిం విద్యార్థులు యీ శిక్షణపొందటానికి కాలేజీలు, స్కూళ్ళు బహిష్కరించారు. అట్లు బహిష్కరించినవారికి నష్టం కలుగకుండా విద్యాశాఖవారు, స్కూళ్ళకు, కాలేజీలకు సెలవు లిచ్చారు. రజాకార్లే కాకుండా ధాన్యసేకరణలో ప్రభుత్వోద్యోగులకు సహాయపడటానికని కొన్నివేలమంది అరబ్బులు, పఠానులు కూడా జిల్లాలకు పంపబడ్డారు. వీరంతా కమ్యూనిస్టుల, కాంగ్రెసు గూండాల దాడులనుండి సంస్థానాన్ని రక్షించటం అన్నపేరుతో పల్లెటూళ్ళ మీదపడి అమాయక ప్రజల దోచుకొన్నారు.

వారి యిళ్ళు కాల్చేశారు. స్త్రీల చెరిచారు. ఈ దోపిడిగాండ్లకు హాని కలుగకుండా ప్రజల దగ్గర ఆయుధాలు ఏమీ లేకుండా చూచే జాగ్రత్త వహించుకొని, వీళ్ళకు అంగరక్షకులుగా నిలబడి నిజాం ఉద్యోగులు, పోలీసులు, సైనికులు సహాయపడేవారు. ఇంతటితో ఆగకుండా వీరు సాహసించి సంస్థాన పరిహద్దులలో ఉన్న యూనియన్ గ్రామాల మీదా దాడుల సాగించారు. అనేక గ్రామాల దోచుకొన్నారు. అనేకమందిని చంపారు. ఈ రజాకార్లకు భయపడి సంస్థానంలో నానాటికీ వ్యాపిస్తున్న అరాచక పరిస్థితుల చూచి, ఇంతవరకు అమాయక ప్రజల దోచుకొనుటలో ప్రభుత్వాధికారులతో చేతులు కలిపి వారికి లంచాలిచ్చి మంచి పేరు కొన్నప్పటికీ మారిన పరిస్థితులలో వారే గూండాలను సహాయంచేసి తమ్ము లూటీ చేయిస్తారన్న భయంతో జాగీర్దారులూ, దేశముఖులూ, పెద్దపెద్ద భూస్వాములూ సంస్థానం వదలి యూనియన్ ప్రాంతాలకు చేరుకున్నారు.

హైదరాబాదు ఇండియన్ యూనియన్‌తో తాత్కాలిక ఒడంబడిక చేసుకొన్నప్పటికీ సంస్థానంలో స్థితిగతులు ఏవిధంగా ఉన్నాయి. ఛత్తారినవాబు ఒడంబడికతో ఢిల్లీ వెళ్ళకుండా ఆపిన ఇత్తెహాదుల్ముస్లిమీను అధ్యక్షుడు— మొయిన్ నవాజ్‌జంగు ఆ ఒడంబడికనే అంగీకరించటానికి ఒప్పుకొన్నాడు. కాశీం రజ్వీ యీ చర్యను వస్తు పత్రికాధిపతి తీవ్రంగా అధిక్షేపించాడు. రక్షణ, రాకపోకలు, విదేశవ్యవహారాలు యిచ్చివేసిన తర్వాత హైదరాబాదు సర్వస్వాతంత్ర్యం అనటంలో అర్థంలేదని అతని వాదన. కాని, రజ్వీ పలుకుబడిముందు వస్తుపత్రికాధిపతి నిలవలేకపోయాడు. రజ్వీ అనుచరులు అతని పత్రికాకార్యాలయంమీద రాళ్లు వేశారు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న పత్రికల లాగుకొని తగులపెట్టినారు. నిర్మొగమాటంగా ఉన్నదున్నట్లు చెప్పే వస్తు సంపాదకుడు అబ్దుల్ రహమానుకు కాశీం రజ్వీ యీ తాత్కాలిక ఒడంబడికను అంగీకరించటంలో ఆంతర్యం ఎట్లా గ్రహించగలడు? ఈ సంవత్సరకాలంలో తమకనుకూలమైనట్టి పరిస్థితులు కలుగకపోతాయా? పాకిస్థాన్ బలపడి ఇండియన్ యూనియన్ మీద దూకపోతుందా? యుద్ధప్రయత్నాల రహస్యంగా చేసి, హైదరాబాదు ముసల్మానుల బలవంతులగా చేయటానికి, సంస్థాన హిందువులలో నిరుత్సాహం కలిగించి వాళ్ళు బానిసలుగా పడివుండేట్లో లేక బయటకు పోవునట్లో చేయటానికి ఒక సంవత్సరం గడువు ఉపయోగపడుతుంది? ఇట్టి ఆలోచనతోనే కాశీం రజ్వీ తాత్కాలిక ఒడంబడికను అంగీకరించి ఉండవచ్చును.

ఒడంబడిక జరిగినప్పుడు హైదరాబాదు రాయబారవర్గనాయకునికి సంస్థానంలో ప్రజాప్రాతినిధ్యం గల మంత్రిమండలిని ఏర్పాటు చేయటం ముఖ్యమని సంస్థానశాఖామంత్రి, గవర్నర్ జనరలు గట్టిగా చెప్పి ఉండవచ్చును. అందువల్లనే కాబోలు—ఒడంబడిక జరిగిన కొద్ది రోజులలోనే నిజాం హైదరాబాదు కన్‌స్ట్రక్షన్ కంపెనీ మేనేజింగు డైరెక్టరు, పాకిస్తాను ఇండస్ట్రియల్ డెలిగేషన్‌లో సభ్యుడుగా యునైటెడు కింగ్‌డమ్ అమెరికాలు వెళ్ళివచ్చినట్టి ఇత్తెహాదుల్ముస్లిమీనుకు కోశాధిపతిగా ఉన్న మీర్ లాయక్ అలీ అనే వ్యాపారస్థుడిని కంట్రాక్టరును— ప్రధానమంత్రిగా నియోగించి, నలుగురు హిందువుల ప్రతినిధులు, నలుగురు ముసల్మానుల ప్రతినిధుల-నలుగురు ప్రభుత్వోద్యోగులు గల్గినట్టి మంత్రిమండలి, మొత్తంమీద హిందూముసల్మానులకు సరిసమాన ప్రాతినిధ్యం ఉండేటట్లు-క్రొత్త మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయవలసిందని ఆజ్ఞ యిచ్చెను. లాయక్ అలీ ప్రధానమంత్రి అవటంతోడనే పత్రికాప్రతినిధులతో మాట్లాడుతూ— రాజకీయ ఖైదీలనందరిని విడుదల చేస్తానని

(20 వ పేజీ చూడుడు)

హైదరాబాద్ స్వాతంత్ర్యంకూడా అదేవిధంగా వుంటుంది. సముద్రంలో ఒక దీవిగా వుండి, ప్రత్యేక రాజ్యంగా వున్న న్యూఫౌండులాండ్ స్థాయిని, హైదరాబాద్ స్థాయితో పోల్చటం కేవలం అపహాస్యం.

బాలానందం

(15 వ పేజీ తరువాయి)

"మహారాజా! మహారాజా! అది నేను వ్రాయలేదండి, ఇంకా కావలిస్తే చూడండి, అడుగున సంతకం కూడా ఏమీ లేదండి" అని మొఱ పెట్టుకున్నాడు అరకుజాకీ.

"సంతకం లేదంటే మోసం చేద్దామని వ్రాసిఉంటావు. న్యాయంగా వ్రాసేవాడివైతే సంతకం ఎందుకు చేయవు? కాబట్టి నీ తప్పే మరీ బాగా ఋజువౌతుంది" అని రాజు సభవంక సగర్వంగా తిరిగి చూశాడు. రాజుగారి తెలివితేటలకు సభ్యులు చప్పట్లు చరిచారు.

"ఇంకేం! జాకీగాడిమీద నేరం ఋజువయింది" అంది రాణీ.

పాపకు ఈ అన్యాయం చూస్తే కోపం వచ్చింది.

"ఏం ఋజు వవలా! అసలు కాగితంలో ఏముందో అన్నా చూడకుండా, ఏమిటా తీర్పు?" అని గట్టిగా గదమాయించింది పాప. తెల్లకుందేలు కాగితం మీద ఉన్న పద్యాలు చదవటం మొదలుపెట్టింది.

ఆకతాయి కోతులన్ని
ఊక పోగు చేసికొంటె
కాకిమూక చుట్టు చీ
కాకు పరిచెనూ...
ఒకటి తెచ్చి, రెండు ఇచ్చి,
ఒకటి రెండు మూడు తెచ్చి,
మూడు మళ్లీ వెనక కిస్తె
మూడె నింతకూ"

"ఇంకేం? ఈ సాక్ష్యంతో నేరం ఋజువై పోయింది" అన్నాడు రాజుగారు. పాప అప్పటి కప్పుడే చాల పొడుగయిపోయింది. అందుచేత ఎవళ్లన్నా భయం లేకుండా పోయింది.

"నా మొహంలా గుంది. ఏమీ కాలే, అర్థంపర్థం లేని పద్యాలు—ఏమిటా పద్యాలు? అసలు ముందు దాని అర్థం ఏమిటో చెప్పండి, నలుసంత కూడా అందులో ఏమీ అర్థం లేదు. ఊ!" అంది.

పంచాయితీ దారులంతా "నలుసంత కూడా అర్థం లేదని నమ్ముతూంది" అని వ్రాసుకుంటున్నారు.

"సరే, అర్థమే లేకపోతే బ్రతికే పోయాము. అర్థం ఏమిటా అని తల కాయ పగలగొట్టుకో అక్కర్లేదు" అన్నాడు రాజుగారు. అని "అయినా చూద్దాం" అని కాగితం తిప్పి చూస్తూ—

"నువ్వు ఊక తెచ్చావా?" అని జాకీగాడిని అడిగాడు.

"నేను కోతిమూకనా మహాప్రభూ?" అన్నాడు జాకీ.

"కోతి వెధవ్వే లే, అంతవరకూ నిజమే. తర్వాత్త చూద్దాం. ఒకటి తెచ్చి, రెండు తెచ్చి—ఓ! ఎందుకూ, ఇది కజ్జికాయల విషయమే" అన్నాడు గొప్పగా రాజుగారు.

"కాని అన్నీ ఇచ్చేశాడని పద్యంలో ఉందిగా" అంది పాప.

"అవునా! అవుగో అక్కడ లేవూ?" అంటూ రాజుగారు, తనే నెగ్గిన సంతోషంతో కజ్జికాయలవంక చూపించాడు.

"సరే, పంచాయితీ దార్లు తీర్పు చెప్పండి" అన్నాడు రాజుగారు.

"కాదు. తీర్పు తర్వాత చెప్పవచ్చు, ముందు శిక్ష చెప్పండి" అని అరిచింది రాణీ. పాపకోపంతో "ఏడిశినట్టే ఉంది. తీర్పు చెప్పకుండా శిక్ష ఏమిటి?" అని అరిచింది.

"నోర్మూయ్!" అని గదమాయించింది రాణీ.

పాపకూడా కోపంతో "నువ్వే నోర్మూయ్" అని కేక వేసింది.

"ముందు దీని తల కొట్టేయండి" అని అరిచింది రాణీ.

పాప అప్పటి కప్పుడే తన మామూలు ఎత్తుకు ఎదిగిపోయింది.

"ఏడిశావులే, నువ్వంటే ఎవళ్లకీ లెఖ్ఖ! మీరంతా వట్టి పేకముక్కలే! అంతే" అంది.

పాప ఆ మాట అనేటప్పటికి, పేక ముక్కలన్నీ ఎగురుకొంటూ పాప మీదికి వచ్చి పడ్డాయి. పాప సగం కోపంతోటీ సగం భయంతోటీ ఒక్క కేక వేసి, వాట్లను కొట్టేందుకు చేతులు విసుర్తూ కళ్లు తెరిచింది.

* * *

తీరా చూస్తే తను తోటలో దారువు పక్కన చెట్టునీడను అక్కయ్యఒళ్లో తల పెట్టుకొని పడుకొని ఉంది. చెట్టు నుంచి రాలిన ఎండుటాకులు కొన్ని పాప మొహం మీదుగా ఎగురుతున్నాయి.

"పాపా! లేలమ్మా! ఇంతసేపు నిద్ర పోయావేం?" అంటూ వాళ్ల అక్కయ్య పాపను లేపి కూర్చోపెట్టింది. పాప తన కల అంతా అక్కయ్యతో చెప్పింది. అక్కయ్య ఆ కల చాలా బాగుందని, "పద, ఇంట్లోకి పద. ఫలాహారానికి వేళ అయింది" అని పాపను పంపించింది. పాప సంతోషంతో పరుగెత్తుకొంటూ ఇంట్లోకి వెళ్లిపోయింది. "ఈఅమాయిక సంతోషమే, హాయే, మా పాపకు జీవితం పొడుగునా ఉండాలి" అని అక్కయ్య దీవిస్తూ పాపవెంట వెళ్లింది.

సమాప్తం.

పతిత

(11-వ పేజీ తరువాయి)

చేసినట్లయితే మిమ్మల్ని యీ వాడకట్టునుండి తరిమివేయాల్సివస్తుంది". అని గోపయ్యను కోపగించా. గోపయ్య మాట్లాడలేక పోయాడు. అప్పటినుంచి లలితను త్రాగివచ్చి కొట్టడం తగ్గింది. అప్పుడప్పుడు లలిత యింటికి వెళ్తుండేవాడిని. లలిత వీథిలోకంగం చూడాలంటే పెద్దపులిని చూచినట్లు భయపడేది. పొరపాటున ఎప్పుడయినా వీథితలుపు తెరిస్తే 'జూ' లో జంతువుని చూచినట్లే ప్రతివాళ్లూ చూడడం, చకచకలు పకపకలు. ఒకనాడు అన్నాను: "లలితా, నీ వింత పిరికిదానివేం? సంఘానికి నీవు అంత జడవడానికి కారణం నీకే తెలుసనుకుంటా. ఇరుగు పొరుగువాళ్ళింటికి వెళ్ళడానికి భయం దేనికి?" సంసారస్త్రీలతో నేను మాట్లాడడమే! నన్నెవరు ఏ యింటికి రానిస్తారు నరహరిగారూ?" అని లలిత అనేది. "మా సుగుణ చాలామంచిది. మా యింటికి రా లలితా!" అని అన్నా. ఒకనాడు లలిత మాయింటికి వచ్చింది. వాడకట్టులో తుఫాను చెలరేగింది. తలోమాట సుగుణను, నన్ను, లలితను అన్నారు. మేం లెఖ్ఖించలేదు. కాని, లలిత బాధపడింది. తన్ననినందుకు విచారపడలేదు కాని తనమూలంగా సుగుణకూడా మాటలు పడవలసివచ్చినందుకు విచారపడింది. అది గ్రహించి సుగుణ "లలితా! నీవు లోకులకు భయపడవద్దు. మాయింటికి ప్రతిదినం రా!" అని గట్టిగా చెప్పింది. లలిత రోజూ మాయింటికి వచ్చేది. చీకటిరాత్రి...భయంకర రూపాలు... భయం...ఎంతో భయం. ఇది ఆమె నిత్యజీవితంలోని రాత్రులు. క్రమేణా ఆ భయం మాయమయిపోయింది. సుగుణ ఆమెను, ఒక మనిషిని చేసింది. లలితలో అద్భుతమైన పరివర్తన. ఆమె తండ్రిని ఎదిరించేది. ఒక్కొక్కప్పుడు సుగుణవద్ద పడుకొనేది. లలితకు చదువు రాదు. వొచ్చేట్టుగా చేసింది సుగుణ. లలిత ఎవరినైనా వివాహం చేసుకోవడానికి నిశ్చయించుకుంది. కాని తండ్రి పెనుభూతంలా అడ్డు నిలిచాడు. దురదృష్టవశాత్తు ఆమె జబ్బున పడింది. ఆమెను హాస్పిటల్‌లో చేర్పించికూడా నేనే. ఇప్పుడామె క్రమేణా ఆరోగ్యం కోలుకుంటోంది. కాని ఏం ప్రయోజనం? ముందు నుయ్యి, వెనుకగొయ్యి లాగుంది ఆమె అవస్థ. ఆ మారంలో అవుపించే చీకటివెలుగుల సంధ్యలా ఉంది ఆమె యిప్పటి జీవన్మరణసంధ్య.

లలితకథ విన్న ఈశ్వర్ గుండె ద్రవించింది. "ఆ అమ్మాయి ఎవరినైనా పెళ్ళి చేసుకో కూడదూ?"—"చేసుకోవచ్చు! కాని చేసుకొనేవాళ్ళెవరు?" అని నరహరి పలికాడు. ఈశ్వర్ దీర్ఘంగా ఆలోచించాడు. అతని కేదో విషయం జ్ఞాపకానికి వొచ్చింది. అతని కింకా విచారం కలిగింది. పరిత్యక్తవనితాలోకాన్ని, పతనమైపోతోన్న స్త్రీజాతిని కాపాడడంకంటే మానవసేవ వేరే లేదు. ఈ ఆలోచన ఈశ్వర్‌కు తట్టింది. అతను లలితను పెండ్లి చేసుకోడానికి నిశ్చయించుకున్నాడు. "హరీ! నేనా అమ్మాయిని పెళ్లి చేసుకుంటానురా!" అని గంభీరంగా ఈశ్వర్ పలికాడు. నరహరికి ఆశ్చర్యం కలిగింది. "నిజంగానేనా!" అని నరహరిఅన్నాడు. "నిజమే" నని ఈశ్వర్ ఉద్ఘాటించాడు. నరహరికి చాలా ఆనందం కలిగింది. తన భుజాలపై నుండి ఒక బరువు దిగిపోయినట్లయింది. ఎక్కడో పాతాళలోకానికి దిగబడిపోయిన ఓ అనాథ బాలికను పైకి లాగి రక్షించినట్లు ఆనందించాడు. ఆ శుభవార్త లలిత కందజేయాలని నరహరి మిత్రునితో హాస్పిటల్‌కు బయల్దేరాడు. "తనతోటివనితకో శుభవార్త" అని కృష్ణమ్మ ఉన్న నీటిలో నేనే వొయ్యారపు నడకలు నడిచింది.

* * * *

ఇద్దరు మిత్రులూ హాస్పిటల్‌వైపుకు వెళ్తున్నారు. ఇద్దరు పోలీసులు భుజాలమీద తుపాకులు పెట్టుకొని వస్తున్నారు. వాళ్ళిద్దరిమధ్యా చేతికి సంకెళ్ళతో గోపయ్య నడుస్తున్నాడు. గోపయ్యకు డబ్బు వచ్చే మార్గం అవుపించలేదు. సారాయి లేకపోతే పిచ్చెత్తినట్లుండేది. అంచేత చిన్నపిల్లల్ని మిఠాయి కొనిపెడతానని మోసగించి వాళ్ళదగ్గరి వస్తువులు కత్తిరించడం మొదలుపెట్టాడు. ఆనాడు ఓ ఆడపిల్లను, బొమ్మ తీస్తానని మాయచుచ్చి కాలవగట్టుకు తీసుకొచ్చాడు. బలవంతంగా వస్తువులు తీస్తున్నాడు. ఆ పిల్ల కేకలువేసింది. అతను ఆ పిల్ల పీక నులిమేసి వస్తువులు తీస్తుండగా, ఆ పిల్ల కేకలు విన్న కొందరు వచ్చి గోపయ్యను పట్టుకున్నారు. పోలీసుల కప్పగించారు. వాళ్లతని బేడీలు వేసి ఠాణాకు తీసుకెళ్తున్నారు. గోపయ్య నరహరిని చూడగానే తల వంచుకున్నాడు. "నీవు పెద్దవాడివి. కండపుష్టి కలవాడివి. ఏ కాయకష్టంచేసినా నాలుగు డబ్బులు సంపాయించుకొని నిన్ను నీవు పోషించుకోవచ్చు" అని నరహరి పలికిన మాటలు జ్ఞాపకానికొచ్చాయ్. అతని కళ్లల్లో నీళ్ళు తిరిగాయ్. గోపయ్య చేయెత్తి నరహరికి నమస్కారం చేశాడు. ఎంతటి దౌర్భాగ్యుడయినా, పొరిగింటి గోపయ్యకు కష్టం వచ్చినందుకు నరహరి హృదయంలో బాధపడ్డాడు.

నరహరి, స్నేహితునితో హాస్పిటల్‌కు వచ్చాడు. డాక్టరమ్మ అనుజ్ఞతో లోపలికి వెళ్లారు. లలిత బెడ్‌దగ్గరకు వెళ్తున్నారు. అడుగుల శబ్దంవిని, తన కారోగ్యం ప్రసాదించి తల్లిదండ్రుల ప్రేమను మరపించిన నర్సు, టెంపరేచర్ చూడ్డానికి వస్తున్నదని భావించి లలిత కళ్ళు తెరచింది. ఆశ్చర్యం......ఆమె చకితురాలయింది.. ..."నరహరిగారు...నరహరిగారు... ఇక్కణ్ణుంచి వెళ్లిపోండి. అతన్ని యిక్కడనుంచి తీసుకొనివెళ్లిపోండి. కుదుటబడుతున్న మనస్సును చెదరగొట్టకండి..." అని లలిత పలికింది. నరహరి నిశ్చేష్టుడై నిలబడిపోయాడు. ఈశ్వర్ లలితను చూడగనే స్తంభించిపోయాడు. "వేణీ!...వేణీ..." అని దీనంగా పలకరించాడు. నరహరికి అర్థం కాలేదు. ఇద్దరినీ ఆశ్చర్యంతో చూస్తున్నాడు. "వేణీ! వేణీ! నన్ను క్షమించవూ? నేను నీకు తీరని అన్యాయం చేశాను. నన్ను మన్నించు వేణీ!" అని ఈశ్వర్ లలిత బెడ్‌దగ్గరకెళ్లి ప్రాధేయపూర్వకంగా అడిగాడు. "ఈశ్వర్! నన్ను పలకరించకు. నీవు యిక్కడనుంచి వెళ్లిపో. మానిపోయిన పుండును రేపకు. నీకు పుణ్యముంటుంది" అని లలితఅన్నది.

ఈశ్వ—వేణీ! పశ్చాత్తాపంతో కృశించిన నా గుండెను చూడు! నరహరివల్ల నీవు పడిన కష్టాలు విన్నా. తగిలిన దెబ్బకే గాయం తగిలినట్లయింది. చివరికి నిన్ను కలుసుకోగలిగా. నేను నిన్ను పెళ్లాడతా వేణీ!

నర—"అవును లలితా! ఈశ్వర్ నా ప్రియ మిత్రుడు. నీవు ఎవరో తెలిసికోకుండానే ఓ పరిత్యక్తను పెళ్లిచేసుకుంటానికే యిక్కడకు వచ్చాడు. మీ యిద్దరికీ పూర్వపరిచయం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదివరలో అతను నీ కేదైనా అన్యాయం చేస్తే మన్నించు. మీ యిద్దరి వివాహం మా యింట్లో రేపు ఆదివారంనాడే.

లలిత ఏమో అనబోయింది. కాని నరహరి చిరునవ్వుతో "ఇక నీ వేం మారు పలకవద్దు" అని లలితమాట కడ్డొచ్చాడు. లలిత మాట్లాడలేక పోయింది. పూర్వం ఈశ్వర్ జమీందారుగా ఉన్న రోజులు, అతను ఆమెను పెళ్లాడతానని చేసిన బాసలు, ఆ బాసలకే తను సతీత్వాన్ని అవివాహితగనే పోగొట్టుకొంది—అత నెంతో ప్రేమగా ఉన్న రోజులు జ్ఞాపకానికొచ్చాయ్ కాని మోసం చేశాడు. ఈనాడు పశ్చాత్తాపపడ్డాడు. ఎండిపోయిన మ్రాను మళ్లా చిగిర్చింది. ఇంకిపోయిన జలం మళ్లా ఊరింది. లలిత కంటివెంట ఆనందబాష్పాలు రాలాయి. ఈశ్వర్ ఆమెను చేబట్టాడు. కస్తూరిబా హాస్పిటల్ ప్రశాంతవాతావరణం ఆ యిద్దరి హృదయాల్లో, వారి జీవితబాటలో నెలకొన్నది.

వజ్రాలు

శ్రీ యామర్తి గోపాలరావు

వజ్రం అనాదికాలంనుంచీ, నవరత్నాలలో ఒక ఉన్నతస్థానం సంపాదించింది. మిగతా రాళ్ళకంటే, ఇది అధికమైన గుణాలను కలిగియుండుటయే కారణం. అందుకు ఇది మంచి సౌందర్యమైన వస్తువు. స్థిరంగా కలకాలము ఉండేది. సామాన్యంగా లభించదు. ప్రాచీనకాలం నుంచీ, దీన్ని ఆభరణాలలో ఉపయోగిస్తుండేవాళ్లు. గాజు, పింగాణీపదార్థమును కోయుటకు, రంధ్రములు తొలియుటకు, గడియారాలల్లో, విద్యుత్ కొలమానాలలో ఉపయోగిస్తున్నారు. వజ్రసహాయంతో తయారుచేసిన తీగను విద్యుద్దీపాలలో ఫిలమెంట్లుగా వాడుతున్నారు.

పోర్చుగీసు, దేశస్థుడైన గార్సియా డి ఆరేటా, 1565 లో, గోవా రాజప్రతినిధిగా హిందూదేశానికి వచ్చాడు. ఈతడు భారతదేశంలోని వజ్రాలనుగురించి, విపులంగా వ్రాశాడు. పురాతనకాలంలో ప్రసిద్ధిపొందిన వజ్రాలన్నీ హిందూదేశములోవేనని ఈతని అభిప్రాయము. ప్రాచీనకాలంనుంచీ 19 వ శతాబ్దం చివరవరకూ, వజ్రాలని ఉత్పత్తిచేయటంలో, భారతదేశానిదే అందెవేసినచెయ్యి. నవరత్నాల వ్యాపారముపై, జీన్ బాప్టిస్టు టార్నియర్ అనే ఫ్రెంచివర్తకుడు, 1645 వ సం. లో భారతదేశం వచ్చినపుడు "ప్రపంచ పరిశ్రమల్లో భారతీయ వజ్రపరిశ్రమ మిన్నగా ఉంది" అని తన గ్రంథంలో వ్రాసుకొన్నాడు. వజ్రాలు వింధ్యపర్వతపు రాళ్లగుట్టల్లోను, శిథిలావస్థలోనున్న శిలలలోను సహజముగా లభిస్తూ ఉండేవి. హిందూదేశములో దక్కను పీఠభూమికి, తూర్పువైపున ఉన్న వజ్రపుగనులను ఐదుభాగాలుగా విభజించవచ్చు. ఇందులో మూడు మద్రాసు రాజధానిలో ఉన్నవి. 1. కడపలోని చెన్నూరప్రాంతము. 2. కర్నూలు జిల్లాలోని బనగానపల్లిప్రాంతము. 3. కృష్ణానదిపై ఉన్న కొల్లూరుప్రాంతము. 4. మధ్యపరగణాలలోని మహానదిపై ఉన్న సంబల్‌పూరు ప్రాంతము. 5. అలహాబాదుకు, పరిసరాలలో ఉన్న పన్నాప్రాంతము. ఈవజ్రాలవర్తక కేంద్రము, గోల్కొండగా ఉండేది.

భారతదేశంలో కొన్ని కొన్ని ప్రాంతాల్లో, వజ్రాలు ప్రోగుచేయటము అనంతంగా జరుగుతుండేది. ప్రాచీనపరిశ్రమల గురించి పరిశోధన జరపగా, వజ్రాలు ప్రోగుచేయటము, కొద్దికాలం క్రిందటనే నశించినట్లు తెలుస్తుంది. 1645 వ సం॥ లో టావెర్నియర్ భారతదేశం వచ్చినపుడు, కొల్లూరు ప్రాంతంలో 60,000 మంది కార్మికులు వజ్రపు గనుల్లో పనిచేస్తున్నట్లుగా అచూకీ. ఈగనుల్లో వజ్రసంపద ఉన్నట్లుగా, ఒక వంద సంవత్సరాలక్రిందట గాని, తెలియలేదు వజ్రోత్పత్తి!, 19 వ శతాబ్దంలో పన్నాప్రాంతము బాగా ప్రసిద్ధి పొందింది. అప్పట్లో పెద్ద వజ్రాలని చెప్పుకొనబడే వన్నీ హిందూదేశంలోనే లభించేవి. 1881 లో, కడపజిల్లాలోని వజ్రకరూరు ప్రాంతంలో 67 3/8 క్యారట్ల బరువుగల దొకటి, 1809 లో, హీరాకుండ్ ప్రాంతంలో, 210 1/2 క్యారట్ల బరువుగలదీని లభించినవి. ఇవిగాక పశ్చిమోత్తర పరిహద్దు ప్రాంతంలోను, సిమ్లాప్రాంతంలోను, కొద్దిగా దొరకినట్లు చరిత్రకారులు తెల్పుతున్నారు. గోల్కొండ, కర్నూలు ప్రాంతాలలోని గనులు, 1677 వ సం. నకు ముందే, కనుగొనబడినట్లుగా, రాయల్ సొసైటీవారి 'ఫిలసాఫిల్ ట్రాన్సాక్షన్సు'నుబట్టి తెలుస్తున్నది.

వజ్రాలు హిందూదేశంలోనే కాక, బ్రెజిలు దేశంలోనూ, బ్రిటిషు గయానాలోనూ, న్యూసౌత్ వేల్సు, అర్కన్సాస్ ప్రాంతంలోను, ముఖ్యంగా దక్షిణాఫ్రికాలోను దొరకుతున్నవి. ప్రస్తుతము దక్షిణాఫ్రికాలో దొరకుతున్నన్ని వజ్రాలు, మరెక్కడా దొరకటంలేదు. ప్రపంచపు ఉత్పత్తిలో, నూటికి 96 పాళ్లు వజ్రాలు, దక్షిణాఫ్రికాలోనే దొరకుతున్నవి. ఇప్పటివరకూ, భూగోళంలో పెద్దదని చెప్పబడే, 'కలూనన్'అనే వజ్రము, కింబర్లీ ప్రాంతములో లభించింది.

స్వాభావిక వజ్రాలు: వాటి చరిత్ర

'గ్రేట్ మొగల్'— ఈ వజ్రం చెక్కక ముందు 787 క్యారట్లు, చెక్కిన తర్వాత 280 క్యారట్ల బరువు ఉండేది. ఇది గోల్కొండ గనుల్లో దొరికింది. 1665 లో ఔరంగజేబు ధనాగారంలో ఉన్నట్లుగా టావెర్నియరు తెల్పుచున్నాడు. ఇది షాజహానుకు మీర్ జుములావద్దనుంచి వచ్చింది. వెనకటిరోజుల్లో దేవతాప్రతిమల నేత్రాల్లో వజ్రాలు పొదిగేవారు. ఏ వజ్రంఅయినా పరేతమ స్వాధీనంలోఉంటే, ఆ ఆకాంక్షతో పరరాజులు దండెత్తినపుడు కలిగే జననష్టభయంతో అప్పటి రాజులు వజ్రాలన్నీ ఏ దేవాలయాల్లోనో ఉంచేవారు. ఇలా లభించిన, 'అర్లాఫ్' అనే వజ్రాన్ని, ఫ్రెంచి సైనికుడు దొంగిలించగా, అతనివద్దనుంచీ ఒక ఓడనాయకుడు దొంగిలించాడు. దీనిని అర్లాఫ్ యువరాజు, 90,000 పౌన్లకు కొని కేథరీను కిచ్చాడు. ఇది కొంచెము పసుపుపచ్చగా ఉండేది. 194¾ క్యారట్లు తూగేది. మూడవది 'కోహినూరు" అనే ప్రపంచ ప్రసిద్ధి చెందిన వజ్రం. ఇది 1739 లో నాదర్షాస్వాధీనంలోనూ, 1813 వ సం॥లో లాహోరు మహారాజు ధనాగారంలోను ఉన్నట్లు తెలుస్తున్నది. తర్వాత ఈస్టిండియా కంపెనీద్వారా 1850 లో విక్టోరియా మహారాణీకి, బహుకరింపబడినట్లుగా తెలుస్తుంది. ఇది అమ్స్టర్‌డమ్ పనివారలచే, తిరిగి కోయించబడగా, 106 1/16 క్యారట్లు తూగింది. కోహినూరు, అర్లాఫ్ అను రెండు వజ్రాలు, 'గ్రేటుమొగలు'లోని భాగాలేనని ప్రతీతి. బేబరు, ఆగ్రాపై దండయాత్ర జరిపినపుడు, 187 కారట్ల బరువుగల వజ్రము దొరకినట్లు తెలిసింది. ఇదే కోనూరు అని, చాలామంది అభిప్రాయపడ్డారు. కాని, దీనితో, టావెర్నియరు ఏకీభవించలేదు. నెవిల్ స్టోరీ మాస్కిలీన్ అనే ఆతడు, టావెర్నియర్‌కు హిందూదేశతులామానము బాగా అవగాహన కాక, పొరపాటుపడ్డాడని రుజువుచేసాడు. సుప్రసిద్ధ వజ్రం, 'కోహినూరు'ను గురించీ ఈవిధంగా భేదాభిప్రాయాలు ఉన్నవి. హిందూదేశంలోనే లభించిన మరొక, 'రీజంటు' లేక 'పిట్టు' వజ్రము, ముడివస్తువుగా ఉన్నప్పుడు 410 క్యారట్లు, కోసిన తర్వాత 136 14/16 క్యారట్లు తూగినది. దీనిని, 20,400 పౌనులకు, మద్రాసు గవర్నరు పిట్టు కొనటమువల్ల దీనికి పేరు వచ్చినది. దీన్ని తిరిగి ఫ్రాన్సులోని, ఆర్లియన్సు ప్రభువు 135,000 పౌనులకు కొన్నాడు. 'అక్బరుషా' అనే మరొక వజ్రము మొదట 116, క్యారట్లు, కోసిన తర్వాత 71 క్యారట్లు తూగేది. దీన్ని, 35,000 పౌన్లకు బరోడా గయక్వారు కొన్నాడు. ప్రస్తుతము హైదరాబాదు నిజాము అధీనంలో ఉన్నా "నిజాము" అనే 277 క్యారట్లు తూగే వజ్రము 440 క్యారట్లు తూగే దానిలో ఒక భాగమని భావిస్తున్నారు.

1642 లో గోల్కొండలో దొరకిన 'గ్రేట్ టేబిలు' (242 3/16 క్యారట్లు), పర్షియా రాజు అధీనంలోఉన్న 186 క్యారట్ల బరువుగల, 'దరియా-ఇ-నూర్' వజ్రమేనని, మాస్కిలీన్ అభిప్రాయపడుతున్నాడు. పర్షియారాజు, అధీనంలోనే ఉన్న మరొక, గులాబీగాఉండే 'తాజ్-ఇ-మా' అనే వజ్రము. ఇది 146 క్యారట్లు తూగుతుంది. వరుసగా, ఛార్లెస్ ది బోల్డు, డి. సన్సీ, ఎలిజబెత్ రాణి, 14 వ లూయీ డెనుడాఫ్ యువరాజులద్వారా చివరకు ఒక భారతీయ యువరాజుపాల బడ్డ సన్సీవజ్రము మరొకటి, ఇది 53 12/16 క్యారట్లు తూగింది.

రంగువజ్రములు

రంగువజ్రాలు హిందూదేశములో చాలా అరుదుగా దొరికేవి. ప్రసిద్ధికెక్కిన రంగువజ్రాలల్లో, నీలంగా ఉండే వజ్రం ఒకటి. దీనిపేరును గురించి సరియైన వివరాలు లభించలేదు. ఇది మొదట 112 3/16 క్యారట్లు, కోసినప్పుడు 67 2/16 క్యారట్లు తూగినట్లుగా తెలుస్తుంది. హెచ్. టి. హోప్‌దొరగారు, సంపాయించిన వాటిలో 44½ క్యారట్లు తూగు "హోప్"వజ్రం ఒకటి. ఇది నీలంగా ఉండేది. సాక్సన్ కిరీటంలో పొదగబడిన, "డ్రెస్డన్ గ్రీను,"అనే వజ్రం. ఇది ఆకుపచ్చగా ఉంటుంది. 40 క్యారట్లు తూగింది. లేతపసుపు పచ్చగా ఉండి, 133 1/5 క్యారట్లు "ఫ్లారెంటైన్" అనేది మరొకవజ్రం.

వజ్రాలరంగునుగురించి సరియైన వివరాలు లేవు. కాని, కేథోడ్‌కిరణాలు, వజ్రంలోకి పంపినపుడు, దానిరంగులు, మరింత ధృడపడుతవి. కాని, పసుపుపచ్చరంగువి తప్ప, మిగతా వజ్రాలని 300-400° సెంటిగ్రేడువరకు వేడి చేసినప్పుడు, ఇవి వాటి రంగులను కోల్పోతవి 'కార్బొనెడో' అనబడు, నలుపులాంటి మొద్దు రంగుల వజ్రాలకు, వజ్రపువిలువ లేకపోయినా, వాటికి గల కాఠిన్యమువల్ల, ఉపయోగంలో ఉన్నవి.

గొప్ప వజ్రాలు

4,00,000 పౌనులకు, హైదరాబాదు నిజాము కొన్న 'విక్టోరియా' అనే వజ్రం ఒకటి. ఇది ముడిగా 457½ క్యారట్లు, కోసినతర్వాత 180 క్యారట్లుతూగింది. 1895లో"జూబిలీ"అనే మరొక వజ్రము కనుగొనబడింది. ఇది ముడిగా 634 క్యారట్లు, కోసినతర్వాత 239 క్యారట్లు తూగేది 1905 వ సం. వరకు, మిక్కిలి పెద్ద వజ్రం, "ఎక్సెల్సర్." ఇది కోయక పూర్వము 969½ క్యారట్లు తూగింది. దీన్ని తిరిగి, 13 మొదలు 68 క్యారట్ల బరువుగల. పదిరాళ్లగా కోసారు.

నేడు ప్రపంచములోకల్ల పెద్దదైన వజ్రం "కలూనన్" ఇది ట్రాన్స్‌వాల్‌లో కొత్తగా కనుగొనబడిన ప్రీమియర్ గనులలో 1905 సం. లో లభించింది. దీన్ని ట్రాన్స్‌వాల్ ప్రభుత్వము, 1907 లో, ఏడవ ఎడ్వర్డుకు బహూకరించింది. దీనియొక్క బరువు 1 1/3 పౌనులు, లేక 3,032 క్యారట్లు దీన్ని అమ్‌స్టర్‌డామ్‌లో 9 పెద్దభాగాలుగా కోయించారు. పెద్దరాళ్లు షుమారు, 516½, 309 3/16, 92,62 క్యారట్లు తూగినవి.

జె. ఫ్రీడ్‌లాండ్, ఆర్. వాన్‌హాసింగర్, జె. వుల్ఫ్, ఇ. కోహెన్ మొదలగు శాస్త్రజ్ఞులు కావించిన పరిశోధనలబట్టి, ఒకానొక ద్రావణమునుండి (Solution), వజ్రము స్ఫటికరూపం పొందినట్లుగా తెలుస్తుంది. మరి కొందరు, వజ్రంలోవాకర్బనితముల విచ్ఛిత్తివలన ఏర్పడినటుగా భావించారు. కింబర్లీ వజ్రాలు, ఇసుక కొండ ప్రాంతాలయందలి భూముల్లో దొరకుతున్నవి. ఈ ప్రదేశంలో గల మట్టిలో వజ్రాలతోపాటు పైరైట్సు, కాలైట్సు, గారెట్సు మొదలగునది కూడా కలిసిఉంటవి. దీన్ని, రసాయనిక మార్గముల ద్వారా కడిగినప్పుడు బరువైన పదార్థమంతా మిగిలి, తేలిక పదార్థమంతా కొట్టుకు పోతుంది. వజ్రాలు బరువైనవి గనక ఇవి మిగిలిపోయేవి. ప్రదేశాన్ని బట్టి వజ్రసంపద ఆధారపడి ఉంటుంది. గొప్పగనులు అని చెప్పుకొనబడే వాటిల్లో, టన్ను మట్టికి 1 గ్రాము చొప్పున వజ్రాలు లభిస్తవి. భారతదేశంలో వజ్రాలు నదుల గట్లమీదను, ఇసుక పర్వలలోను దొరుకుతున్న విషయం, అందరెరిగిందే. ఈ వజ్రాలు పర్వత ప్రాంతం నుంచి వచ్చే నీటి ప్రవాహాలద్వారా కొట్టుకొనివస్తవి. దీన్నిబట్టి చూస్తే, ఇవి పుట్టేది ఒకచోట, లభించేది మరొకచోటగా కనపడుతుంది. వజ్రాలు, ముడిగానున్నప్పుడు, కొంచెము బూడిద రంగు కలిగిఉండేవి. అందుకల్ల ఇవి చుట్టూ ఉన్న రీతి కుప్పల్లో కలసిపోయి, వాటినుంచి వేరుపరచడము చాల కష్టమనిపిస్తుంటుంది.

పెద్దపెద్ద గుంటలు త్రవ్వి, వజ్రాలతో ఉన్న ముడిరాళ్ళను, ఈ గుంటల్లో పోసి, పొడిచేసి, వాటినిండా నీళ్ళు పోసేవారు. మట్టి మొదలగు, మెత్తక పదార్థమంతా, నీటితో కలసిపోయి జల్లెళ్లతో తేర్చినపుడు కఠినంగా ఉండేరాళ్లను వేరుపరుస్తారు. అది బుట్టలో పోసి వాటినుండి, మెరుస్తూన్న వజ్రపురాళ్లను ఏరేవాళ్లు. ఈ విషయము, పట్టణాల్లో మురికికాలువల వద్ద పాకీవాళ్లు జల్లెడతో చేసే పనిని చూసినవాళ్ళు బాగా ఊహించుకోవచ్చు. ఆ రోజులలో వజ్రాలు అమ్మటం, కొనటం, అంతా పిల్లలే చేసేవాళ్ళు. అంటే, అప్పటి ప్రజలు, ఎంత నమ్మకంగా ఉండేవాళ్లో ఆలోచించండి. ఆ గుంటల్లో నుంచీ, నీళ్లు లాగి పారవేయుట కుపయోగించే యంత్రసామగ్రితప్ప, ప్రస్తుతంకూడా వజ్రాలు దాదాపు ఇదే పద్ధతిలోనే సంపాదిస్తున్నారు.

కృత్రిమ వజ్రాలు

కాలచక్రభ్రమణంవల్ల, ప్రపంచంలో విజ్ఞానం నియంతృత్వం వహించింది. సుప్రసిద్ధ శాస్త్రజ్ఞులందరూ వజ్రంపై పరిశోధన మొదలెట్టారు. టర్పెన్‌టైన్, కర్పూరం, ఏంబర్, మొదలగు వాటి వక్రీభవనగుణకములను (Refractive index) వజ్రపు వక్రీభవనగుణకముతో పోల్చి వజ్రము, చమురు పదార్థంలో నుంచి వచ్చినట్లుగా న్యూటన్ సలహాయిచ్చాడు. 1694 లో ఫ్లోరెంటైన్ శాస్త్రజ్ఞులు, వజ్రాన్ని ఎర్రగా మండే, గాజు కాంతిలో మండించినపుడు, అది ఒక ఎర్రని బొగ్గు రవ్వగా కనుపించి, మాయమైపోయింది. 'ఎలెన్'మరియు'పెప్సీను' 1807 లో వజ్రాన్ని, అమ్లజనిలో మండించగా బొగ్గు ఇచ్చునంత, బొగ్గుపులుసు వాయువు నిచ్చింది దీనినే తిరిగి 1814 లో 'డేవి చేసెను. 'లెవాసియర్' 1772లో, బొగ్గును మండించినపుడు ఏర్పడిన బొగ్గుపులుసు యువావంత తిరిగి, 'స్మిత్సన్ టెనంట్' 1797 లో వజ్రాన్ని మండించినపుడుగూడ, లభించింది. ఈపరిశోధనలనుబట్టి, వజ్రం కర్బనముతో నిండి ఉన్న విషయము తేలిపోయింది.

విజ్ఞానము పెంపొందుతున్న కొద్దీ, కర్బనము ఆధారంతో వజ్రాలను తిరిగి సృష్టించవచ్చా అనేసమస్య శాస్త్రజ్ఞుల పాలిట పడ్డది. వీరి కృషిఫలితమే నేటి కృత్రిమ వజ్రాలు. వీటిని తయారుచేయుటంలో 1820 నుంచి ప్రయత్నాలు జరుగుతున్న వేగాని 1893 లో హెచ్. మాజన్ అనే శాస్త్రజ్ఞునివల్లకాని సాధ్యపడలేదు.

ఈతడు ఒక విద్యుత్వాహక బట్టీని మొదట తీసికొన్నాడు. దానిలో, కర్బనపు కడ్డీలతో ఒక విద్యుత్ చాపము (Electric arc) నమర్చాడు. ఈబట్టీలో ఇనుమూ, బొగ్గూకలిపి అత్యధిక ఉష్ణోగ్రతవద్ద వేడి చేశాడు. ఇనుమూ, బొగ్గూ రెండూ కరిగిపోయినవి. 3500° ల ఉష్ణోగ్రతలో నున్న, మూసలోపలి ఈ కరగిన ద్రావణాన్ని అతిత్వరితంగా నీళ్ళలో ముంచి చల్లార్చాడు. ఇనుమును, ఉదజహరికామ్లములో (Hydro-chloric acid) కరగించి, కర్బనాన్ని వేరుపరచాడు. మిగిలిన కర్బనం, కొంత గ్రాఫైటుగాను, కొంతభాగము వజ్రాలుగాను మారినది. నిదానముగా వీటిని వేరుపరచాడు. వజ్రాలు ఏర్పడటానికి కారణం, ద్రవీభూతమైన ద్రావణాన్ని ఘనీభవింపజేసినపుడు ఏర్పడిన అత్యధిక పీడనశక్తివల్ల ఏర్పడింది—అని మొదట అనుకొన్నాడు. కాని చివరకు ద్రావణాన్ని అతిత్వరితంగా చల్లార్చటంవల్ల వజ్రాలేర్పడిన వని తేల్చాడు. దీనినే, 1917 లో క్రూక్స్ లారోసా, రఫ్ మొదలైన విజ్ఞానులు తిరిగి చేశారు. కృత్రిమపద్ధతుల్లో చేయబడిన వజ్రాలలో మిక్కిలి పెద్దవి .7 మి. మీ ఉంటవి.

కృత్రిమ వజ్రాలు తయారుచేయటంలో 'మేడమ్ క్యూరీ' ఒక సలహా యిచ్చింది: "కొండగుహల్లో బొగ్గునునింపి ఆటంశక్తిని విచ్ఛినంచేస్తే బొగ్గు వజ్రస్ఫటికాలుగా మారుతుంది". నిజంగా

(20 వ పేజీ చూడుడు)

వజ్రాలు

(19-వ పేజీ తరువాయి)

అమాయక ప్రజను బలిగొనేకన్న అటంబాంబులను ఈ విధంగా ఉపయోగిస్తే చాలా బాగుంటుంది. పద్ధతులుమాత్రమే కనిపెట్టారుగాని, పెద్ద మొత్తాల్లో ఉత్పత్తిచేయటం ఇంతవరకూ జరగలేదు.

ఉపయోగాలు

దీనిని ఆధునిక కాలంలోనేకాక, అనాది కాలంనుంచీ ఆభరణాల్లో ఉపయోగిస్తున్నారు. కాంతికిరణాలని విచ్ఛిన్నంచేసి పరావర్తింపజేసే గుణంవజ్రానికుండటమే దీన్ని ఆభరణాలల్లో ఉపయోగించటానికి కారణం. వీటిని ఆభరణాలల్లో ఉపయోగించటాన్నిగురించి లండనులో ఇటీవలనే భారతీయ సుప్రసిద్ధ శాస్త్రవేత్త సి. వి. రామన్ తన అభిప్రాయమిలా ఇచ్చాడు "వజ్రాలు మిక్కిలి కాంతివంతంగా ప్రజ్వరిల్లుట వల్ల, మానవుడు వజ్రాలవైపు దృష్టిసారించలేడు. కనుక వజ్రాన్ని ఆభరణంగా ఉపయోగించిన వ్యక్తివైపు అతడు దృష్టి మరల్పలేడు వజ్రాలు వాటిని వాడిన వ్యక్తిని విలోకించుట కుపయోగిస్తున్నారేగాని, వీటిని పరిశీలించుటకు గాదు."

గాజు, పింగాణీ పదార్థాలని కోయటానికి గాని,రంధ్రాలని తొలియటానికిగాని, వజ్రంతప్ప మరోదానికి అసాధ్యం. పంటిదంతం మొదలగునవి కోరిన ఆకృతిలో తేవటానికి వజ్రసహాయమవసరము. విద్యుత్ కొలమానాలు, గడియారాలు మొదలగు ఆధునిక యంత్ర సామాగ్రిలో ఉపయోగిస్తున్నారు. మెరుగుపెట్టటానికి దీన్ని వజ్రాన్ని ఉపయోగిస్తారు.

అన్నిటికంటె ముఖ్యమైన ఉపయోగం తీగ పరిశ్రమ. ఈ పరిశ్రమ మరచి తరిఫీదుపొందినవారలచే జరుపబడుతున్నది. వీరు అమిత వేగంతో భ్రమించే సున్నితమైన ఉక్కుసూదుల సహాయంతో వజ్రాల్లో మిక్కిలి సన్నమైన రంధ్రాలని తొలుస్తారు. ఈ ఉక్కుసూదులు నిమిషానికి 8000 చుట్లు తిరుగుతూ వజ్రాల లోపలికి చొరబడిపోతూ ఉంటవి. ఇంతటి కఠినతమమైన, వజ్రాలలోపలికి, ఈ సూదులు చొచ్చుకుని పోవటం, చూసేవాళ్ళకు, చాలా ఉత్సాహ జనకంగా ఉంటుంది. దీనితో .01 మొదలు .02 మిల్లిమీటర్ల దళసరియైన తీగకూడ తీయవచ్చు. అంటే ఈ తీగ ఆడవాళ్ళ కురులకన్న సన్నముగా తీయవచ్చు నన్నమాట. ఇలా తయారైన తీగల ఉపయోగాలు అసంఖ్యాకం. ముఖ్యంగా అందరికి తెలిసిన విషయం విద్యుద్దీపాలలో ఫిలమెంట్లుగా వాడుతారు.

వజ్రంపై పరిశోధన గావించుచున్న భారతీయ సుప్రసిద్ధశాస్త్రవేత్త సర్ సి. వి. రామన్ ఇంకా ఈవిధంగా ఉపయోగించుకోవచ్చునని సలహా యిచ్చాడు: "వజ్రాలు తగినంత చౌకలో గనక లభ్యమైతే, వాటినుండి సొగసైన పాత్ర సామగ్రిని తయారుచేయవచ్చును. ఇది పిరెక్సు గాజుతో చేయబడినదానికన్న శ్రేయస్కరం. వజ్రాలు మంచి ఉష్ణ ప్రవాహకాలు కాబట్టి వంటపాత్రలు తయారుచేయటానికి కూడా ఉపయోగించవచ్చు".

ఇండియా నిజాం సంప్రదింపులు

(17-వ పేజీ తరువాయి)

చెప్పెను. ఆనాటి రాత్రి రేడియోప్రసంగంలో 16 గురు కాంగ్రెసునాయకుల విడుదలకు ఉత్తరువులిచ్చినట్లు చెప్పినాడు. విడుదల అయిన కాంగ్రెసు అధ్యక్షునకు నిజాంప్రభుత్వం వ్రాతమూలకంగా ప్రతిపాదనల నివ్వలేదు! మధ్యవర్తులద్వారా సంభాషణలు జరిగినాయి. స్టేటు కాంగ్రెసు, హైదరాబాదు ఇండియన్ యూనియన్‌లో చేరాలని, సంస్థానంలో తక్షణమే బాధ్యతాయుత ప్రభుత్వం నెలకొల్పబడాలని కోరింది. దానికి నిజాంప్రభుత్వ మంత్రి రాయబారవర్గ నాయకుడు మొయిన్ నవాజ్ జంగు జవాబు ఏమంటే— హైదరాబాదు ఇండియన్ యూనియన్‌లో చేరుట, చేరకపోవుట నిజాం ప్రభువుల దివ్యచిత్తమునకు సంబంధించిన విషయమని, బాధ్యతాయుత ప్రభుత్వ సూత్రాన్ని ప్రభుత్వం అంగీకరిస్తుంది కాని కొంత కాలంవరకు-అనగా కనీసం పది సంవత్సరాల వరకైనా, శాసనసభలోను మంత్రి మండలిలోను హిందూ ముసల్మానులకు సమాన ప్రాతినిధ్యాన్ని కాంగ్రెసు అంగీకరించాలని చెప్పాడట. స్వామీజీ కార్యాచరణ సంఘ సమావేశం మద్రాసులో జరిపి, సంఘాభిప్రాయ ప్రకారం నిజాం ప్రభుత్వం సూచనల నిరాకరిస్తూ - తమ కోరికల పునరుద్ఘాటించారు. లాయకలీ తన క్రొత్త మంత్రివర్గాన్ని ఏర్పాటు చేశాడు. అందులోని నాలుగు ముసల్మానుల స్థలాలు ఇత్తెహాదుల్మసల్మీను వారి కిచ్చాడు. ఒక ముస్లిం హైకోర్టు న్యాయాధిపతిని పోలీసుశాఖా మంత్రిగా వేశాడు. ఇంకొక హిందూ హైకోర్టు జడ్జీని న్యాయశాఖమంత్రిగా వేశాడు. తన బావమరిది, ఒడంబడిక చేసుకొని వచ్చిన రాయబారవర్గ నాయకుడు అగు మెయిన్‌నవాజ్ జంగుకు ఆర్థిక విదేశాంగ శాఖల యిచ్చాడు. ఇండిపెండెంటు ప్రొగ్రెసివ్ పార్టీ పక్షమున మంత్రి పదవిని అంగీకరించి, పిమ్మట పార్టీ శిక్షణకు లోబడని కారణం వల్ల పార్టీనుండి తొలగింపబడిన పింగళి వెంకటరామారెడ్డిని ఉపప్రధానిగా నియోగించాడు. లింగాయతు పక్షమునకు చెందిన మల్లికార్జునప్పను, అనుక్షణం ఇత్తెహాదుల్మసల్మీను వారికి ప్రక్క తాళం వేస్తూ ఉండే బి. యస్. వెంకటరావును నిమ్న జాతి ప్రతినిధిగాను కాశిం రజ్వీ మనిషియైన జోషిని, స్టేటు కాంగ్రెస్ సభ్యత్వానికి రాజీనామా నిచ్చిన రామాచారిని హిందువుల ప్రతినిధులుగా తీసుకొన్నాడు. ఈ మంత్రివర్గంలో నిజాం అన్న హిందూ ముసల్మానులకు సమాన ప్రాతినిధ్యం లేదు. ముస్లిములే ఎక్కువ! హిందూ మంత్రులకు ముఖ్యమైన శాఖ ఒక్కటీ ఇయ్యబడలేదు. యూనియన్ ప్రభుత్వంవారు ఏర్పరచమన్న ప్రజాప్రభుత్వం హైదరాబాదులో యీవిధంగా రూపొందింది.

ఒడంబడికప్పుడు మౌంట్‌బ్యాటన్‌కు వ్రాసిన ఉత్తరంలో నిజాము, తనకు తక్షణమే ఆయుధాలు మందుగుండు సామగ్రి పంపవలసిందని, అవి లేకపోవటంవల్ల తన సైన్యం సైనిక శిక్షణ పొందటంలో అంతరాయం కలుగుతున్నదని వ్రాశాడు. ఒడంబడికప్రకారం ఆగస్టు 15 కు పూర్వం ఉన్న సైన్యకంటె ఎక్కువసైన్యాన్ని నిజాము ఉంచుకొనటానికి వీల్లేదు. కాని నిజాం, యీలోపుగా - సరిహద్దుప్రాంతాలనుండి పఠానుల, యితర ప్రాంతాలనుండి తదితర ముసల్మానుల రప్పించి తన సైన్యాన్ని ఎక్కువ చేశాడు. ఇది ఇండియా ప్రభుత్వానికికూడా తెలిసింది. అందుచేత నిజాం సైన్యాన్ని తనిఖీ చేస్తేనే కాని, ఆయుధాల సరఫరా వీలుకాదని వ్రాసినట్లు తెలుస్తుంది. అంతేకాక నిజాం సైన్యం, పోలీసులు రజాకార్లకు సహాయంగా చేస్తున్న పనులు అందరికీ తెలిసినాయి. సంస్థానానికియిచ్చే పెట్రోలులో అధికభాగం రజాకార్లకు ఉపయోగపడుతున్న సంగతి తెలిసింది. ఈ క్రొత్త ఆయుధాలు ఎక్కడికి వెడతాయో, ఎల్లా ఉపయోగింపబడతాయో కూడా అందరికీ తెలిసిన విషయమేకాని, హైదరాబాదులోని ఇత్తెహాదు పక్షపత్రికలు బొలారంనుండి భారతీయ సైన్యాన్ని తక్షణమే ఇండియాప్రభుత్వం ఉపసంహరించుకోవాలని,కమ్యూనిస్టు దాడులను అరికట్టడానికి నిజాం సైన్యానికి ఇండియా ఆయుధాల ఒడంబడిక ప్రకారం సప్లయి చేయవలసిందని వ్రాయసాగినాయి. ఎంతసేపూ హైదరాబాదు ప్రభుత్వం ఒడంబడికవల్ల వచ్చే సదుపాయాలనన్నీ పొందాలనేకాని తన విధుల నెరవేర్చే ధోరణిలో లేదు.

ఆగస్టు 15 కు పూర్వం, తాత్కాలిక, లేక యథాతథపు ఒడంబడిక జరిగిన తర్వాతకూడా ఇండియన్ యూనియన్ రూపాయలు సంస్థానమంతటా చలామణీ అవుతుండేవి, అట్లుకాకుండా చేయటానికి నిజాంప్రభుత్వానికి ఒడంబడిక ప్రకారం ఎట్టి హక్కూ లేదుకాని, ఆర్థిక శాఖా మంత్రి మొయిన్ నవాజుజంగు యీ విషయం కూడా తన కార్యదర్శికి తెలియకుండా డిప్యూటీ కార్యదర్శియైన తారపారవాలా సహాయంతో సంస్థానమంతా ఇండియా నాణెముల చలామణీని నిషేధిస్తూ ఆర్డినెన్సు నొకదానిని అమలు పరిచాడు. సంస్థానంనుండి బంగారం, వెండి మున్నగు విలువైన లోహములు, యితర వస్తువుల బయటకు తీసుకుపోరాదని యింకొక శాసనం అమలులోకి తీసుకువచ్చారు. దీనివల్ల భయభ్రాంతులై బయటపోతున్న హిందువుల స్త్రీల ఒంటిమీద పెట్టుకొన్న నగలు కూడా పోకుండాచేశారు. తరువాత రజాకార్లు, స్టేషనులలో బయటను పోతున్న హిందువుల పెట్టెలు, పక్కచుట్టలు సోదా మాడడం-మెళ్లలో ఉన్న వాటిని బలవంతంగా లాక్కొనటం పరిగింది. పోలీసులుచూస్తూ ఊరుకొనేవారు. ఇంతటినుండి ఒడంబడికకు వ్యతిరేకంగా తాము చేస్తున్న వాటిని.సమర్థింకొనటం-ఇండియన్ యూనియన్ ఒడంబడిక షరతుల నెరవేర్చటం లేదని దానిని ఆడిపోయటంహైదరాబాదులో పరిపాటయింది.

ఒడంబడిక ప్రకారం నిజాం ఢిల్లీలో తన ఏజంటు జనరలుగా నవాబు జెయిన్ యార్జంగు బహదూరును నియోగించాడు. యూనియన్‌లో ప్రభుత్వం క. యం. మున్షీని హైదరాబాదులో తమ ఏజంటు జనరలుగా నియోగించింది.

ఇండియా ఏజంటుజనరలుగా మున్షీ హైదరాబాదు వచ్చి ఎక్కడ ఉంటాడా అన్నది ఒక గడ్డు సమస్య అయింది. సాధారణంగా అందరూ ఇండియా ప్రభుత్వానికి చెందిన రెసిడెన్సి బిల్డింగ్‌లో ఉంటాడనుకున్నారు. కాని అది నిజాంకు ఇత్తెహాదుల్మస్లిమీన్ వారికి రుచింపలేదు. మున్షీ రెసిడెన్సీ బిల్డింగులో కొద్ది రోజులైనా ఉంటే అతనికి రెసిడెంటు అధికారాలు సంక్రమిస్తాయేమోనని నిజాం మున్నగు వారు భయపడినట్లు తోస్తుంది. నిజాము, గవర్నరు జనరలుకు యీవిషయంలో తన అభ్యంతరం తెలియజేస్తూ టెలిగ్రాం యిచ్చాడు. కొద్ది రోజులైనా మున్షీ హైదరాబాదు రెసిడెన్సీలోగాని, బొలారంలో ఉన్న రెసిడెన్సీలోగాని ఉండటం హైదరాబాదు ప్రజలకు యిష్టంలేదని, ఆ ప్రజలు యీ విషయంలో ఉద్రేకపూరితులై లౌతున్నారని వ్రాశాడు.ప్రజాభిప్రాయమన్నా, ప్రజలన్నా నిజాంకు ముస్లిం ప్రజాభిప్రాయము-అందులో ముఖ్యంగా ఇత్తెహాదుల్ ముసల్మీనుకు చెందిన ముస్లిం ప్రజాభిప్రాయమే - ప్రజలంటే ముస్లింప్రజలే. మౌంట్‌బ్యాటన్ గట్టిగా జవాబిస్తేనేగాని నిజాం సద్దుకోలేదు. మున్షీ వచ్చి బొలారంలోఉన్న దక్షిణ సదనంలో (Dccan House) లో బసచేశాడు. మున్షీరాక హైదరాబాదు ప్రజలకు ధైర్యస్థైర్యములు కలుగచేసింది. తమ కష్టనిష్ఠూరాలను చెప్పుకొనటానికి ఒకమనిషి దొరికాడు. హిందువులు మున్షీకి బ్రహ్మాండమైన స్వాగతం యిచ్చారు. ఇది ఇత్తెహాదువారికి కంటికింపుకు కారణమైంది. ఒడంబడిక క్రింద యితర దేశాలలో వర్తక ఏజంట్లను నియోగించుకొనటానికి హైదరాబాదుకు కలిగిన హక్కును తారుమారుగా అర్థంచేసుకొని మున్షీ ఇండియా యూనియన్ తరఫున హైదరాబాదులో వర్తక ఏజంటని, తన హోదాను మరచి మున్షీ ఒక జాతీయ నాయకుడుగా వ్యవహరిస్తున్నాడని, ఇది ముస్లిములు అంగీకరించజాలరని పత్రికలలో విమర్శిస్తూ వ్రాశారు.

సరిహద్దు సంఘటనలు హెచ్చసాగినాయి. యూనియన్ ప్రజలు హైదరాబాదు గ్రామాలపై దాడులు సలుపుచున్నారని హైదరాబాదు ప్రభుత్వం అనసాగింది. రజాకర్లు, ముస్లిం గుండాలు,నిజాం సైనికుల పోలీసుల సహాయంతో సంస్థానంలోని గ్రామాల దోచుకొని ప్రజల నానా హింసలు పెట్టటంతో తృప్తిపడక హైదరాబాదు సరిహద్దుకు దగ్గరగాఉన్న యూనియన్ గ్రామాలపై దాడి చేస్తున్నారని, ప్రజల బంపుచున్నారని, ఆస్తులు దోచుకుంటున్నారని ఇండ్లతగుల బెట్టుతున్నారని ఇండియా ప్రభుత్వం ప్రకటించింది. మున్షీ హైదరాబాదు ఉద్యోగిని వెంటబెట్టుకొని మునగాలప్రాంతాలకు విచారణకు వెళ్ళినాడు. విచారించి తన రిపోర్టు ఢిల్లీ ప్రభుత్వానికి పంపినాడు. పిమ్మట మద్రాసు ప్రభుత్వం కమ్యూనిస్టులయెడ అవలంబించిన వైఖరి ఫలితంగా మునగాల ప్రాంతాలలో చాలమంది కమ్యూనిస్టులు అరెస్టుచేయబడ్డారు. దాంతో కమ్యూనిస్టుల దాడులు తగ్గినాయి. కాని రజాకార్ల నిజాంపోలీసుల దాడులు తగ్గలేదు. నానాటికీ పరిస్థితులు విషమించ మొదలుపెట్టినాయి. జనవరి ఆఖరివారంలో లాయకలీ-సరిహద్దు సంఘటనల విషయం, ఇండియా హైదరాబాదులమధ్య శాశ్వతమైన ఒడంబడిక గావించుకొనే విషయం చర్చించటానికి ఢిల్లీ వెళ్లినాడు. అక్కడ నెహ్రూ, మౌంటుబ్యాటనుల,పటేలలును కలుసుకొని గాంధి దర్శనం చేసుకొన్నాడు. మరల కలుసుకొనే లోపలనే గాంధీ హత్య జరిగింది. లాయకలీ హైదరాబాదు వచ్చేశాడు.

అంతకుముందు లాయకలీతోపాటు కాశిం రజ్వీ కూడా ఢిల్లీకి వెళ్లినాడు. హైదరాబాదు పత్రికలలో రజ్వీని సర్దారు పటేలు ఆహ్వానించాడని ప్రకటింపబడింది. రజ్వీ కూడా అల్లాగే అన్నాడు. కాని తర్వాత, నిజాం మంత్రివర్గంలో మంత్రిగా ఉన్న జోషి అనే ఒక గుజరాతీద్వారా సర్దారు పటేలుకు కలుసుకొనటానికి అనుమతి సంపాదించుకొన్నాడని, పటేలు ఆహ్వానం యిచ్చిన మాట,అబద్ధమని ప్రకటింపబడింది. కాశిం రజ్వీకూడా మహాత్ముని దర్శించాడు. మహాత్ముడు రజ్వీతో హైదరాబాదు రాజ్యంలో శాంతి నెలకొల్పవలసిందని కోరాడు. శాంతి నెలకొల్పటమే, తన జీవిత పరమావధి అని రజ్వీ అన్నాడట ! జ్వీని, అతని రజాకార్లను ఎరిగినవారు, మహాత్ముని నోట వచ్చిన 'శాంతి' అనే మాటకు, రజ్వీ ధ్యేయమైన శాంతికీ స్వర్గనరకముల కున్నంత తేడా అని ఎరుగుదురు.

మహాత్ముని హత్యవల్ల ఆగిపోయిన సంభాషణల కొనసాగించటానికి లాయకలీ మళ్లా ఢిల్లీ వెళ్లాడు. సంభాషణలు జరిగినట్లు కనపడుతుంది. కాని ఫలితం తేలలేదు. రజాకార్ల దారుణాలు హెచ్చినాయి. బొంబాయిలో అఖిలభారత కాంగ్రెసు సంఘం హైదరాబాదు కాశ్మీరుల విషయమై చర్చించటానికి రహస్య సమావేశం జరిపింది. ప్రధాన మంత్రి నెహ్రూ యిచ్చిన జవాబుతో సభ్యులు తృప్తిపడినట్లు తోస్తుంది. విశాఖపట్టణంలో మాట్లాడుతూ నెహ్రూ హైదరాబాదు సమస్య ఒక పెద్ద విషయంకాదని, తలచుకుంటే ఇండియాప్రభుత్వం అల్పకాలంలోనే దానిని పరిష్కరించగలదని కాని వీలైనంతవరకు శాంతి మార్గాన పరిష్కరించటానికి అభిలషిస్తుందన్నాడు హైదరాబాదు ఇండియన్ యూనియన్‌లో చేరట మన్నది సమస్య కాదని ప్రైవేటు సైన్యమైన రజాకార్ల సంస్థను నిజాం నిషేధించాలని, సంస్థానంలో బాధ్యతాయుత ప్రభుత్వాన్ని నెలకొల్పాలని, హైదరాబాదు ఇండియన్‌యూనియన్‌లో చేరటమా, చేరకపోవుటా అన్నవిషయం ఆ సంస్థాన ప్రజలే నిర్ణయిస్తారని ఇండియా ప్రభుత్వం నిజాం ప్రభుత్వమునకు స్పష్టముచేయసాగినది. కమ్యూనిస్టుల దాడుల ఎదుర్కొనటానికి ఇండియా ప్రభుత్వం ఆయుధాల నియ్యనందువల్ల రజాకార్లు అవసరమయ్యారని, ఆయుధాల నిస్తే యూనియన్ ప్రాంతాలనుండి కాంగ్రెసు కమ్యూనిస్టు గుండాలు దాడి చేయకుండా చేస్తే రజాకార్లు వారంతటవారే మాయమవుతారని నిజాం ప్రభుత్వం జవాబిచ్చింది. హైదరాబాదులో రాజ్యం చేస్తున్నది నిజామా, లేక కాశిం రజ్వీయా అని సందేహం కలుగుతుందని, రజాకార్ల దుండగాలు నిజాం అరికట్టకపోతే

ఇండియాప్రభుత్వమే తగిన చర్య తీసుకోవలసి వస్తుందని ఇండియాప్రభుత్వ మంది.

మాంక్టన్ మరల లండన్‌నుండి వచ్చి, మౌంటుబ్యాటన్‌ను కలుసుకొని హైదరాబాదు వచ్చి మళ్లా ఢిల్లీ వెళ్ళి అక్కడనుండి లాయకలీని పిలిపించుకొన్నాడు. మళ్ళా సంభాషణలు మొదలైనాయి. లాయకలీ నెహ్రూను, గవర్నరు జనరలును, సంస్థాన శాఖా కార్యదర్శిని మీనన్‌ను కలుసుకొన్నాడు. శాశ్వత ఒడంబడికకు కొన్ని సూచనల లాయికలీ కోరిక మీద మీనన్ నోట్సుగా వ్రాసియిచ్చాడట. వాటిని తీసుకొని లాయికలీ హైదరాబాదు వెళ్లాడు. అక్కడ మంత్రుల సమావేశాలు, నిజాంతో సంప్రదింపులు, ఇత్తెహాదుల్ముసల్మీను వారి స్థాయిసంఘ సమావేశం-అన్నీ జరిగినాయి. కాని, 'ఎక్కడ ఉన్నావో గొంగడీ అంటే వేసిన చోటనే' అన్న సామెత ప్రకారం జరిగింది. లాయకలీకి మిగతా మంత్రులతోను నిజాముతోను మాట్లాడుటకు అనుకూలంగా ఉండటానికి మీనన్ యిచ్చిన నోట్సును తల తోక మార్చి ఇండియాప్రభుత్వం హైదరాబాదుకు యిచ్చిన ప్రతిపాదన లని హైదరాబాదులోని ఇంగ్లీషు దిన ప్రతిక మీజాన్ ప్రకటించటం జరిగింది. ఇండియా ప్రభుత్వం తామ ట్టి ప్రతిపాదనలు గావించలేదని, తాను కోరే విషయాలు - రజాకార్ల నిషేధం, బాధ్యతాయుతప్రభుత్వ స్థాపన, ఇండియన్ యూనియన్‌లో చేరటో, చేరకపోవుటో ప్రజాభిప్రాయం ప్రకారం నిర్ణయింపబడాలన్న యీ మూడేనని స్పష్టపరిచింది.

మే మధ్య భాగంలో లాయకలీ మళ్లా ఢిల్లీ వెళ్ళవలసిఉంది. కానీ రజాకార్ల సంస్థ నిషేధించి, సంస్థానంలో ప్రజాప్రభుత్వం ఏర్పాటు చేస్తేనేగాని ఢిల్లీకి వెళ్లి లాభం లేదనుకున్నారు. నిజాంమాత్రం క్రొత్త ఫర్మానా నొకదానిని ప్రసాదించాడు. అది అంతా అస్పష్టంగా ఉంది. హిందూ ముసల్మానులమధ్య సమాన ప్రాతినిధ్యం విషయం వదలిపెట్టలేదు. రాజ్యాంగ పరిషత్తు నొకదానిని ఏర్పరచటానికి లాయకలీకి అధికారం యిచ్చారు. లాయకలీ తరువాత రేడియోలో ప్రసంగిస్తూ, అంతవరకు, మంత్రివర్గంలో చేరని పార్టీల వారినికూడా మంత్రివర్గంలో చేర్చుకొనటానికి ప్రయత్నిస్తానని, సర్వపక్షసమావేశాన్ని జరుపుతానని ఏదో ఏదో మాట్లాడినాడు. కాని స్టేటుకాంగ్రెసు అధ్యక్షుని విడుదల చేయలేదు. అతనితో సంభాషణలు ప్రారంభించ లేదు. సంస్థానంలోని పరిస్థితులు విషమతర మైనాయి. నగరం పాడుపడిపోయింది. రజాకార్లు రైళ్ళ మీద పడి దోచుకోవడంకూడా మొదలు పెట్టినారు. మద్రాసు బొంబాయి మెయిలును దోచుకొన్నారు. రజాకార్ల దారుణకృత్యాలకు ఏవగించుకొని, నిజాంప్రభుత్వంవారిని అరికట్టకుండా ఉన్నందుకు కంటకించుకొని జే. రామాచారిగారు మంత్రివర్గంనుండి రాజీనామా యిచ్చేశారు. మార్చి నెలాఖరుకు భారతసైన్యాలు బొలారంనుండి తీసివేయబడినాయి. రెసిడెన్సీ బిల్డింగు నిజాంకు అప్పగింపబడినది. ఇండియా ప్రభుత్వం, ఒడంబడిక షరతులు తూ, చా తప్పకుండా చెల్లించింది. పాకిస్తానుకు హైదరాబాదు యిచ్చిన అప్పు సంగతి బయుపడగానే అది ఒడంబడికకు విరుద్ధమని ప్రకటించింది. లాయకలీ కరాచీ వెళ్ళి పాకిస్తాను ప్రభుత్వంనుండి యథాతథపు ఒడంబడిక అమలులో నున్నంతకాలము ఇండియా సెక్యూరిటీల వారు వినియోగింపకుండా ఉండేటట్లు వాగ్దానం పొంది వచ్చాడు.

కాశింరజ్వీ రజాకార్ల సంస్థ బలవత్తరం చేయసాగినాడు. విదేశపత్రికారచయితలను ఆహ్వానించి వారికి రజాకార్లప్రదర్శనములు చూపించసాగినాడు.

హైదరాబాదు స్వాతంత్ర్యమునకు విదేశీయుల సానుభూతిని సంపాదించటమే అతని ఉద్దేశం. ఇండియా యూనియన్‌లో ఉన్న ముసల్మానులందరు. హైదరాబాదు గూఢచారులుగా పనిచేస్తారన్నాడు. ఇట్టి ఉపన్యాసం రహస్యసమావేశంలో చేసింది ఒకటి - ఇండియాప్రభుత్వానికి అందింది. కాశింరజ్వీ తాను ఆనాడు ఉపన్యాసమే చేయలేదన్నాడు. లాయకలీ రజ్వీ నిజంచెప్పుతున్నాడన్నాడు. కాని యిద్దరూ అసత్యం చెప్పినట్లు రుజువైంది.

జూన్ నెలలో లాయకలీకి నెహ్రూ దగ్గర నుండి ఢిల్లీరమ్మని టెలిగ్రాము వచ్చిందని, ఆయన ఢిల్లీ వెళ్లుతున్నాడని హైదరాబాదు పత్రికలు ప్రకటించినవి. తరువాత లాయకలీకి నెహ్రూ టెలిగ్రాం ద్వారాగాని, టెలిఫోనులోగాని రమ్మన్నది అబద్ధమని తేలింది. ఢిల్లీలో నిజాం ఏజంటు జనరలుగా ఉన్న జయిన్‌యార్జంగు దెహరాదూన్‌లో పటేలును, నెహ్రూ మౌంటుబ్యాటన్‌లు కలుసుకొన్నప్పుడు హైదరాబాదు విషయమై ఏదో ఒక నిర్ణయానికి వస్తారని తెలుసుకొని లాయకలీని పిలిపించి ఉండవచ్చును. లాయకలీ నెహ్రూను, గవర్నరు జనరలును, మీనన్‌ను కలుకొని మళ్ళీ హైదరాబాదు వచ్చాడు. హైదరాబాదులో జరిగిన చర్చల ఫలితంగా లాయకలీ కొన్ని ప్రతిపాదనల నిజాంప్రభుత్వం తరఫున ఢిల్లీకి తీసుకొని వెళ్లాడు. అందులో ముఖ్యమైంది— హైదరాబాదు ప్రభుత్వం, హైదరాబాదు ఇండియన్ యూనియన్‌లో చేరటం, చేరకపోవటం విషయం ప్రజాభిప్రాయంప్రకారం నిర్ణయింపబడటానికి ఒప్పుకొనటం. ప్రజాభిప్రాయానికి కట్టుపడటానికి హైదరాబాదుప్రభుత్వం, కాశింరజ్వీ ఎల్లా ఒప్పుకొన్నారా అని సందేహం తోచవచ్చు —అందులోను నూటికి 85 మంది హిందువులున్నప్పుడు. దీని మర్మ మిది ప్రజాభిప్రాయాన్ని తెలుసుకొనటానికి కనీసం రెండు సంవత్సరాలైనా గడువు కోరాలని, రెండు సంవత్సరాలను చేరమాడితే-కడకు ఆరునెలలైనా దొరుకుతుందని, ఈఆరునెలలలో ప్రజాభిప్రాయాన్ని తమకు పూర్తియైన అధికారాలు యిస్తే, ఎల్లా మార్చమంటే అల్లా మార్చటానికి నిజాం ప్రభుత్వోద్యోగులు మాట యిచ్చారని తెలిసింది. ఒకవేళ ఇండియా యూనియన్ ఇందుకు ఒప్పుకోకపోతే, ప్రజలే తమ భవిష్యత్తును నిర్ణయించుకోవాలన్న సూత్రం మీదున్న నెహ్రూ మున్నగువారిని అపకీర్తిపాలు చేయవచ్చునని ఆశ

నిజాం ప్రభుత్వం తీసుకువెళ్ళిన ప్రతిపాదనలు తోసివేయబడినాయి. లార్డు మౌంటుబ్యాటన్ తాను వెళ్లకముందే హైదరాబాదు సమస్యను పరిష్కరించాలన్న కోరికతో ప్రయత్నాలు మొదలుపెట్టినాడు. సర్ వాల్టర్ మాంక్టన్, మీనన్, నెహ్రూ, మౌంటుబాటన్, లాయకలీల సంప్రతింపుల ఫలితంగా జూన్ 17 వ నాటి ప్రతిపాదనలు సిద్ధమైనాయి. హైదరాబాదు ప్రతినిధులు కూడా అన్నిటికీ అంగీకరించారు. చివరకు సంతకం పెట్టటానికికూడా అధికారం ఉన్నవారిలాగనే వ్యవహరించారు. కాని వేళకు ఒక్కసారి హైదరాబాదు వెళ్లి నిజామునకు చూపించి సంతకం తీసుకువస్తామన్నారు. లోకమంతా ఒడంబడిక కుదిరింది అనుకున్నారు. లాయకలీ ఆనాటిరాత్రికే ఢిల్లీ వస్తానన్నాడు.

హైదరాబాదుకు రావటంతోడనే రంగం మారిపోయింది. నిజాం ప్రతిపాదనల చూసి అందులో కొన్నిటిని నీ వెల్లా ఒప్పుకొన్నావని డబాయించితే, లాయకలీ తనకు అవి అర్థం కాలేదనీ తనకు తెలియకుండా అందులో ఆ విషయాలు చేర్చబడ్డాయనీ అన్నాడట. లాయకలీ రాత్రికే ఢిల్లీ చేరు ఆశలు పేన్నగిల్లినాయి. పన్నెండు గంటలు వ్యవధి నియిండియా ప్రభుత్వం నుండి బడసినాడు. మరునాడు ప్రతిపాదనలలో సవరణల సూచిస్తూను, తమ వాళ్లకు తెలియకుండా క్రొత్తవిషయాలు చేర్చబడ్డాయన్న నేర మారోపిస్తూ టెలిగ్రాము పంపినారు. మాంక్టన్ ఢిల్లీనుంచి వచ్చాడు. హైదరాబాదు ప్రతినిధులకు తెలియకుండా ప్రతిపాదనలలో క్రొత్త విషయాలు చేర్చబడలేదని, ఒడంబడికను తయారుచేసింది తానేనని, అందులో తనకు అర్థం కానిది లేదని చెప్పటానికి, వీలైతే నిజాంతో ప్రతిపాదనల అంగీకరించటమే అతనికి క్షేమకరమని చెప్పి చూడటానికీ వచ్చాడు. నిజాం ప్రతిపాదనలను తన మంత్రులు అంగీకరించనందున తా నంగీకరించజాల నన్నాడు. నిందారోపణలకు క్షమాపణ అడుగుతూ నెహ్రూకు టెలిగ్రాం పంపినాడు.

నిజాంనుండి జవాబు వచ్చిన తర్వాత నెహ్రూ పత్రికా సమావేశంలో ప్రతిపాదనలు బయట పెట్టాడు. ఇంక హైదరాబాదుతో సంప్రతింపులు లేవన్నాడు. నిజాము - అంగీకరిస్తే ఆ ప్రతిపాదనలనే అంగీకరించి సంతకం పెట్టాలన్నాడు. నిజాం ప్రభుత్వం నుండి మళ్లీ సంప్రతింపులకు రావటానికితాము సమ్మతంగా ఉన్నట్లు టెలిగ్రాము వచ్చింది. కాని నెహ్రూ అందుకు యిక అవకాశం లేదన్నాడు. తన పదవీ విరమణ ముందు మౌంట్‌బాటన్ ప్రతిపాదనల అంగీకరించవలసిందని టెలిగ్రాము యిచ్చాడు. కాని లాభం లేకపోయింది.

ఒకసారి నిజాం నిరాకరించిన ప్రతిపాదనలపై ఎప్పుడైనా సంతకం పెట్టవచ్చు ననటం బాగుండలేదని, ఆ ప్రతిపాదనలు నెహ్రూ ఉపసంహరించుకొన్న బాగుండేదని చాలమంది విమర్శించారు. పాటియాలా యూనియన్ ప్రారంభోత్సవములో మాట్లాడుతూ సర్దారు పటేలు ఆ పని కానిచ్చాడు. లార్డు మౌంటుబ్యాటన్‌తో జరిగిన సంప్రతింపులు, అప్పటి ప్రతిపాదనలు ఆయనతోనే పోయాయని, హైదరాబాదు యితర సంస్థానాలవలెనే ప్రవేశపత్రంమీద సంతకం పెట్టి ఇండియన్ యూనియన్‌లో చేరవలసి ఉంటుందని, సంస్థానంలో బాధ్యతాయుత ప్రభుత్వం నెలకొల్పటకంటె గత్యంతరం లేదని స్పష్టంగా చెప్పివేశాడు. అంతటితో ఇండియా హైదరాబాదులమధ్య సంప్రతింపులు పూర్తిఅయినాయి.

ఇద్దరిలో ఎవరో ఒకరు లొంగకపోతే ఇండియా హైదరాబాదు సంప్రతింపులు సఫలీకృతం కాజాలవని యిద్దరి దృక్పథములు బాగా తెలిసినవారు మొదటినుంచి అనుకుంటూనే ఉన్నారు. ఇండియన్ యూనియన్ వందలాది సంస్థానాల తనలో ఐక్యం చేసుకొన్నది. ప్రజాప్రతినిధులచే పాలింపబడుతున్నది. అట్టిది, తనమధ్య హైదరాబాదులాంటి సంస్థానాన్ని స్వతంత్రంగా ఉండనీయటం అసంభవం. నెహ్రూ ఎన్నోమారులు యిది స్పష్టంచేశాడు. స్వతంత్రభారతదేశంలో స్వతంత్ర హైదరాబాదు ఉండజాల దన్నాడు. భారతదేశం నశించితేనే నిజాము స్వతంత్రుడుగా ఉండగలడన్నాడు. ఇక నిజాం, తన ప్రజలకు సర్వాధికారా లిచ్చే ప్రజాప్రభుత్వంలో ఇంగ్లండులో రాజులాగ ఉండటానికి సిద్ధంగా లేదు. బ్రిటిషు వారి కిచ్చినట్లే రక్షణ, రాకపోకలు, విదేశవ్యవహారాలు ఇండియా యూనియనుకు యియ్యటానికి సిద్ధం, కాని సంస్థానంలో తనమాటే చెల్లాలంటాడు ప్రజాప్రతినిధులైన ఢిల్లీ మంత్రులు దీని కెల్లా ఒప్పుకోగలరు? సంస్థానంలోని ముస్లిములకు ప్రజాప్రభుత్వంలో వారికి యిప్పుడుండే పదవులు హోదాలన్నీ పోతాయని తెలుసు. అందుచేత వాళ్ళు నిజాం ప్రక్కన చేరేరు. ఇండియా ప్రభుత్వానికి గర్భశత్రువైన పాకిస్తాను ఉండనే ఉంది. ఇత్తెహాదుల్ముసల్మీన్ వారు పాకిస్తాను నాయకుల సలహా లేకుండా ఒక్క అడుగైనా ముందుకు వేయలేదు. ఢిల్లీ ప్రతిపాదన లేవైనా సరే, పాకిస్తాను ఒప్పుకోమంటేనే వారు ఒప్పుకొనేది - వారు ఒప్పుకుంటేనే నిజాం ఒప్పుకొనేది. పాకిస్తాన్ సహాయంతో ఇతర దేశాల నుండి రహస్యంగా ఆయుధాల తెప్పించుకొంటున్నారు. ఈ విధంగా హైదరాబాదు యుద్ధానికి సిద్ధమైన తర్వాత తూర్పు పశ్చిమ పాకిస్తానులు హైదరాబాదు ఇండియా మీద పడి జయించి, మరల హిందూస్థానములో ముస్లిం సామ్రాజ్యం స్థాపించాలని వారి ఆశ. కాలం మారింది. ఇది పిచ్చికల అంటే, మొన్నటి వరకు ఇండియాను పాలించిన బ్రిటిషువారి జనసంఖ్య ఎంత అంటారు వారు.

ఒక్కటి మాత్రం నిజాం. హైదరాబాదులో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వానికి మంచి మాటలతో చెప్పితే అర్థం కాదు. మర్యాదను, మంచితనాన్ని వాళ్ళు బలహీనతలని నమ్ముతారు. నెహ్రూ అన్న సైనికచర్యయే (Military Action) వారికి అర్థమయ్యేది. హైదరాబాదు ప్రజలను కష్టాలనుండి గట్టెక్కించే ఆ సైనికచర్య ఎప్పుడో!

భారత రాజకీయాలు

(9 వ పేజీ తరువాయి)

విషయమై ఈ మధ్యనే నిర్ణయం జరిగింది. కాందిశీకు లందరికి శాశ్వత ఏర్పాట్లు ఈ సంవత్సరంలోగానే జరుగునని ఆశించవచ్చును.

* *

సైనికంగా మనదేశం ఎంతో అభివృద్ధిజెందవలసివున్నది. యుద్ధపరిశ్రమలను ఏర్పాటుచేయటానికీ, సేనలసంఖ్య వృద్ధిచేయటానికీ జరుగవలసినంత తీవ్రకృషి గత సంవత్సరం జరగలేదు. కాశ్మీర్‌లో ప్రత్యక్షంగా పోరాటం జరుగుచుండుటయే ఇందుకు కారణం కావచ్చును. కాశ్మీర్‌లో యుద్ధంజరుగుచున్నా సరే, ఈ సంవత్సరం ఈ విషయమై ఇతోధికకృషి చేయాలి.

విద్య, ఆరోగ్యము, వ్యవసాయము మొదలగు జనశ్రేయోభివృద్ధి కార్యక్రమం, ఆశిలో ఆశించినంత చురుకుగా గత సంవత్సరం అమలు జరుగలేదు. ఈ శాఖలన్నిటికి నేరుగా కేంద్ర ప్రభుత్వం గాక రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహిస్తున్నవి. రాష్ట్ర ప్రభుత్వాల కార్యకలాపాలను సమీక్షిస్తూ అభివృద్ధి కార్యక్రమం చురుకుగా అమలు జరిగేటట్లు, ఈ సంవత్సరమైనా, కేంద్ర ప్రభుత్వం శ్రద్ధవహించాలి.

భారత ప్రభుత్వం రాజకీయంగా, గత సంవత్సరం కన్న రానున్న సంవత్సరమే ఎక్కువ చిక్కు సమస్యలను పరిష్కరింపవలసివచ్చును. గత సంవత్సరం పొందిన అనుభవంతో ఈ సమస్యలను మనప్రభుత్వం సక్రమంగా పరిష్కరించగలదని ఆశించవచ్చును.

'కొణిదెన' తెలుగు చోడచక్రవర్తియే:

నన్నిచోడమహాకవి

శ్రీ కోన వేంకటరాయశర్మ

నన్నిచోడడు తన తండ్రి పాకనాటియం దిఱువదియొక్క వేయిటి కధీశుడగు చోడబల్లి యనియు, తల్లి హైహయాన్వయాంబర శశిరేఖయైన శ్రీ సతి యనియు చెప్పికొని తాను—

"కలంపొన్న విరులం జేరుగం
గలం కోడి రవంబు దిశల గలయగ జెలగ
న్నొలుచు నొరయూరి కధిపతి
వలఘు పరాక్రముడ టెంకణాదిత్యుండన్."

అని వ్రాసికొనినాడు. తెలుగుచోడులం పాకనాటిని బరిపాలించుచుండగా, ప్రక్కనున్న పలనాటిని హైహయాన్వయు లేలుచుండిరి. ఇఱు తెగలవారికి సంబంధ బాంధవ్యము లుండెడివి. పలనాటి వీర చరిత్రమున వర్ణితు లయిన నలగామరాజు మున్నగువారు హైహయాన్వయులే. తెలుగు చోడరాజుల పూర్వులం పూర్వము దక్షిణదేశమును జయించి 'దక్షిణదేశమునకు సూర్యుడు'—అను నర్థ మిచ్చు 'టెంకణాదిత్య' బిరుదమును వహించుచు, కావేరీతీరమున గల 'ఒరయూరు' రాజధానిగా జాలకాలము దక్షిణదేశమును బరిపాలించినట్లు ఐతిహ్యములు, శాసనాద్యాధారములుగూడ గలవు.

కావున నొరయూరుపురాధిపత్యము, 'టెంకణాదిత్య' బిరుదము, మన నన్నిచోడ మహారాజు కవికుల క్రమాగత మర్యాద ననుసరించి చెప్పికొనినదేగాని 'కుమారసంభవ' రచనాకాలము నాటికి అతడు దక్షిణదేశమున నొరయూరు పరిపాలించుచు నప్పటనే గ్రంథమును వ్రాసె ననుటకు బొసగదు. తండ్రి చోడబల్లి తెలుగుదేశమున పాకనాడు పరిపాలింపగా, నన్నిచోడడు తండ్రి రాజ్యము నేగాక దక్షిణదేశమును గూడ బరిపాలించె ననుట యసంగతము.

కాబట్టి నన్నిచోడడు నాతని తండ్రి చోడబల్లియు పాకనాడు పరిపాలించిన తెలుగు చోడుల సంతతివా రనుట కెట్టి సంశయమును లేదు. నన్నిచోడడు తన కావ్యమును దన గురువయిన జంగమ మల్లికార్జున యోగికి గృతి యొసంగి గ్రంథమం దతని మల్లికార్జున యోగి వనన్య సామాన్యమగు భక్తిప్రపత్తిని గనబఱచినాడు. గ్రంథావతారికయందును అంకితాంక పద్యములలోను మల్లికార్జునయోగికి గూర్చిన విశేషణములం బట్టి యాతడు బ్రహ్మచారి యనియు, బ్రహ్మర్షి యనియు, శమదమ నియమాన్వితుం డగు పరమత పస్సంపన్నుడని తెలియుచున్నది. "జ్యుం భృశం గచ్ఛతీతిం గమః"—అని మల్లినాథుడు వివరించునట్లు మల్లికార్జున గురునకు జంగమోపపదమును చేర్చుటలో నన్నిచోడ మహాకవి భావమును గనిపట్ట వచ్చును.

తూర్పు చాళుక్య రాజగు రెండవ యమ్మరాజు క్రీ. శ. 945-70 నాటివాడు. ఇయ్యమ్మరాజు కాలమున పాశుపత మతాచార్యులు, కాలాముఖాచార్యులు, తూర్పు చాళుక్య రాజన్యులకు, తెలుగు చోడచక్రవర్తులకు, గురువులుగా నుండినట్లు 'తాడికొండ' శాసన మవగత మొనర్చుచున్నది. కాలాముఖాచార్యులలో బ్రసిద్ధుడయిన మల్లికార్జున యోగి దక్షిణదేశమున కాలాముఖమత స్థాపన మొనర్చి క్రీ. శ. 950 దవ సంవత్సర ప్రాంతమున నుండిన 'విక్రమకేసరి' యను చోడధరణీధవుచే నారాధింపబడినట్లు 'కొడుంబాలూరు' శాసన మెఱుంగ జేయుచున్నది.

కాకతీయ గణపతి చక్రవర్తికి సామంతుడుగా నుండిన రెండవ మల్లిదేవ చోడడు క్రీ. శ. 1260 దవ సంవత్సర ప్రాంతమున వెలయించిన "పెదచెఱుకూరు" (బాపట్ల తాలూకాలోనిది) శాసనముంబట్టి యతని పూర్వులలో నాతని కాఱవ తరమువాడగు నన్నిచోడ డొకడుండినట్లును, అతని తండ్రి చోడబల్లి యనియు విదితమగుచున్నది.

ఈ శాసనము ననుసరించి చోడబల్లి-నన్నిచోడ మహారాజులు క్రీ. శ. 1120-50 ప్రాంతమువా రగుదురు. క్రీ. శ. 1115 దవ సంవత్సరమున గామచోడుని పుత్రులు కన్నరచోడ-చోడబల్లి యను సోదరులు వెలయించిన 'కొప్పరము' శాసనమువలన బాలూరి నివాసి, కాలాముఖవ్రతస్థుడు నగు నొక మల్లికార్జున యోగి అ సోదరులచే సంభావితు డయినట్లు లగపడుచున్నది.

నన్నిచోడడు తరువాతికాలమువా డయ్యును సుప్రఖ్యాతుడు, మొదటి కాలాముఖాచార్యుడు నగు మల్లికార్జునునకే (క్రీ. శ. 950 దవ సంవత్సర ప్రాంతమువాడు), అతనియందలి గౌరవ భక్తి విశ్వాసముల బురస్కరించుకొని తన కావ్యము నంకితము సేసియుండు ననుటయం దతిశయోక్తి కాజాలదు.

ఇమ్మహాకవి తన గ్రంథమున వ్యాస, వాల్మీకి, కాళిదాస, భారవి, బాణుడు, ఉద్భటుడు—నను నార్వుర సంస్కృత మహాకవులనా పేర్కొనియున్నాడు. క్రీ. శ. 6-వ శతాబ్దమున గాళిదాస మహాకవి యుండెననియు, నుద్భటుడు క్రీ. శ. 780-820 ప్రాంతమున గాశ్మీరము నేలిన జయాపీడుని యాస్థానకవి యనియు, బాణుడు క్రీ. శ. 650 దవ సంవత్సర ప్రాంతమున గన్యాకుబ్జము నేలిన హర్షవర్ధను నాస్థానకవి యనియు, భారవి క్రీ. శ. 550-620 ప్రాంతమువాడనియు, జరిత్రకారుల యభిమతము. దీన నన్నిచోడ మహాకవి క్రీ. శ. 9-వ శతాబ్దికి దరువాతివాడని చెప్పదగును. 'కుమారసంభవ' మహాకావ్య అవతారికలో—

"మును మార్గకవిత లోకం
బున వెలయగ దేశికవిత బుట్టించె దెనుం
గు నిలిపి రంధ్రవిషయమున
జన సత్యాశ్రయుని దొట్టి చాళుక్యనృపుల్."

అను పద్యమును వ్రాసి యా పిదప నీ క్రింది పద్యమును—

"సురవరులం గ్రమంబున వ
చోమణి సంహతి బూజసేసి మ
ద్గురు చరణారవిందముల
కున్నగ సమ్మతి జేసి కొల్చి వి
స్తర మతులం బురాణకవి
సంఘము నుత్తమమార్గసత్కృపీ
శ్వరులను దేశి సత్కవుల
సంస్తుతి జేసి మనోముదంబునన్."

అను పద్యము నిబంధించి యున్నాడు. పదునాలవ శతాబ్దము పూర్వార్ధముననుండి 'శివయోగసారము' ను రచించిన కొలని గణపతి దేవుడు—

"అసమశివభక్తి గసమా
నసుడగు పాల్కురికి సోమనాథుని గవిరా
జ సమున్నతయశు సద్వి
ప్రసాది యను చక్రపాణి రంగన గొల్తున్."

అని యొక్క పద్యమునందె సోమనాథ రంగనాథుల నతడు వినుతించినాడు. కాని నన్నిచోడని పేర్కొనలేదు. క్రీ. శ. 1190 దవ సంవత్సర ప్రాంతమున 'బసవపురాణము' ను రచించి క్రీ శ. 1240 దవ ప్రాంతమువఱకు జీవించి యున్నవాడు. ఇతడు ప్రథమ ప్రతాపరుద్రుని కాలమున నున్నవాడని తోచెడిని. రెండవ ప్రతాపరుద్రుడు కాకతీయ సామ్రాజ్యమును గ్రీస్తు శకము 1195 దవ సంవత్సరము నుండి క్రీ. శ. 1226 వ సంవత్సరము వఱకును బరిపాలించినాడు.

తెలుగు చోడులకు 'కొణిదెన' (నరసరావుపేట తాలూకాలోనిది) రాజధానిగా నుండెను. వీ రనేక దేవాలయముల గట్టించి, పెక్కురకవుల నాదరించి, యనుశ్రుతము చిరంతనము నగు భాషాభిమానము ప్రేరేప వా రందఱు పద్యశాసనములనే వ్రాయించి కీర్తిదృశ్యకీస్సు నార్జించిరి.

ఈ రాజన్యుల మంత్రిసత్తములై యెన్నలే నికీర్తిని గడించినవారు రాయూరి యెల్లన, అతని తండ్రి తాతలు. అట్లని క్రీస్తు శకము 1158 దవ నాటి 'యమరావతీ' శాసనమందలిచా

"త్రిభువనగీతకీర్తి నర
దేవశిఖామణి కామధారుణీ
ప్రభుతనయుండు మాండలిక
భర్గుడు భర్గపదాబ్జషట్పదుం
డభినవరాము డర్యము కు
లాగ్రణి 'గుండియపూండి' భక్తితో
త్రిభువన మల్లదేవుడు ప్ర
తీతిగ 'శంభున' కిచ్చె బ్రీతితోన్".

"గడుపరి లోభి యర్థ మది
కన్న పుగానికి బందికానికి
న్నొడమికి నన్యకాంతలకు
భూపతికిం జను మంత్రి యన్న ని
న్నొడసిన యర్థ మిష్టులకు
బంధుజనాలికి దీనకోటికి
న్గుడులకు వారిసత్రముల
కుం జను శుద్ధచరిత్రప్రాంతమై."

అను పద్యము లవగత మొనర్చుచున్నవి. నన్నిచోడని మంత్రి శంభుడు. అన్న మంత్రియు తెలుగు చోడుల సచివాగ్రణియే! పై పద్యమందలి 'యన్ననిన్' అను చెనగు ద్వితీయా విభక్తి ప్రత్యయము పంచమ్యర్థ సూచకముగ 'వలన' అను నర్థమున బ్రయోగింపబడినదని యెఱుంగదగును.

ఈ శాసనమువలన శంభుమంత్రి త్రిభువనమల్ల దేవునిచే 'గుండియపూండి' యగ్రహారముం బడసె ననియు, నిమ్మంత్రిశంభుని కొమరుడగు నన్న మంత్రితా గడించిన యర్థము బంధుజనాలికిని, దీనకోటికిని, గుడులకును, సత్రములకును, ఇష్టులకును శుద్ధచరిత్ర ప్రాంతమై చనుచుండె ననియు, నిట్టి పావనచరిత్రులకు జన్మించినవాడే యగు నెల్లనమంత్రి కులక్రమాగతమ్మగు మంత్రి పదవిని దన పదునూడవయేటం బొంది, రాజకీయ, మత, వాఙ్మయ, భాషా విషయంబుల నభివృద్ధి యొనర్చి, యంతతో దనివోక, సర్వశాస్త్రముల గూలంకషముగ నభ్యసించి, సత్యవ్రతియై ధర్మరక్షకుండయి విలసిల్లె నని 'యమరావతి' శాసనమందలి—

"పదునూడేడులనా డమాత్యపదవిం
బ్రాపించి తత్సంపదా
సదుడై సత్కవిబంధుమిత్రిజనసం
పత్కారియై సాధు స
మ్మదశుద్ధప్రతిభా ప్రపంచితలస
న్మార్గస్థితి స్వాంతతా
భ్యుదయుండై విలసిల్లె నెల్లడు జగ
త్పూరాచ్ఛకీర్తిచ్ఛవిన్."

అను పద్యము రూఢిసేయుచున్నది. ఇతడు ప్రతిమ ప్రతిభావంతు డగుటచే గాబోలం పదునూడేండ్ల వయసునందె యమాత్య పదవిం బొందగలైను.


క్రీ. శ. 6-వ శతాబ్దమునుండియు శాసనముల లోని పద్య గద్యములలో నొప్పిదమగు కుదిరిక యలవడినది. కాగా, గ్రీస్తుశకము 1145 దవ సంవత్సరమునకు బూర్వ ముండిన యాద్య కవిత నిరుపమాన ధారా శుద్ధితో వెలుగొందుచు బక్వదశకు వచ్చినదని తెలిసికోదగి యున్నది. తెలుగు శాసనములలో విశిష్టము, రసవత్తరము నగు నాంధ్ర కవితను వెలయించిన యత్తేజోమూర్తుల స్మరింపవలసియున్నది.

నన్నిచోడుడు దన 'కుమారసంభవము' న నీశ్వరుని వివాహ మభివర్ణించెను. శివుడు రజతాద్రి నుండి శీతనగమునకు శుభప్రయాణముల జనుదేరగ, హిమవంతు డాతని రాక నెఱింగి పురము నలంకరింపించి, పరమేశ్వరున కెదురు సని, నమస్కరించి, తీసికొనివచ్చి పురప్రవేశము సేయించి, మఱునాటి యుదయమున శీతనగాధిపతి యీశ్వరునకు సుప్రభాతార్చనావిధి నభ్యర్పితు నొనర్చి, వేదవేదిహోమ కుండమై యుండ హైమవతిని మంగళస్నానంబు సేయించి, కైసేయ నియమించి, వివాహమండపమునకు రావించి, తన యారుపీఠంబున నుండగా నీశ్వరుడు అభ్యంగనోద్వర్తన స్నానానంతరమున నలంకరించికొని రాగా, బృహస్పతి "లగ్నం బాసన్న మయ్యె వేంచేయు"డని చెప్ప హోమద్రవ్యములతో బ్రహ్మయు, హేమదండ చామరములతో నింద్రోదులును, వెంట రాగా, వివాహమండపమునకు వచ్చి, వేదికాతలో పక్ష దుకూలాంబరాలంకృత మణిపీఠాసనాసీనుం డయియున్నంత, హైమవతియు దద్దంబు నలంకరించినంత, బృహస్పతి దత్త సుముహూర్తంబున బరమేష్ఠి కృతహోమ పురస్సరంబుగా విధివిహిత విధానంబున గిరీశుండు గిరిజను బరిణయంబయిన కథావిధానమును వర్ణింపుచు, సురలు గిరీశుని బ్రార్థించి మన్మథుని మరల బడయగా నతని పరిణయోత్సవముతో ననుంగు పున రవతరణోత్సవము నైకము ఆపత్తనవాను లత్యుత్సాహముతో జరిపినట్లు, జెప్పుచు వసంతోత్సవము నతి రమణీయముగా నభివర్ణించినాడు.


ఆంధ్ర వాఙ్మయమున వసంతోత్సవము నింత రమణీయముగ విస్తరించి వ్రాసినకవి యగపడడు. నన్నిచోడ మహాకవి ఇక్కథావర్ణనమున ప్రత్యేక వివాహ మంటపము నభివర్ణించు వైదిక లౌకిక వివిధార్థ వస్తుభరముచే వేదిక పొలుపొందునట్లు జేసినాడు.

ఇమ్మహారాజకవిశిఖామణి మహామాత్యులు, బుద్ధిమదగ్రగణ్యులు, అగు నెల్లనవంటి మంత్రిసత్తముల ప్రతిభావిశేషముల నూతగా గొనియేచ్ఛి సాగించును కుమారసంభవ కావ్యమును విరచించి, మనోజ్ఞ భావముల, హృదయంగమములగు శయ్యారీతుల నిమిడ్చి యాంధ్రభాషకు మహోపకార మొనర్చుట విశేషములలో విశేషమనక తప్పదు నన్నిచోడ మహారాజచంద్రుడు గీర్వాణాంధ్ర కవితా ధురంధరుడై సాహిత్య లోకమునకు సౌందర్యము సేకూర్చినాడు.

ఇతడు మా 'గుంటూరుసీమ' యందలి 'కొణిదెన' రాజధానిగా నేలిన మహనీయుడనియు, నాయూర జన్మించి, వర్ధిల్లి, విద్యాబుధుల గఱచి, రాజకార్యధురంధరుం డయి, కవిరాజశిఖామణియై, తేజరిల్లెననియు దెలిసికొని పెల్లుబ్బుచున్నారము.



ప్రఖ్యాత అమెరికా రచయిత లూయి ఫిషర్‌కు, బొంబాయి రచయితల స్వాగతం.



రాజఘాట్‌లో ఒక దేశభక్తుడు రాట్నము వడుకుచుండగా కాశ్మీర్ కమీషన్‌వారు పరిశీలించుచున్న దృశ్యం.

వార్తా చిత్రాలు




ఢిల్లీ నెహ్రూపార్కులో జరిగిన శాంతి సమావేశంలో ఉపన్యసిస్తున్న ఆచార్య వినోభాభావే, ఆ సమావేశానికి అధ్యక్షత వహించిన శ్రీమతి రామేశ్వరినెహ్రూ.




లండను ఒలింపిక్ పందేలలో పాల్గొన్న ఇండియన్ ఒలింపిక్ టీమ్ ఉద్యోగి,

శ్రీ నారిందాస్, యస్. పి. సోంధీగారు


భారతీయులజట్టుకు, జెండాలను ఎంబ్లెమ్‌లను, బొంబాయి పౌరులు వీరి ద్వారా ఆటగాండ్రకు పంపించారు.



మద్రాసురెవెన్యూ మంత్రికి రాజమహేంద్రవరం పత్రికా రచయితల సన్మానం.



మద్రాసు నూతన మంత్రి ఇండియన్ క్రిస్టియన్, డాక్టర్ యస్. గురుపాదంగారికి రాజాజీ హాలులో, సభ్యులు విందొసంగినప్పటి దృశ్యం. ప్రధాని ఓమాండూరు రామస్వామి రెడ్డిగారు మధ్యన, వారి ప్రక్కన గురుపాదంగారూ, ఉన్నారు.



భారత గవర్నరు జనరల్, సి. రాజగోపాలాచారి, సర్ మీర్జా ఇస్మాయిల్, మద్రాసు ప్రభుత్వ ఆర్థికమంత్రి బెజవాడ గోపాలరెడ్డిగారలకు జూలై 29-న విందు ఇచ్చిన సందర్భమున ఢిల్లీలో తీసిన ఛాయాచిత్రం.

Regd. No M. 4479

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, No. 7 Thambu Chetty St., G. T. Madras.